ఆదివారం
సాహితీ వ్యాసాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
కడప
fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 114 పేజీలు: 10+4 వెల: 6.50


ఘనంగా సిఎం చంద్రబాబు గృహప్రవేశం 2లో

## 2014 నుంచి ఎన్డీయె పాలనలో సత్వరాభివృద్ధి

### వికసిత్ ఆంధ్రగా రాష్ట్రం ముందడుగు

### సుపరిపాలనతో సాగుతున్న 'డబులింజన్' రాష్ట్రాలు

### 'సిందూర్' విజయం మోడీ సమర్థపాలనకు నిదర్శనం

### న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీయె సిఎంలు, డి.సిఎంల సమావేశంలో ఏపి డి.సిఎం పవన్ కళ్యాణ్


ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌డిఎ పక్షాల సమావేశం అనంతరం ప్రధాని మోడీతో కలిసి విందు ఆరగించిన డి.సిఎం పవన్

# టాప్-3 దిశగా భారత్

**విజయవాడ,మే25,ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశం ప్రపంచంలో నాల్గో అతిపెద్దఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ పక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ నీతిఆయోగ్ ప్రకారం, భారతదేశ జిడిపి ప్రస్తుతం 4.18 ట్రిలియన్‌కు చేరుకుందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి గల నాయకత్వం, అలాగే 2014 నుంచి ఎన్డీఏ ప్రభుత్వ ప్రగతిశీల పాలన నిదర్శనంగా చెప్పుకోవచ్చని తెలిపారు.

గత దశాబ్దంలో, ఎన్డీయె ప్రభుత్వ సుపరిపాలన కింద, భారత్ అభివృద్ధి పయనాన్ని నాలుగు ముఖ్యమైన అంశాలు నడిపించాయన్నారు.. భారత్ వృద్ధి కథ, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, చేరిక, డిజిటల్ పరివర్తన ద్వారా నడిచిందని పేర్కొన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి, వికసిత్ భారత్ 2047 వైపు నడిపించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి ఆశయాలతో జాతీయ అభివృద్ధికి దోహద పడేలా ఆదర్శంగా నిలుస్తుందనిపవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా...మార్గదర్శకత్వం వహించేలా ఎపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో డిసిఎం నివాళులు అర్పిం >>2

## యోగముద్రలో ఆంధ్ర



### తెలంగాణలో 'డ్రోన్ దీదీ'లు భేష్

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక్కటైన భారత్

### మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 25:** ఆపరేషన్ సింధూర్ చేపట్టి మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో మోడీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత మోడీ మన్‌కీ బాత్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఉగ్రవాదనికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సింధూర్ కొత్త ఉత్సాహాన్ని నింపిందని ప్రధాని అన్నారు. మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని చెప్పారు.

దేశ ప్రజలను ఆపరేషన్ సింధూర్ ఎంతగానో ప్రభావితం చేసిందని, అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగం చేసుకున్నాయని తెలిపారు. ఆపరేషన్ సమయంలో జన్మించిన చిన్నారులకు పలువురు సింధూర్ అని పేర్లు పెట్టుకున్నారనిచెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైందని, నేడు ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే సంకల్పంతో ఉన్నాడని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, మన ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనమని ప్రధాని అన్నారు. అనేక నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తిరంగా యాత్రలు నిర్వహించారని చెప్పారు. పౌర రక్షణ వాలంటీర్లుగా మారేందుకు అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారని తెలిపారు. అదేవిధంగా దేశంలో మావోయిస్టుల హింసాత్మక >>2



## మాజీ మంత్రి కాకాణి కేరళలో అరెస్ట్

### అక్రమ మైనింగ్ కేసు

**నెల్లూరు క్రైమ్ మే 25, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పరిధిలోని రుస్తుం క్వారీలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో ఆయన నాల్గవ ముద్దాయిగా ఉన్నారు. దీంతో పాటు మరి కొన్ని కేసులు ఆయనపై నమోదయి ఉన్నాయి. తనపై నమోదైన కేసుల్లో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోసం ఆయన జిల్లా స్థాయి నుండి సుప్రీంకోర్టు వరకు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు కూడా ఆయనకు ముందస్తుబేలు మంజూరు చేయకపోవడంతో అజ్ఞాతంలోకి వెళ్లి పోయారు. ఆయన కోసం గత కొంత >>2

# టెక్నాలజీలో ఎపి ముందంజ

### • ప్రపంచంలో అత్యుత్తమ రాజధాని కానున్న అమరావతి • ప్రధానితో జరిపిన చర్చలు సంతృప్తికరం • విశాఖ మోడల్‌ను అమరావతి, కర్నూలు, తిరుపతికి విస్తరిస్తాం • డిజిటల్ గవర్నెన్స్‌లో ఎఐ టెక్నాలజీ: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే25,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలో అత్యుత్తమ రాజధానిగా అమరావతిని నిలిపేందుకు చేపట్టిన ప్రతి కార్యచరణ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన పర్యటన విజయవంతమైందన్నారు.రాజధాని నిర్మాణం. పోలవరం-బనచర్ల నిర్మాణం, రాష్ట్రం ఇంధన పునరుత్పత్తి రంగంతో సహా పలు అంశాల్లో ప్రభుత్వం దూరదృష్టితో తీసుకుంటున్న చర్యలను ప్రధాని నరేంద్రమోడీకి వివరించామన్నారు. కీలకరంగాలకు చెందిన ఏడుగురు కేంద్రమంత్రులకు మన రాష్ట్ర విజన్‌పైన., అభివృద్ధి అవసరతలపై సమగ్ర సమాచారాన్ని అందించామన్నారు.

'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనపై పలు అంశాలు వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4తో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 4వ నుంచి త్వరలో 3వ స్థానానికి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమంతో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్‌ఎంఇ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని వివరించారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను కూడా సిఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్సులో గూగుల్ ఎఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్‌హబ్, ఎఐ ఆధారిత పాలనతో రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయపడ్డారు.


**జిడిపి, పాపులేషన్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీపై చర్చ**

పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు,ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పిపిపి ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాప్ >>2

## జపాన్ కంటే భారత్ ఆధిక్యం

### -మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ నిరంతరంగా ఎదుగుతున్నదని,మోడీ నాయకత్వంలో దేశం కీలక ఆర్థిక వ్యవస్థగా మారుతుందని వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. భారత దేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్న అధికారిక ప్రకటనపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. త్వరలోజర్మనీనికూడా అధిగమించి ప్రపంచంలో అతి పెద్ద మూడవ ఆర్థిక శక్తిగా భారత్‌నిలుస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతల్ని స్వీకరించినప్పుడు ప్రపంచంలో 11వ స్థానంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ నిరంతరం ప్రగతిమార్గంలో పయనించడానికి ప్రధాని మోడీ నాయకత్వంలో 'టీమ్ ఇండియా' చేసిన కృషేకారణమన్నారు. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద లేదా రెండవస్థానానికి భారత్ ఎదగడం ఖాయమన్నమంత్రి ఆ దిశగా దేశ ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేసి 'వికసిత భారతావని' ఆవిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.



## కలవరపెడుతున్న కొవిడ్ వైరస్

### బెంగళూరులో ఒకరి మృతి

**న్యూఢిల్లీ, మే 25:** దేశంలో మళ్లీ కొవిడ్19 కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. కరోనా కారణంగా ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు పలు రాష్ట్రాల్లో కేసులు నమోదు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. కొవిడ్ 19తో మహారాష్ట్రలోని థాణెలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందగా, బెంగళూరులో 85 ఏళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. గడచిన 24 గంటల్లో 108 మందికికరోనా పరీక్షలుచేస్తే ఐదుగురికి నిర్ధారణ అయింది. ప్రస్తుతం కర్ణాటకలో 38 కేసులున్నాయి. వీరిలో 32 మంది బెంగళూరు మహానగరంలోనే చికిత్స పొందుతున్నారు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. థాణెలో శనివారం కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 18 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. వీరిలో 17 మంది తమ హోం క్వారంటైన్‌లో ఉండి చికిత్స తీసుకుంటున్నారని, ఒకరు మాత్రమే ఆస్పత్రిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నోయిడాకు చెందిన 55 ఏళ్ల మహిళకు కూడా కరోనా సోకింది. ప్రస్తుతం ఆమె హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో కొత్తగా రెండు కేసులు వెలుగులోకి వచ్చాయి. అలాగే ఉత్తరా ఖండ్‌లోనూ కరోనా కేసులు >>2

# వాడవాడల్లో యోగా



### నెల రోజులపాటు విస్తృత కార్యక్రమాలు

### రాష్ట్రస్థాయినుంచి గ్రామస్థాయి వరకు యోగాలో శిక్షణలు

### జూన్ 21న అత్యంత భారీగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ

**విజయవాడ, మే 25 ,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర 2025 అనే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వైద్య శాఖ ప్రకటించింది.మే 21 నుండి జూన్ 21 వరకు ఒక నెల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యోగా ప్రదర్శనలు, పోటీలు,శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు మరియు చారిత్రక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు నిర్వహించి, యోగాభ్యాసం పట్ల ప్రజలలో అవగాహన పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యోగా గురువులు, యోగా శిక్షకులు, వాలంటీర్లు,యోగా అభ్యాసకులు,సాధారణ ప్రజలం దరూ ఈ కార్యక్రమాల్లో నమోదు చేసుకుని పాల్గొనవచ్చు.

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో థీమ్ ఆధారిత యోగా ప్రదర్శనలు, పోటీలు, సామూహిక యోగాభ్యాసం వంటి కార్యక్రమాలు జరుగుతాయి.మొదటి వారంలో (మే 2127) అనంతపురం జిల్లాలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం తాడిపత్రిలో, కర్నూల్‌లోని హరిత రాక్ గార్డెన్ ఓర్వకల్‌లో, విజయవాడలోని గాంధీ కొండపై,ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. అలాగే అనకాపల్లి, చిత్తూరు, కోనసీమ, శ్రీకాకుళం,పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రసిద్ధ క్షేత్రాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈవారంలో యోగా సంఘాలు, యోగాభ్యాసకుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు గుంటూరు >>2


ఆదివారం మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రులు నారాయణ, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

# 'పసుపు' కడప

### మహానాడుకు విస్తృత ఏర్పాట్లు

### రాష్ట్ర మంత్రులంతా అక్కడే మకాం

### నేడు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రాక

**కడప, మే 25, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం మహా పండుగ మహానాడుకు 'కడప'ంతా పసుపు మయం అయింది. కడప నగరం అంతా తెలుగుదేశం హోర్డింగులు, బ్యానర్లతో పసుపు పండగ లాగా మారింది. ప్రధాన రహదారులు మహానాడు జరిగే కడప-చిత్తూరు జాతీయ రహదారి కూడ పసుపు మయం అయింది. మహానాడుకు ఒక్క రోజే వ్యవధి ఉండటంతో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్రమంత్రులు అంతా దాదాపు కడపలోనే మకాం వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం 6:20కి కడపకు చేరుకోనున్నారు. రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ మధ్యాహ్నం >>2



# 'రోహిణి'పై వాన తెరలు

### తెలుగు రాష్ట్రాల్లో కమ్ముకుంటున్న కారు మబ్బులు

### ఢిల్లీ, చెన్నై, కేరళలో భారీ వర్షాలు

### దేశ రాజధానిలో 200 విమానాలు నిలిపివేత

**న్యూఢిల్లీ/విజయవాడ, మే 25:** ఎండలు మండించే రోహిణి కార్తెలో భారీ ఎత్తున వర్షాలు కురుస్తున్నాయి. తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లోకూడా ఇదే పరిస్థితి. మండు వేసవిలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు ఉండే రోహిణి కార్తె సహజంగా మేమాసం మూడోవారంలో ఉంటుంది. రోహిణిలో రాళ్లు సైతం పగులుతాయన్న సామెత ఇప్పటికీ నానుతూనే ఉంటుంది. అలాంటి రోజుల్లో ఒక్కసారిగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళా ఖాతం అరేబియా సముద్రాలలో ఏర్పడుతున్న అల్పపీడన ప్రభావంవల్ల ఈ వర్షాలు కురుస్తున్నట్లు అంచనా. దీనికితోడు రావాల్సిన నైరుతి ముందే కూసింది. మేనెల రెండోవారంలోనే అండమాన్ >>2

### పార్టీ, కుటుంబం నుంచి కొడుకును బహిష్కరించిన లాలూ

### కువైట్‌లో 42 వేల మంది పౌరసత్వం రద్దు

5లో



ఆదివారం కుప్పంలో సిఎం చంద్రబాబు గృహప్రవేశం సదర్భంగా హోమంలో పాల్గొన్న సిఎం కుటుంబ సభ్యులు

# ఘనంగా సిఎం చంద్రబాబు గృహప్రవేశం

## భారీగా తరలివచ్చిన ప్రజలు.. 30 వేల మందికి భోజనాలు

**కుప్పం, మే 25 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద సిఎం చంద్రబాబునాయుడు సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం వేకువజామున ఐదు గంటలనుంచి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి, తనయుడు, రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు శివపురం వద్ద నిర్మించిన నూతన ఇంటికి దేవతా మూర్తుల ప్రతిమలతో హాజరయ్యారు. అనంతరం నూతన గృహంలో వేదపండితులు పూజాది, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సిఎం చంద్రబాబు దంపతులు గోపూజ నిర్వహించారు. మంత్రి లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి నూతన ఇంట్లో పాలు పొంగించారు. మధ్యాహ్నం సిఎం చంద్రబాబునాయుడు కుటుంబంతో కలిసి భోజనం చేశారు. ముఖ్యమంత్రి గృహ ప్రవేశ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గం నుండే కాక వివిధ ప్రాంతాలనుంచి సైతం ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంకు హాజరయ్యారు. గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు, ప్రజలకు సిఎం చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు చక్కటి విందు భోజనాన్ని ఏర్పాటుచేయించారు. దాదాపు ముప్పై వేలమందికి సిఎం కుటుంబీకులు భోజన ఏర్పాట్లు చేశారు. సిఎం చంద్రబాబునాయుడు గృహ ప్రవేశ కార్యక్రమంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్ డా॥ థామస్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు,నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీదేవి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితరులు హాజరయ్యారు. అలాగే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తదితరులు హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, రాష్ట్ర నేత డా॥ బీఆర్ సురేష్‌బాబు, కడ సలహా కమిటీ, కుప్పం టిడిపి సమన్వయకమిటీ, క్లస్టర్,యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. రాత్రి కుప్పంలోనే బసచేశారు.

**కుప్పంలో గృహప్రవేశం ఆనందంగా ఉంది : సిఎం సతీమణి నారా భువనేశ్వరి**

కుప్పంలో తమ సొంత ఇంటి గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. కుప్పం తమ ఇల్లుకని కుప్పం ప్రజలంతా తమ కుటుంబసభ్యులని పేర్కొన్నారు. 36 ఏళ్లుగా కుప్పం ప్రజలు తమకు అండగా నిలబడ్డారన్నారు. కుప్పం ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆశీస్సులను తాము మరువమని పేర్కొన్నారు. తమ సొంతింటి పండగగా గృహ ప్రవేశను నియోజకవర్గ నలుమూలలనుంచి తరలివచ్చిన ప్రజల మధ్య జరిగిన ఈ శుభకార్యం తనకు ఎన్నటికీ గుర్తుండిపోతుందన్నారు.

**ప్రజల ఆశీస్సులు మాకు దీవెనలు : మంత్రి నారా లోకేష్**

ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ తమకు దీవెనలుగా నిలుస్తాయని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది తమ కుటుంబ పండగ కాదని అందరి పండగలా ఉందన్నారు. తమ కుటుంబానికి ప్రతి అడుగులో తోడుగా ఉన్న అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




ఆదివారం న్యూఢిల్లీలో ఎన్డీయె సిఎంల సమావేశానికి హాజరైన బీహార్ సిఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సిఎం సమ్రాట్ చౌధురి

# యోగముద్రలో ఆంధ్ర

>> చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం ఇకపై కొనసాగుతుందని ప్రధాని స్పష్టంచేశారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు.

తెలంగాణలో డ్రోన్ దీదీలపై ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందారని వివరించారు. పండ్ల తోటలపై పురుగుమందులు, పిచికారీ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరిని స్కై వారియర్స్‌గా ప్రధాని మోడీ అభివర్ణించారు. సాంప్రదాయ పద్ధతుల కంటే వేగంగా, సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చునన్నారు. నీటిని, మందుల వినియోగాన్ని 30-40 శాతంవరకు తగ్గించ వచ్చునని చెప్పారు. మహిళల ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెరిగిందని గుర్తు చేశారు. డ్రోన్ టెక్నాలజీని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఇది ఒక గొప్ప ముందడుగు అని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 'డ్రోన్స్ ఫర్ అగ్రికల్చర్' పథకం కింద మహిళా బృందాలకు రాయితీతో డ్రోన్లు అందిస్తోందని వివరించారు. శిక్షణా కేంద్రాలు, డ్రోన్ లైసెన్సింగ్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఈ మన్ కి బాత్‌లో ప్రధాని మోడీ చెప్పారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర'అనేప్రత్యేక ప్రచారాన్ని నెల ముందే ప్రారంభించిందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజేయడం, ప్రతి గ్రామానికి, పాఠశాలకు యోగాసాధనను పరిచయం చేయడం ఈ యోగాంధ్ర ఉద్యమం ప్రధానఉద్దేశమని వివరించారు. ఈ ఉద్యమంలో 10 లక్షల మందికిపైగా యోగా అభ్యాసకులు పాల్గొనబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేక శిబిరాలు, స్కూల్ యోగా ప్రోగ్రామ్‌లు, మెగా ఈవెంట్‌లు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమయ్యాయని ప్రధాని మోదీ ఏపి సర్కారుపై ప్రశంసలు కురిపించారు.

# టాప్-3 దిశగా భారత్

>> చారు, సాయుధ బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా.. నాయకత్వం వహించారని డిసిఎం ప్రశంసించారు. ఈ చారిత్రక విజయం ప్రధాని నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వానికి, ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని పవన్ కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన భాగస్వామ్య పక్షాల సమావేశం ఆదివారం ఢిల్లీలోని అశోకా హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు. ప్రపంచంలో నవభారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్2047 వైపు నడిచేందుకు ఇది ఓ ముఖ్యమైన అడుగు" అని పవన్ కల్యాణ్ అన్నారు.అయితే ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించిన విషయం పవన్ ప్రస్తావించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో పవన్ మాట్లాడుతూ, ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. 3 ఏళ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నామని వెల్లడించారు. మోడీ 3.0లో ఏడాది పాలన, ఆపరేషన్ సిందూర్, దేశభద్రత సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జెపి నడ్డా, అమిత్‌షా, రాజ్‌నాథ్, ఎన్డీఏ సీఎంలు, డిప్యూటీ సిఎంలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఏపి నుంచి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ముందస్తు షెడ్యూల్ కారణంగా సమావేశానికి హాజరుకావడం లేదని ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు సమాచారం ఇచ్చారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై మాట్లాడారు. ఈ భేటీలో ఉత్తమ విధానాలపై పలు రాష్ట్రాల సిఎంలు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఓ ట్వీట్ చేశారు. ఇక ఈ సమావేశం అనంతరం ప్రధాని నరేంద్రమోడీతో కలిసి డిసిఎం పవన్ కల్యాణ్ భోజనం చేసారు.ఈ సందర్భంలో పలు అంశాలను,కీలక రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు,గ్రామీణాభివృద్ధి డీసీఎం ప్రధానితో మాట్లాడారు.

# 'రోహిణి'పై వాన తెరలు

>> తీరంలో తళుక్కుమన్నాయి. అటుపిమ్మట లక్షద్వీప్, కేరళ తీరాలను తాకాయి. దీనితో ఇక నైరుతి పవనాలు వచ్చేసాయన్న భావన కలుగుతోంది. సహజంగా జూన్‌మొదటివారంలో వచ్చే నైరుతి ఈసారి మే మధ్యస్తంలోనే పలకరించింది. సముద్రతీర జిల్లాల్లో ఈ వర్షాల ప్రభావం మరింతగా ఉంది. ఒక్కసారిగా తెలుగురాష్ట్రాల్లో వేసవి ఉష్ణోగ్రతల ప్రభావం తగ్గిపోయింది.గడచిన మూడురోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో అయితే రోడ్లన్నీ కూడా కాలువలమాదిరగా మారిపోయాయి. కార్లు, బైకులు ఇతర అన్ని వాహనాలు కూడా చక్రాలు మునిగేస్థాయిలో వర్షపునీటిలో వెళుతున్నాయి. ఢిల్లీ, తమిళనాడు, కేరళ, హార్యానా, యుపి వంటి రాష్ట్రాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 200కిపైగా విమానసర్వీసులు నిలిపివేసారు. మరో 49 విమానసర్వీసులను రూటు మళ్లించారు. టెర్మినల్1వద్ద ఉన్న పైకప్పు కూలిపోవడంతో అక్కడ జనసంచారాన్ని కూడా పూర్తిగా నిలిపివేసారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 81 మిల్లీమీటర్లు, పాలంలో 68, పూసా 71, మయూర్‌విహార్ 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్లవేగంతో గాలులు వీస్తాయని హెచ్చరికలు కూడాజారీచేసారు. కేరళ, తమిళనాడుల్లోని తీరప్రాంత జిల్లాలన్నింటినీ అప్రమత్తంచేసారు.ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్‌జారీచేసారు. తూత్తుకుడి, పాంబన్‌లలో మూడో నంబరు జారీచేస్తే నీలగిరి, కోయంబత్తూరుల్లో రెడ్ అలర్ట్ జారీ అయింది. కేరళలో 11 జిల్లాలకు వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. దీనితో స్కూళ్లు ఇతర విద్యాసంస్థలన్నింటిని మూసివేసారు. పతనంతిట్ట, త్రిశూరు, ఇడుక్కి, ఎర్నాకుళం, వాయనాడు, కాసర్‌గడ్ జిల్లాల్లో విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తన నియోజకవర్గపరిధిలోని వాయనాడు, మాలాప్పురం, కోజికోడ్‌జిల్లాల కలెక్టర్లతో సమావేశం అయి పరిస్థితిని సమీక్షించారు.

**గంటకు 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు**

బంగాళాఖాంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. తీరం వెంట గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఇవాళ అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి కర్నూల్, నంద్యాల శ్రీకాకుళం, ఏలూరు ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. అదేవిధంగా సోమవారం గుంటూరు బాపట్ల ప్రకాశం కర్నూల్ నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలుకూడా కురుస్తాయని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్-గోవా తీరానికి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడనుంది. ఇది మరింత బలపడేందుకు అనుకూల వాతావరణం ఉంది. రాబోయే రోజుల్లో తుపానుగా బలపడే అవకాశం కూడా ఉంది. దీంతో ఈ నెల 26,27 తేదీల్లో ఏపీలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది

# కేరళలో అరెస్ట్

>> కాలంగా నెల్లూరు పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కాకాణిని కేరళ రాష్ట్రంలో నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఆయన్ను సోమవారం నెల్లూరు కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉందని తెలుస్తోంది. కేరళలో ఏపి పోలీసులు అరెస్ట్ చేసి నట్టు సమాచారం.

# కొవిడ్ వైరస్

>> రెండు నమోదైనట్లు అధికారులు తెలిపారు. చార్‌ధామ్‌యాత్ర సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఇక మే నెలలో ఇప్పటివరకు ఒక్క కేరళలో అత్యధికంగా 273 కొవిడ్ కేసులు వెలుగుచూశాయి. అటు దిల్లీలో 23 మందికి కరోనా సోకింది. ఏపిలో నాలుగు, తెలంగాణలో 1కేసు నమోదయ్యాయి. అయితే, క్రియాశీలకంగా ఉన్న కేసుల్లో రోగుల పరిస్థితి సాధారణంగా ఉందని అధికారులు చెబుతున్నారు. అందరూ ఇంటి దగ్గరే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

# పోలవరం ఎత్తిపోతలపై తెలంగాణ అభ్యంతరం

## గోదావరి బోర్డు, చీఫ్ ఇంజినీర్‌కు లేఖలు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం నీటిపారుదల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)కి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) జి అనిల్‌కుమార్ లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్టు ఏప్రిల్ ఎనిమిదిన జరిగిన పిపిఎ సమావేశంలో పోలవరం చీఫ్ ఇంజనీర్ తెలిపినా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ సన్నాహాలు చేపట్టిందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని వివరించారు. దీంతో గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వస్తుందని లేఖలో తెలియజేశారు. ప్రధానంగా పోలవరం డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని పోత్తిపోయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతూనే ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్‌స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజమని అభ్యంతరం చెప్పారు. డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సిడబ్ల్యుసి మార్గదర్శకాలు, అనుమతులకు విరుద్ధమని పేర్కొన్నారు. సిడబ్ల్యుసి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యతిరేకంగా ఉందని లేఖలో వివరించారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముందుకు పోకుండా ఆపాలని విజ్ఞప్తి చేశారు

# వాడవాడల్లో యోగా

>> జిల్లాలో,జైళ్లలో యోగా ప్రోగ్రామ్‌లు తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహిస్తారు.రెండవ వారంలో (మే 28 జూన్ 3) గుంటూరు జిల్లాలోని ఉండవల్లి గుహలు, నెల్లూరులోని స్వర్ణల చెరువు, సత్యసాయి జిల్లాలోని పుట్టపర్థి,తిరుపతిలోని ఎస్.వి. జూపార్క్, విశాఖపట్నంలోని తోట్లకొండ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. అంగన్‌వాడీ,ఆరోగ్య కార్యకర్తలు,రైతులు,వైద్య అధికారులు,పోలీసు,మాజీ సైనికులు,రక్షణ శాఖ సిబ్బంది, కుటుంబ యోగా, ఆటో మరియు లారీ సంఘాలు, మత్స్యకారుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు వివిధ జిల్లాల్లో నిర్వహిస్తారు. మూడవ వారంలో (జూన్ 49) అరకులోని గిరిజన మ్యూజియం,కడపలోని సిద్ధవటం కోట,కాకినాడ జిల్లా లోని సామర్లకోట దేవాలయం, విజయనగరంలోని చింతపల్లి బీచ్,అనంతపురంలోని శిల్పారామం వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. గిరిజన సమాజం, ఆషా కార్యకర్తలు,స్థానిక సంఘాలు మరియు వివిపీలు, ఉపాధ్యాయులు,వృద్ధులు, సాంస్కృతిక కళాకారులు మరియు యువజన సంఘాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాలుగవ వారంలో (జూన్ 1015) గుంటూరు జిల్లా మంగళగిరి ఈకో పార్క్, కర్నూలులోని కొండారెడ్డి బురుజు,తిరుపతిలోని కాళహస్తి,విశాఖపట్నంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. ఉపాధిహామీ కూలీలు, బ్యాంకర్లు,సహకార సంఘాలు,వ్యాపార సమాజం, దుకాణదారులు,వీధి వ్యాపారులు,పారిశ్రామిక కార్మికులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, వైకల్యులు,ప్రముఖుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఐదవ వారంలో (జూన్ 1621) కోనసీమలోని ఓడపల్లి దేవాలయం, గుంటూరులోని మానస సరోవర పార్క్,అరకులోని మారేడుమిల్లి,తిరుపతిజిల్లా శ్రీహరికోట,నంద్యాలలోని అహోబిలం దేవాలయం, కాకినాడలోని బీచ్ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి.గ్రామ మరియు వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, క్రీడాకారులు మరియు యువజన సంఘాలు,స్వయం సహాయక బృంద మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున బాపట్లలోని సూర్యలంక బీచ్ మరియు రామాపురం బీచ్‌లలో కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే అనంతపురం జిల్లాలోని లేపాక్షి దేవాలయంలో కూడా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్ని వయస్సుల వారికి యోగా పోటీలు,సామూహిక యోగాభ్యాసం,మిశ్రమ వయస్సుల గ్రూప్ యోగా వంటి కార్యక్రమాలు జరుగుతాయి.ఈ కార్యక్రమంలో భాగంగా 2,600 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా 1,25,000 మంది గ్రామ మరియు పట్టణ స్థాయి శిక్షకులను తయారు చేస్తారు. ఈ శిక్షకుల ద్వారా రాష్ట్రంలో 70 లక్షల మంది ప్రజలకు యోగా శిక్షణ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో ఈ యోగా పోటీలు జరుగనున్నాయి.

యోగా పోటీల్లో మూడు వయోవర్గాలు వారు పాల్గొనవచ్చు. 'జూనియర్' వర్గంలో 10 నుండి 18 సంవత్సరాల వరకు, "'యంగ్' వర్గంలో 19 నుండి 35 సంవత్సరాల వరకు, 'సీనియర్' వర్గంలో 35 సంవత్సరాలకు మించిన వారు పాల్గొనవచ్చు. సోలో యోగాలో ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం,ధ్యానం వంటి విభాగాలు ఉంటాయి. గ్రూప్ యోగా,యోగా పాట, చిత్రలేఖనం, యోగా నాటకం మరియు నాట్యం, క్విజ్, పోస్టర్, నినాదం,వ్యాసం,షార్ట్ ఫిల్మ్,ఫోటోగ్రఫీ,ముగ్గుల పోటీలు కూడా నిర్వహిస్తారు. ఈ పోటీలు ఉదయం 7:30 నుండి సాయంత్రం 6:00 వరకు జరుగుతాయి.రాష్ట్ర స్థాయి పోటీలు ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు జరుగుతాయి.

# వారం - వర్జ్యం

తేది : 26-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి మ.12.12
భరణి ఉ.8.23, కృత్తిక తె.5.32
వర్జ్యం మ.12.42-3.32
దు.మ.12.31-1.23, 2) మ.3.07-3.59
రాహుకాలం - ఉ.7.30-9.00

# వార్తాఫలం

**మేషం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. బాకీలు వసూలవుతాయి. వాహనసౌఖ్యం.

**వృషభం :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు.

**కర్కాటకం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి.

**సింహం:** నూతన ఒప్పందాల విషయాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కన్య :** మిత్రులు శత్రువులుగా మారి సమస్యలు సృష్టిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**తుల :** వసులలో జాప్యం జరిగినా నిదానంగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంఘంలో ఆదరణ పొందుతారు.

**ధనుస్సు:** సన్నిహితులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. ప్రముఖుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలు లాభిస్తాయి. వస్తు సేకరణ.

**మీనం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది. స్వల్ప ధనలాభం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గండవరం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం, ఒకరు మృతి

**కొడవలూరు (నెల్లూరు), మే 25, ప్రభాతవార్త :** మండలంలోని గండవరం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఆగివున్న ట్రావెల్స్ బస్సును చీమకుర్తి నుంచి చెన్నై పోర్టుకు వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా ఢీకొనింది. విజయవాడ నుండి 40 మంది ప్రయాణికులతో నాగూర్ నాగపట్నం టూర్ వెళుతున్న ట్రావెల్స్ బస్సు ఢీకొనడంఈ ప్రమాదంలో బాబురావు అనే వ్యక్తి మృతి చెందాడు. బస్సులోని 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు చెందారు. కక్ష గాత్రులను 108 ద్వారా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సంఘటన తెలుసుకున్న నెల్లూరు రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు పరిశీలన చేశారు. సంబంధిత సీఐ సిఐ సురేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీస్‌స్టేషన్ పైకప్పు కూలిపడి ఏసిపి దుర్మరణం

**ఘజియాబాద్, మే 25:** దేశ వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. నిన్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానాలలోనూ ఇదే పరిస్థితి. శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెద్ద పెద్ద చెట్లు నేల కొరిగాయి. ఈ నేపథ్యంలోనే ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా పోలీస్ స్టేషన్ పైకప్పు ఊడిపడిపోయింది. దీంతో ఓ పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన వీరేంద్ర కుమార్ మిశ్రా అంకుర్ విహార్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లోనే నిద్రపోయాడు. రాత్రి భారీ వర్షం పడ్డం వల్ల పోలీస్ స్టేషన్ పైకప్పు మొత్తం ఊడి కిందపడింది. ఆ శిథిలాలు మీదపడి వీరేంద్ర అక్కడికక్కడే చనిపోయాడు. ఆదివారంఉదయం కొంతమంది పోలీసులు స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ కుప్పకూలిపోయి ఉండటం గమనించారు. అక్కడే శిథిలాల కింద వీరేంద్ర తీవ్రగాయాలతో కనిపించాడు. ఆ పోలీసులు అతడిని ఆస్పత్రికితీసుకెళ్లారు. వీరేంద్రను పరీక్షించినవైద్యులు అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు.

# టెక్నాలజీలో ఏపి ముందంజ

>> ఫండింగ్‌కు మద్దతుగా ఉండటంతో జిడిపి వృద్ధికి దోహదపడుతుందని సిఎం అన్నారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌తో దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్ల పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా.. మార్గదర్శకత్వం వహించేలా ఏపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. వికసిత భారత్2047కి ఆంధ్రప్రదేశ్ వాటాగా 2047 కల్లా 2.4 లక్షల కోట్ల డాలర్ల జిఎస్‌డిపి సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం చతుర్ముఖ వ్యూహం అనుసరించనున్నట్లు నీతి ఆయోగ్ 10వ పాలకమండలి సమావేశంలో వివరించామన్నారు. తూర్పుతీరాన్ని ఆధారంగా చేసుకొని రాష్ట్రాన్ని ఆగ్నేయాసియా ముఖద్వారంగా మారుస్తామని ప్రకటించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని గమ్యంగా పెట్టుకున్నట్లు సిఎం పేర్కొన్నారు. ఏపిలోని మానవ వనరులు, సహజ వనరుల అనుకూలతను ఉపయోగించుకొని వచ్చే 22 సంవత్సరాల్లో దాదాపు 15 శాతం వరకు వార్షిక వృద్ధి రేటు సాధిస్తామని చంద్రబాబు వివరించామన్నారు.. రాష్ట్ర తలసరి ఆదాయాన్ని 42,000ల డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలనూ గతిశీలంగా తయారుచేయాలన్నది తమ సంకల్పమని ఆయన తెలిపారు.

నైపుణ్యవంతమైన మానవ వనరులు ఏపి ప్రధాన బలమని సిఎం వెల్లడించారు. దేశంలో అందరి కంటే ముందు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా తెలుగు సమాజం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతోందని ఆనందం వ్యక్తం చేశారు. దాన్ని మరింతగా పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి ఐటీ హబ్‌లు, పటిష్ఠమైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించి స్టార్టప్స్ సంస్కృతిని ప్రోత్సహించబోతున్నట్లు వివరించారు. ఏపిని అమరావతి, తిరుపతి, కర్నూలు ఓర్వకల్లు, గోదావరి జోన్లుగా విభజించి ప్రాంతీయంగా అభివృద్ధి చేయబోతున్నట్లు సిఎం తెలిపారు. రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖను ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, విశాఖపట్నంలో మెడ్‌టెక్ జోన్లు అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వీటికి తోడు విశాఖ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లలో పారిశ్రామిక నగరాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో బ్లూ, వైట్‌కాలర్ జాబ్‌లు సృష్టించి ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు.

మోడీ పదేళ్ల పాలన దేశానికి బలమైన పునాదులు వేసిదంటూ ప్రధాని నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రశంసించారు. జన్‌ధన్ ఆధార్ మొబైల్, స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్, జిఎస్టీ అమలు, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, స్టార్టప్, స్టాండప్ ఇండియా, పిఎం గతిశక్తి, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు భారత్‌ను ప్రబలమైన ఆర్థిక శక్తిగా నిలిపేందుకు దోహదం చేశాయని వివరించారు.

# 'పసుపు' కడప

>> 2గంటల కల్లా బెంగుళూరు నుంచి విమానంలో కడపకు చేరుకుంటారు. మహానాడు ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రుల బృందం కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో చర్చించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు ఇతర మంత్రులు చర్చించారు. మహానాడు వేదికను అచ్చెన్నాయుడు పరిశీలించి ఏర్పాట్లపై పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసుల రెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిలతో చర్చించారు. మరో వైపు సిఎం పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ట్రయిల్ రన్ నిర్వహించారు. మహానాడు వేదిక వద్ద అచ్చెన్నాయుడు, రాజంపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయిజనసమీకరణ సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు ప్రాణం పోసుకున్నాయి అని వెల్లడించారు. తెలుగు గంగ, కెసి కెనాల్, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి, హెచ్ఎల్‌సీ అన్నమయ్య ప్రాజెక్టు తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించినవే అని పేర్కొన్నారు. అందుకే సీమ ప్రజలు మహానాడు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా చంద్రబాబు రాయలసీమకు ఏమి చేస్తారో అన్న విశ్వాసంతో కూడ ఎదురుచూపులు చూస్తున్నారని పేర్కొన్నారు. రాయలసీమ ప్రజలు తెలుగుదేశం పార్టీ పట్ల ఉన్న ప్రేమానురాగాలే ఇందుకు నిదర్శణం అన్నారు. రాయలసీమ బిడ్డగా చెప్పుకునే వైఎస్ జగన్‌మోహన్ రాయలసీమకు ఏమిచేశారని ప్రశ్నించారు.

# ఇసుక దాహంతోనే 41మంది జల సమాధి

### యంత్రాలను బయటకు తెచ్చేందుకే అన్నమయ్య ప్రాజెక్టును కొట్టుకుపోయేలా చేశారు: మంత్రి నిమ్మల ధ్వజం

**రాజంపేట అర్బన్, మే 25, ప్రభాతవార్త:** అన్నమయ్య ప్రాజెక్ట కొట్టుకుపోవడానికి వైసీపీ ఇసుక దోపిడినే అని ఇసుకను తరలించేందుకు నదిలో యంత్రాలు, వాహనాలను బయటకు తెచ్చేందుకే ప్రాజెక్ట గేట్లు ఎత్తకుండా 41మంది జల సమాధికి కారకులు అయ్యారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం కడపలో జరిగే మహానాడుకు జన సమీకరణపై రాజంపేట నియోజికవర్గ స్థాయి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ హయాంలో ఇసుక దోపిడి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. ఇసుక దోపిడితోనే రాజంపేట మండలంలో అన్నమయ్య ప్రాజెక్ట కొట్టుకుపోయిందన్నారు. అన్నమయ్య ప్రాజెక్ట పై భాగాన ఉన్న ఫించా ప్రాజెక్ట కొట్టుకుపోయి పెద్దఎత్తున వరద నీరు వస్తుందని గేట్లు ఎత్తాలని అన్నమయ్య ప్రాజెక్ట అధికారులను కోరిన ఎత్తలేదన్నారు. అందుకు కారణం చెయ్యేరు నదిలో



ఆదివారం రాజంపేటలో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రక్కనే మాజీ మంత్రి పి.పుల్లారావు, జగన్‌మోహన్ రాజు

ఇసుకను తరలించేందుకు పెద్ద ఎత్తున ఉన్న యంత్రాలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఒడ్డుకు చేరేవరకు గేట్లు ఎత్త వద్దని వైసీపీ నేతలు ఒత్తిడి చేశారన్నారు. దీంతో అధికారులు వెంటనే వరద నీరును కిందికి పంపేందుకు గేట్లు ఎత్తలేదని ఫలితంగానే వరద నీరు విరుచుకుపడి 41మంది మృతి చెందారన్నారు. ప్రాజెక్ట కొట్టుకుపోయి 41మంది మరణించినా సీఎంగా ఉన్న జగన్ ప్యాలస్‌ను వీడి పరామర్శించేందుకు కూడ రాలేదని విమర్శించారు. అయితే ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు వరదల్లోనే ప్రాజెక్టును పరిశీలించి వరద బాధిత గ్రామాల్లో పర్యటించి వదర బాధితులను పరామర్శించారని గుర్తు చేశారు. ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఈ హామీని నెరవేర్చే బాధ్యత తమ ప్రభుత్వమే తీసుకుంటుందని స్పష్టం చేశారు.

కేంద్ర జల సంఘం సూచించిన మేరకు అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిం చేందుకు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. అంచానలు కూడ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతవరకు రైతు లకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతలు పథకం ఏర్పాటుచేసే ఆలోచన కూడ ఉందన్నారు. రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ జగన్‌మోహన్ రాజు మాట్లా డుతూ రాజంపేట నియోజికవర్గం నుంచి 1000వాహనా లను మహానాడుకు జనాన్ని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఒక్క 'లైక్' కోసం ప్రాణాలు వదిలేస్తారా?



'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న గోరేటి వెంకన్న,రసరాజు,ఘంటశాల నిర్మల తదితరులు

**తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆవేదన**

**విజవాడ, మే 25 ప్రభాతవార్త:** రాజ్యాంగ నైతికతను కవులు భుజానికెత్తుకోవాల్సిన అవసరం వుందన్నారు. ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నరుపేట బాలోత్సవ భవన్లో బంగారురాజు కంఠ రచించిన "దుఃఖం పండుతున్న నేల "కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉమ్మడిగా గెంతెత్తాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు వుందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా బిక్కి కృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీగేయ రచయిత రసరాజు మాట్లాడుతూ కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు ఘంటశాల నిర్మల మాట్లాడుతూ స్త్రీలను గౌరవించేదే గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతీచోట స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు డాక్టర్ కోయకోటేశ్వరరావు కావ్య విశ్లేషణ చేస్తూ ముక్తిని డోర్ డెలివరీ చేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాతత్వంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమేనన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులిచ్చే అధికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుండడం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి, ప్రముఖ కవి డా జెల్ది విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగారురాజు కంఠ, సాహితీవేత్తలు డా ఘంటా విజయ్ కుమార్, సరికొండ నరసింహరాజు, వొరప్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

# ప్రారంభమైన గుంటూరు-గుంతకల్లు డబుల్‌లైన్ రైలు మార్గం పనులు-2

**గుంతకల్లు రైల్వే,మే 25,ప్రభాతవార్త:** మర్మ గోవా-బందరు ప్రధాన రైలు మార్గంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు మధ్య ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నల్లమల అటవీ ప్రాంతంలో ప్రస్తుతం జరుగుతున్న రెండో రైలు మార్గం ప్రాజెక్ట పనులు అత్యంత కీలకమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో రైలు మార్గం నిడివి 28కి.మీల మేర కలిగి ఉంటుంది. ప్రకాశం జిల్లాలోని దిగువమెట్ట-నంద్యాల జిల్లాలోని గాజులపల్లి స్టేషన్‌ల మధ్య రెండు సొరంగ రైలు మార్గాలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో చలమ వద్ద 0.34కి.మీల సొరంగం ఒకటి కాగా, మరొకటి బొగడ సమీపంలోని దొరబావి వంతెన వరకు 1.6కి.మీల సొరంగం మరొకటి. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే అటవీ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దిగువమెట్ట-నంద్యాల మధ్య జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గంలో 142వంతెనలు నిర్మిస్తుండగా, ఇందులో ఐదు మేజర్ బ్రిడ్జిలు,137మైనర్ బ్రిడ్జిలు,ఈ రైలు మార్గం 37మలుపులు కలిగి ఉంటుంది. 7లెవెల్ క్రాసింగ్‌లు ఉంటాయి. కొండలను డ్రిల్ జంబో వంటి భారీ యంత్రాలతో ఆస్ట్రేలియన్ టన్నెలింగ్



నల్లమల అడవుల్లో జరుగుతున్న గుంటూరు-గుంతకల్లు డబుల్ లైన్ రైలు మార్గం సొరంగాల పనులు

విధానంలో డ్రిలి ్లంగ్,బ్లాస్టింగ్‌లతో తవ్వకాలు చేపట్టనున్నారు. పర్యావరణంతో పాటు ప్రస్తుతం ఉన్న సొరంగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా వ్యూహ్యాత్మకంగా ప్రణాళికను రూపొందించారు. కొండపై నుంచి నీరు,మట్టి జారి పడకుండ జియో టెక్స్‌టైల్స్, పివిసి మెమ్బ్రన్ పొరలు అమర్చి వాటిపై 300మిల్లీమీటర్ల మందంతో పటిష్టమైన కాంక్రీటు లైనింగ్ వేసి సొరంగం నుంచి వెలువడే ఊట నీటిని బయటకు వెళ్లేందుకు సులువుగా కాలువను నిర్మించనున్నారు. కొండలో సొరంగం పనులు చేపడుతున్నందున అక్కడి నేలపటిష్టత భూసామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు జియాలజిస్టు, ఇన్స్ట్రుమెంటల్, మైనింగ్, సివిల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు చెందిన నిష్ణాతులైన ఇంజనీరియర్ల నిపుణుల బృందం నిత్యం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండేలా దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం ప్రధానాధికారులు పర్యవేక్షణలో పనిచేస్తుంది. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం చివరిదశ పనులు సుమారు 2వేల మంది కార్మికులతో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులో తెచ్చేందుకు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్ట పూర్తయితే తూర్పు,నైరుతి,పశ్చిమ,దక్షిణాది రాష్ట్రాలకు దాదాపు 2గంటల సమయం కలిసిరావడంతో పాటు కొత్త రైలు సర్వీసులు, వాణిజ్య, వ్యాపారాభివృద్ధి మరింతగా పెరిగేందుకు దోహదపడుతుంది.

# పాతవిశ్రాంతి గృహాలకు కాలం చెల్లినట్లే!

## త్వరలో పునర్ నిర్మాణానికి టిటిడి వ్యూహం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలకొండపై ఆరుద శాబ్దాల క్రిందట అప్పటి అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ప్రమాదకరంగా మారాయి. చాలావరకు వీటిల్లో కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. అంతేగాక ఈ గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్ధాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్ఓ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్,గోవర్ధన్, కల్యాణి సత్రాలు,సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్





సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం త్వరలోనే దాతల నుండి సహకారం కూడా తీసుకునే యోచనలో ఉన్నారు. అంతేగాక టెండర్లు పిలిచినా వాటిని పూర్తిగా పడగొట్టి ఆ స్థానాల్లో అధునాతనంగా భవనాలు, గదులను అన్ని వసతులతో నిర్మించాల్సి కూడా ఉంది. ఆరేడు విశ్రాంతి గృహాలు ఇప్పుడు భక్తులకు పూర్తిగా వినియోగించుకునే పరిస్థితిలో లేవు. దీంతో ఈ విశ్రాంతి గృహాలన్నీ పూర్తిగా పడగొట్టి అద్భుతంగా నిర్మించేందుకు టిటిడి పాలకమండలి అనుమతితో టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం త్వరలోనే పునఃనిర్మాణానికి చర్యలు తీసుకునే దిశగా సిద్ధమవుతున్నారు. ఇంకా తిరుమలలో కొన్ని విశ్రాంతి గృహాలను ఆధునీకరించే దిశగా కూడా చూస్తున్నారు.

## భవన నిర్మాణ రంగ కార్మికుల నమోదుకు వెబ్‌సైట్...

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. భవన, ఇతర నిర్మాణ కార్మికులసంక్షేమ బోర్డులో పేర్ల నమోదుకు వెబ్‌సైట్ రూపొందించింది. దీన్ని జూన్ మొదటి వారంలో అందుబాటులోకి తీసుకురానుంది. దీనిద్వారా కార్మికులు తమ పేర్లను బోర్డులో నమోదుచేసుకోవచ్చు. సెల్‌ఫోన్ నుంచి కూడా వివరాలు నమోదు చేసుకునేలా రూపొందించారు. రాష్ట్రంలో నిర్మాణ రంగ కార్మికుల సుమారు 50 లక్షల మంది వరకు ఉంటారు. వీరిలో బోర్డులో నమోదైన వారు 20.22 లక్షల మంది ఉండగా, అందులో పనులు చేయగలిగిన సామర్థ్యం ఉన్నవారు 18.21లక్షల మంది. పేర్లు నమోదైన వారు బోర్డు అమలుచేసే సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుంటుంది. వెబ్‌సైట్ ద్వారా గుర్తింపు కార్డును సైతం వెంటనే పొందొచ్చు. ప్రస్తుతం బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలంటే సహాయ కార్మిక అధికారిని సంప్రదించాలి. వారికి వివరాలు అందించినా నమోదుకు చాలా సమయం పడుతోంది. ఇకపై ఈ తరహా సమస్యలు తీరనున్నాయి. వెబ్‌సైట్ ద్వారా మరింత పకడ్బందీగా నిర్మాణ కార్మికులసంక్షేమ బోర్డు పన్ను వసూళ్ల చేపట్టనున్నారు. శ్రామికుల సంక్షేమానికి కార్మిక శాఖ భవన నిర్మాణదారుల నుంచి 1% పన్ను వసూలుచేస్తోంది.

## సిట్ పిలిస్తే మరికొన్ని విషయాలు చెబుతా: ఎంపి రమేష్

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ని చాలా విషయాలపై సిట్ ఇంకా దృష్టిసారించనట్టు కనిపిస్తోందని భాజపా ఎంపీ సీఎం రమేష్ అభిప్రాయపడ్డారు. సిట్ ఆహ్వానిస్తే తాను వెళ్లిగత కుంభకోణానికి సంబంధించిన విషయాలు చెప్పడానికి సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఏంపీ సీఎం రమేష్ గత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసారు. వైకాంగ్రెస్‌పార్టీ పాలనలో మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట విధానంలో పనిచేసిన ఉద్యోగుల జీతాల నుంచి ప్రతి నెలా రూ.5 కోట్లు జగన్ మనుషులు కమీషన్ రూపంలో వసూలు చేశారు. మద్యం దుకాణాలు డిపోల వద్ద నియమించిన దాదాపు 11 వేల మంది సెక్యూరిటీ సిబ్బంది వేతనాల నుంచి కూడా కమీషన్ల రూపంలో నెలకు రూ.3 కోట్లు వసూలు చేసినట్లు నా దగ్గర సాక్ష్యాధారాలు ఉన్నాయి అని సీఎం రమేష్ వెల్లడించారు. చంద్రబాబు నాయుడు అప్పుల సామ్రాట్ అని జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్దంగా ఉన్నానని, లేదంటే జగన్ రాజకీయాల నుంచి వైదొలుగుతారా? అని సీఎం రమేష్ సవాల్ విసిరారు.

## ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు.

10381 మంది అభ్యర్థులకుగాను ఉదయం పేపర్-1కు 5716 మంది, మధ్యాహ్నం పేపర్-2కు 5665 మంది అభ్యర్థులు పరీ క్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాల్లో 25 పరీ క్షాకేంద్రాలలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి లోకల్ ఇన్‌స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్ రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేసిన పరీక్షను విజయవంతంగా నిర్వహించారన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరీక్ష కేంద్రా లలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎటు వంటి లోటుపాట్లు లేకుండా సజావుగా సక్రమంగా ప్రశాం తంగా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు.

## యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దు: శ్రీనివాసరావు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. కోవిడ్ హెచ్చరిక నేపథ్యంలో యోగాపై సర్వే ఆపాలన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాన మంత్రి పాల్గొనే యోగా దినోత్సవం కోసం రాష్ట్రమంతటి నుండి ప్రజలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవుతున్నాయని, జాగ్రత్తలు పాటించాలని, రాష్ట్ర ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో పెద్దయెత్తున ప్రజలను తరలించడం ద్వారా కరోనా మరింతగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం గుర్తించాలని కోరారు. కరోనా కేసులు విశాఖ పట్నంలో కూడా నమోదయ్యాయని మంత్రి సత్యకుమార్ స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా డే కోసం రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేస్తూ పెద్ద సంఖ్యలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రధానమంత్రి మెప్పు కోసం చేసే ఇలాంటి చర్యలు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతాయని తెలిపారు. కరోనా హెచ్చరిక నేపథ్యంలో సర్వే తక్షణం నిలిపేయాలని కోరారు.

## కరకట్ట కనెక్టివిటీకి రూ.60లక్షలతో టెండర్లు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు నుండి కరకట్టకు కనెక్టివిటీ విషయంలో సిఆర్‌డిఎ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సీడ్ యాక్సెస్ రోడ్డు నిలిచిపోయిన దగ్గర నుండి కరకట్ట వరకూ రోడ్డును విస్తరించనుంది. దీనికోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 26లోపు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం నుండి బికెఎంఎన్ ఆక్వా జంక్షన్ వరకూ కరకట్టకు దక్షిణ భాగంలో కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు. తాత్కాలికంగా అయినా రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో కరకట్టకు ఆనుకుని గతంలో నిర్మించిన మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చి కరకట్టను విస్తరించాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.60 లక్షలతో టెండర్లను ఆహ్వానించింది. ఈ రోడ్డును వెంకటపాలెంలో సీడ్ యాక్సెస్ రోడ్డుఆగిపోయిన చోట నుండి కరకట్ట దక్షిణ భాగంలో ఆక్వా కంపెనీ వరకూ నిర్మించనున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. మరోవైపు ఆక్వా కంపెనీ నుండి ఉండవల్లిలో ఇరిగేషన్ వర్కుషాప్ వరకూ ఎలివేటెడ్ కారిడార్ రూపంలో రోడ్డును విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం విజయవా డకు, అమరావతికి అనుసంధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డును వెంకటపాలెంలోని ప్రకృతి ఆశ్రమం వరకూ నిర్మించారు. అక్కడ నుండి పెనుమాక రెవెన్యూ పరిధి ఉండటం, రైతులు పూలింగుకు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డును అంతటితో నిలిపేశారు. ప్రస్తుతం కరకట్ట మీద సింగిల్‌లైను రోడ్డుపైనే ప్రయాణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కూడా అదే రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో దీనిపై ట్రాఫిక్ పెరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ పెనుమాక, ఉండవల్లి పరిధిలో భూములివ్వాల్సిన రైతులతో చర్చలు జరిపారు. కరకట్ట విస్తరించాల్సిన ప్రాంతంలో కొంతమంది ముందుకు వచ్చినా ఇంకా భూములు ఇవ్వాల్సిన రైతులూ ఉన్నారు.





గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పిసిఇ బ్రహ్మానందం

## సీమలో తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిఇ విస్తృత తనిఖీలు

**గుంతకల్లు రైల్వే,మే 25,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్(పిసిఇ) పి.యస్ బ్రహ్మానందం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రెండురోజుల పాటు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు శుక్రవారం దురదృష్టవశాత్తు జరిగిన ఘటనలో మృతిచెందిన విషయం తెలిసిందే. డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా,అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఇఎన్‌లు జిబిఎస్ శ్రీనివాసు లు(సమన్వయం), అభిరామ్,నందగోపాల్ స్టేషన్ మేనేజర్ మురారి లాల్ మీనా,ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సంబంధిత అధికారులు సీనియర్ సబార్డినేట్లతో కలిసి ఘటనా స్థలాన్ని, స్టేషన్ భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబర్ 4,5,6,7ల ప్రాంతంతో పాటు వివిధ కార్యాలయాల్లో పర్యటించి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైల్వేలో పాతబడిన పాత భవనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి మరమత్తులు చేపట్టా లని ఆదేశించారు. అనంతరం ఆయన నిఖీల నిమిత్తం రేణిగుంటకు బయలుదేరి వెళ్లారు.

# తిరుమల సమాచారం



## జూన్ 2నుండి తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2వతేదీ నుండి 10వతేదీ వరకు వైబవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు 29వతేదీ గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు,రాత్రి 7గంటల నుండి 9వరకు స్వామివారి వాహనసేవలు జరగనున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు జూన్ 1వతేదీ ఆదివారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం,అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. జూన్ 2వతేదీ సోమవారం ఉదయం ధ్వజారోహణం ఉంటుంది. గోవిందరాజస్వామికి తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు జరిగే వివరాలను టిటిడి వెల్లడించింది. ఈ సందర్భంగా తొమ్మిదిరోజులు టిటిడి అన్నమాచార్యప్రాజెక్టు, దాససాహిత్యప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 2జూన్ వతేదీ రాత్రి పెద్దశేషవాహనం, 4వతేదీ ఉదయం సింహవాహనం, 6వతేదీ రాత్రి గరుడవాహనం, 7న రాత్రి గజవాహనం, జూన్ 9న ఉదయం రథోత్సవం, 10న ఉదయం చక్రస్నానంతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు టిటిడి అధికారులు చేపట్టారు.



## ప్రజాపాలనతో ప్రజలు ఆనందం: తెలంగాణ విప్ ఐలయ్య

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణారాష్ట్రంలో ఏడాదికాలంలో ప్రజాపాలన సాగుతోందని, ప్రజలంతా అన్ని విధాలా సంతోషంగా ఉన్నారని ఆరాష్ట్ర విప్ ఐలయ్య తెలిపారు. పేదప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేయడంలో ,ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని ఆయన కొనియాడారు. తిరుమలేశుని దర్శనాలలో తెలంగాణ ప్రజలకు టిటిడి మంచి అవకాశం కల్పించి దేవుని దర్శనాలు చేయిస్తుండటం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అన్ని విధాలా అభివృద్ధిచెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు ఐలయ్య తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నానన్నారు. విఐపి బ్రేక్‌లో ఆయన స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు మంచిరోజులు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నితిన్‌సాంబ్రే, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ పుగలేండీ,పంజాబ్‌హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ అలోక్‌జైన్, కర్నాటక హైకోర్టు జడ్జి జస్టీస్ కామేశ్వరరాజ్, రాష్ట్రమంత్రి శ్రీనివాస్, సింగర్ స్మిత తిరుమలకు చేరుకున్నారు. వీరంతా వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భారత్ క్రికెట్ టీమ్ అద్భుతంగా ఆడుతోంది టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్



**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** భారత్‌క్రికెట్ టీమ్ అద్భుతంగా ఆటల్లో రాణిస్తుందని, ఇప్పటికే మ్యాచ్‌లు ప్రారంభమైతే తమ ప్రతిభను చాటేవారని టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ అన్నారు. రానున్న రోజుల్లో భారత్ క్రికెట్ టీమ్ త్వరలోనే ఇంగ్లాంగ్ సిరీస్ ఉందని, ఆ ఆటలో తామే గెలవాలని, ప్రపంచకప్ గెలవాలని ఆకాంక్షించారు. అన్నీమంచి జరగాలని, తమ సత్తాచాటేలా స్వామివారిశక్తిని ప్రసాదించాలని వేడుకున్నానన్నారు. ఆదివారం ఉదయం ఆయన తిరుమలకు చేరుకుని దేవదేవుడు శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 90వేలమంది భక్తులకు దర్శనం సర్వదర్శనానికి 25గంటలుపైగానే

**తిరుమల,మే 25 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం ఒక్కరోజే 90,211మంది భక్తులకు టిటిడి అధికారులు స్వామివారి దర్శనంచేయించారు. గతంలో 91వేలమంది దాటినా గత ఐదేళ్ళలో వేసవిసెలవుల్లో ఇంతమందికి దర్శనం చేయించడం రికార్డుగా నమోదైంది. భక్తులకు సంతృప్తికరంగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేయించారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితిఉంది. సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఈనెల 24రోజుల్లో 51లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ జరిగింది. ప్రతి రోజూ సగటున 2.5లక్షల అన్నప్రసాదాలు, 90వేలకుపైగా అల్పాహారాలు, పానీయాలుఅందిస్తున్నారు. 24వతేదీ శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నదానభవనంలో 93,950మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత మూడురోజుల్లో 2.40లక్షమంది భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు.

**ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY**
**ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522034; A.P.**

**NOTIFICATION**
**POLYTECHNIC ADMISSIONS - 2025-26**

No.001657/Polytechnics/A1/2025 Dated: 23.05.2025

Online applications are invited from the candidates who passed SSC or its equivalent examination and who are seeking admission into Diploma courses offered by ANGRAU, Lam, Guntur for the academic year 2025-26. No separate entrance examination will be conducted by ANGRAU. Important Dates: Commencement of online Registration: Dt.28.05.2025, Last Date of Registration Dt.16.06.2025. For detailed information, online application and regular updates, please visit our website: www.angrau.ac.in. Please note that no further newspaper notification will be given regarding admissions, 2025-26.

Sd/- REGISTRAR

DIPR.No.4139PP/CL/Advt/1/1/2021-22, Date: 23.05.2025

వార్త

పోటీని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదు. పోరాటం లేకపోతే అభివృద్ధి ఉండదు.

న-ఫ్రెడరిక్ డగ్లస్

# ముదురుతున్న అంతర్యుద్ధం!

ముస్లిం దేశాల్లో పాలకులు ఎవరున్నా ఆర్మీయే పెత్తందారు అన్నది అందరికీ తెలిసిన విషయమే. వారి అండదండలు లేనిదే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి . ఇప్పుడు అదే జరిగింది బంగ్లాదేశ్ లో. తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనస్ కు, ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్ కు మధ్య పొత్తు పొసగదు. కారణం ఏదైనా ముస్లిం దేశాల్లో ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు ఆయా దేశాల్లో పాలన అనిశ్చితికి గురైనట్లే లెక్క. ఏడాది డిసెంబర్ లోగా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ హుకుం . ముందు సంస్కరణలు తర్వాతే ఎన్నికలు అనే ధోరణి యూనస్‌ది. అంటే బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సంక్షోభంలో పడిందన్న మాట. ఏరికోరి నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్‌కు బంగ్లాదేశ్ రాజకీయ పక్షాలు పదవీ పగ్గాలు అందించాయి. దేశ ఆర్థిక పరిస్థితిని పెద్దగా సరిదిద్దిందేమీ లేదు. చేయాల్సింది చేయలేకపోవడమే కాదు. సత్వరమే, ఎన్నికలు పెట్టాల్సిన తాత్కాలిక ప్రభుత్వాల బాధ్యతను కూడా మర్చిపోయినట్లున్నారు. ఇప్పుడు ఆయనకు ఇతర రాజకీయ పక్షాలకు మధ్య పరిస్థితి బెడిసి కొట్టింది. షేక్ హసీనాను పదవీచ్యుతు రాలిని చేసిన సందర్భంలో యూనస్ కు ఆర్మీ చీఫ్ కు సత్సంబంధాలు ఉండేవి. తర్వాత తర్వాత క్రమంగా వారిద్దరి మధ్యన సంబంధాలు బెడిసి కొట్టాయి. ఇప్పుడు వారిద్దరూ వేర్వేరు వర్గాలుగా విడిపోయారని వారు వ్యవహారశైలి చెప్పకనే చెబుతోంది. యూనస్‌తో కలిసి పని చేసిన చాలా మంది ఇప్పుడాయనతో లేరు. రాజీనామా చేసేశారు. బంగ్లాదేశ్ విషయాని కొస్తే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక సవాళ్లను తాత్కాలిక అధ్యక్షుడు యూనస్ ఏమాత్రమూ ఎదుర్కోలేక పోయారు. అయినా ఆయన మద్దతుదారులు యూనస్ ప్రభుత్వాన్ని మరి కొంత కాలం ఎలాగైనా నిలబెట్టాలని చూస్తున్నారు. తాజా పరిస్థితిని తట్టుకోలేక యూనస్ ఉన్నట్టుండి రాజీనామా మంత్రం జపించారు. అది కేవలం బెదిరించ డానికేనని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. యూనస్‌కు మద్దతుగా రాజధాని ఢాకాలో నిరసన ర్యాలీని నిర్వహిం చారు. దీని నిర్వాహకులు యూనస్ మరికొంత కాలం ఉండాలని కోరుకుంటున్నారు. ఆయనమాత్రం విపక్షాలకు కొరకరానికొయ్యగా మారాడు. తాత్కాలిక ప్రభుత్వం ఎక్కువ కాలం మనజాలదని ఆర్మీ చీఫ్ జమాన్ అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలు జరిగితే కచ్చితంగా యూనస్ తప్పుకోవాల్సి వస్తుందని ,అందుకే ఎన్నికలు నిర్వహించ డానికి వెనుకాడుతున్నట్లు భావిస్తున్నారు. మళ్లీ విద్యార్థుల ఉద్యమం ద్వారా ఆర్మీని తన చేతిలో పెట్టుకు నేందుకే అయి ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం. ఎన్నికకు జరిగితే తన హోదాకు గండి ఏర్పడుతుందని, ఎన్నికకు నిర్వహించకుండా తాత్సారం చేయాలన్న యోచనలోనే యూనస్ కొత్త నాటకాన్ని మొదలెట్టారనే వెల్లడవుతోంది. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్‌ఉజ్‌జమాన్, ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ మధ్య ప్రస్తుత వివాదం వెనుక అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి.. యూనస్‌ను విదేశీ సంస్థల కీలు బొమ్మగా భావించి, సైన్యం విదేశీ జోక్యం గురించి ఆందోళన చెందుతోంది. ఎన్నికైన ప్రభుత్వ అనుమతి లేకుండా ఆర్థిక కారిడార్లను మంజూరు చేయడానికి, విదేశీ సంస్థ లకు కాంట్రాక్టులను ఇవ్వడానికి యూనస్ ప్రణాళికల గురించి జమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ చీఫ్‌ను సంప్రదించకుండా జాతీయ భద్రతా సలహాదారుడిని నియమించడానికి యూనస్ చేసిన ప్రయత్నం పట్ల సైన్యం అసంతృప్తిగాఉంది, ఇది సైన్యాన్ని విభజించే ప్రయత్నంగా వారు భావిస్తున్నారు. కానీ ఎన్నికల నిర్వహణ, సైనికజోక్యం, యూసన్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల కారణంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది. అనంతరం జరిగిన చర్చల్లో రిజర్వేషన్లలో సంస్కరణలు చేపడతామంటూ గతంలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టడంతో వీరి మధ్య దూరం బాగా పెరిగినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇస్లామిస్ట్ నాయకులతో పాటు, బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటు దారులను జైలు నుంచి విడుదల చేయడంలో యూనస్ కీలకంగా వ్యవహరించారు. ఈ అంశం ఆర్మీ చీఫ్‌ను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. దీంతో యూనస్‌తో ఆయన అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. పరిపాలన, చట్ట అమలు సంస్థల పతన ప్రస్తావనతో దేశ పరిస్థితి దిగజారుతున్నట్లు ఆర్మీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అత్యవసర చర్చలతర్వాత యూనస్ ప్రస్తుతానికి పదవిలో ఉంటారని ఆయన సలహాదారులు ధృవీకరించారు. ఈ పరిస్థితులన్నీ అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇంకెంతో కాలం మనజాల దని రుజువు చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలో తాజాగా రాజకీయ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి.. అలాంటి వేళ యూనస్ రాజీనామా ప్రస్తావన తెచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగలేనని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. గత రెండు రోజులుగా యూసన్ ప్రభుత్వం పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. వారిద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తాత్కాలికంగా రాజీనామాకు సిద్ధమైన యూనస్ తాత్కాలికంగా మెత్తబడినా ఎంతోకాలం వీరికి సయోధ్య ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. యూనస్ రాజీనామా చేసే అవకాశం లేదా పాలనలో సైన్యం మరింత ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశం ఉన్నందున, సంఘర్షణ ఫలితం అనిశ్చితంగానే ఉంది. వీరిద్దరి మధ్య వైరుధ్యాలు బంగ్లాదేశ్ రాజకీయాలను ఏ తీరానికి చేరుస్తాయో!

పని చేసే తత్తమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.



హెన్రీఫోర్డ్

పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి సంపాదించలేం.




కర్టిస్

# విద్యపై అన్నీ విఫల ప్రయోగాలే!

*2010 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టా నికి కూడా మన రాష్ట్రాల్లో తూట్లు పొడిచారు. పాలకుల చేతిలో ఈచట్టం అవహాస్యమైంది. తపస్ మజుందార్‌కమిటీ చేసిన సిఫార్సులన్నీ మన దగ్గర బుట్టదాఖలు అయినాయి. 14 ఏళ్లవరకు ఉచిత విద్య అందించడమే కాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే ఉన్నత విద్య కూడా వారికి ఉచితంగా అందించాలని ఆ చట్టం ప్రవచించింది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం 25 శాతం సీట్లు రిజర్వుడు కేటగిరికి అంటే బడుగు బలహీన వర్గాలకు కేటాయించాలి కానీ ఆ కేటాయింపులు ఆ ఖర్చును ప్రభుత్వం భరించడం అన్నీ కూడా అమలుకు నోచుకోవడం లేదు. నిర్బంధఉచిత విద్య మన దగ్గర నగుబాటుకు గురైంది.*

శ్రీ శ్రీ కుమార్

విద్యలో ప్రయోగాలు ఉండడం సహజం. కానీ విద్య మీద ప్రయోగాలు జరగడం మనదేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే సాధ్యమవుతుంది. ప్రభు త్వాలు మారినప్పుడల్లా మంత్రులు మారినప్పుడల్లా నడు స్తున్న విద్యావిధానానికి కాలం చెల్లి కొత్త విద్యా విధానానికి నాంది పలుకుతారు. ఆ కొత్త విధానానికి రూపకల్పన చేసే ముందు ఒక ప్రజాస్వామికి చర్చ జరగదు. విద్యావేత్తలతో సలహా సంప్రదింపులు, మంచి చెడులు, పరిణామాలగూర్చి ఒక డిబేట్ ఉండదు. కొన్నిసార్లు తమకు అనుకూలమైన తమ విధానాలను తప్పక సమర్థించే వారితో ఒక మొక్కు బడి సమావేశం జరుపుతారు. ఎవరుఎప్పుడైనా విద్యా విధానాన్ని మార్చవచ్చు. అనేక రకాలుగా తమకు ఇష్టం వచ్చిన రీతిలో దాని నిర్మాణ క్రమాన్ని మార్చవచ్చు. ఆశ్చర్య మేమంటి ఎన్ని విధానాలు రూపొందించినా విద్యార్థి అభ్య సన స్థాయిలో లేశమాత్రమైనా మార్పులేకపోవడమే! ఒక ప్పుడు పాఠశాల విద్యలో +2 స్థాయివరకు ఉండేది. కొంత కాలం డిగ్రీ కళాశాలలోనే ఇంటర్మీడియట్ కలిసి ఉండేది. దాన్ని విడదీసి జూనియర్ కళాశాలలు ఏర్పరిచారు. సాధించిన మార్పు కానీ అభివృద్ధి కానీ ఏమీలేదు. ఓపెన్ బుక్ సిస్టంలో పరీక్షలు జరపాలని నాలుగు దశాబ్దాల క్రితంనాటి విద్యాశాఖ మంత్రి ప్రతిపాదించారు. కారణమేమైనా ఆ విధా నం అమలుకు నోచుకోలేదు. 10+2+3 విద్యా విధానం కొనసాగుతున్న పరిస్థితుల్లోనే రాజశేఖర్ రెడ్డి హయాంలో పాఠశాల విద్యలోనే ఇంటర్ విద్యను విలీనం చేసే ప్రతి పాదన గట్టిగానే నడిచింది. నిరసనలు నిరాహారదీక్షల పర్య వసానంగా అది వాయిదా పడింది. ఇంతలో సిసిఈ (కంటి న్యూస్ అండ్ కాంప్రహెన్సివ్ ఈవ్యాల్యూషన్) అమల్లోకి వచ్చింది. దీని ప్రకారంగా సంవత్సరం పొడవునా విద్యార్థి పరీక్ష అని భావించకుండా పరీక్షలు రాస్తూనే ఉంటాడు. ప్రశ్నకు సంబంధించిన జవాబు కచ్చితంగా తెలవకపోయినా లేక రాయకపోయినా మార్కులు వేస్తారు అంటే అభ్యసనం లేకుండానే విద్యార్థి పైతరగతులు చదివే అవకాశం ఉంది. ఈ విధానాన్ని ద్రాపవుట్లు అరికట్టడానికి అంటూ సమర్థిం చుకున్న వారు ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రయోగాత్మ కంగా కొన్ని వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టారు. అవి 8వ తరగతిలో ప్రారంభమయ్యేవి. వీటికి శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకాలు జరగలేదు. ప్రయోగశాలలేదా కార్యశాలలు ఏర్పాటు చేయలేదు. దాంతో అవి ఆదరణకు నోచుకోలేదు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా కొన్ని కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశ పెట్టడం జరిగింది. అక్కడ కూడా రెగ్యులర్ సిబ్బంది లేకపోవడం, తక్కు వేతనాలకే సిబ్బందిని పార్ట్ టైం ప్రాతిపదికన నియమించడం, కొన్ని కోర్సులకు అవసరమైన అర్హత గల అభ్యర్థులు దొరకకపోవడంతో అవి కూడా మూలనపడ్డాయి. అంటే ఏర్పాటు చేసే సమయంలో అధ్యయనం ఆలోచన లేకపోవడం సామాజిక అవసరాలు గుర్తించకపోవడం దీనికి కారణంగా చెప్పవచ్చు. టైలరింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మొబైల్ రిపేరింగ్, టీవీ రిపేరింగ్, ఎలక్ట్రిషియన్ లాంటి కోర్సులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. కంప్యూటర్ కోర్సులకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఇంటర్మీడియట్ పూర్తి చేయగానే కొందరు తమ కాళ్లమీద తాము నిలబడి సంపాదించే జీవించే కోర్సులను ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా వాటిని ఆదరిస్తారు. అదేవిధంగా మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ నేర్చుకున్న విద్యార్థినీ విద్యార్థులు డయాగ్నస్టిక్ సెంటర్లు నెలకొల్పుకోవడం లేదా వాటిలో పనిచేయడం ఆసుపత్రులలో పని చేయడం గమనించాం. ప్రభుత్వం ఇలాంటి కోర్సులను చాలా పరిమిత సంఖ్యలోనే అందించడంతో ఆశావహులకు ఆశాభంగం అవుతున్నది. ఎవరైతే ఉన్నత చదువులు చదవలేని వారు ఉంటారో అలాంటి వారికి ఈ కోర్సులు చాలా ఉపయోగపడతాయి. దశాబ్దాలుగా ఎవరూ



పట్టించుకోని ఐటిఐలను స్కిల్ సెంటర్లుగా మార్చుతామని ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది కానీ అమలుకు వచ్చేసరికి ఇంకా ఆమడదూరంలో ఉంది. ఒక స్పష్టమైన విధానం అంటూ లేకుండా పోతుంది. దాంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షల కొద్ది బయటకు వస్తున్న ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎంత మంది నైపుణ్యాలు కలిగి ఉన్నారనేది నిజంగా ప్రశ్నార్థకమే! నైపుణ్యం లేకుండా కేవలం పట్టా తీసుకుని మార్కెట్లో నిరుద్యోగులుగా నిలబడ్డం శోచనీయం. ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇచ్చారే కానీ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రయోగశాల వసతులు, మౌలిక సౌకర్యాలు, అర్హులైన ఫ్యాకల్టీ గురించి ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. వాసి తగ్గి రాసి మాత్రం పెరిగింది. ఇంజనీరింగ్ విద్య అందరికీ అందుబాటులోకి వచ్చిందని సంతోషించాలా లేక నైపుణ్యం లేని విషయ పరిజ్ఞానం లేని పట్టభద్రులు సమాజానికి పెను సవాలుగా మారనున్నారని మారుతున్నారని బాధపడదామా? ఈ మధ్య ఒక నియామక పత్రాల పంపిణీసభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది బాగా అర్హతలు ఉన్నవారిని శిక్షణ పొందిన వారిని చెప్పుకొచ్చారు. అంతవరకు బాగానే ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్ డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లే బోధిస్తుంటారని అక్కడ అభ్యసనం ఆశించినంతగా ఉండదని పేర్కొంటూ తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రోత్సహించాలని కోరారు. అసలు విద్యార్థులకు అవసరమైన చోట అందుబాటులో ప్రభుత్వ విద్యాసంస్థలు ఉంటే ఏ తల్లిదండ్రులు కూడాతమ పిల్లలను శ్రమకోర్చి డబ్బు ఖర్చు పెట్టుకుని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించరు. అందరికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరే అవకాశం ఉందా?అన్ని మౌలికవసతులు కలిగి అవసరాలకు తగినన్ని విద్యాసంస్థలు నడిపించే పరిస్థితి ప్రభుత్వాలకి ఉన్నదా అనేది సామాన్యుడుఅడుగుతున్నప్రశ్న.స్వాతంత్ర్యం సిద్ధించక ముందు నుండి కూడా కొన్ని సంస్థలు ప్రైవేట్ పాఠశాలలు నడుపుతూ విద్యా సేవ చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం అసమర్థత వల్లనే నేడు ప్రైవేటు విద్యా సంస్థలు రాణిస్తున్నాయి.సామాన్యుడు సైతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లోనే చేర్పించడానికి ఇష్టపడుతున్నాడు. అక్కడ కూడా అర్హత శిక్షణపొందిన వేలాదిమంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారనేది వాస్తవం. కాగా విద్య నేడు కార్పొరేట్ శక్తులకు మంచి వ్యాపార వస్తువుగా తయారైంది. ప్రభుత్వ విద్య నీరుగార్చారు అది నిర్వీర్యమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్య సంస్థలు మరింతగా రాణించాయి. ఇంటర్మీడియట్ స్థాయిలో కార్పొరేట్ కళాశాలల దందాకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. అదేసమయంలో ప్రభుత్వ కళాశాలల్లో పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ, సామాగ్రి ఇవ్వకపోవడం కార్పొరేట్ కళాశాలకు మరింతఊతమిచ్చింది. మరి ప్రభుత్వ కళాశాలలోని అర్హతలు అనుభవంఏమైనట్లు? నేడు చివరికి కార్పొరేట్ శక్తులే ఇంటర్మీడియట్ విద్యను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రి ప్రకటన ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో అంత హంగు ఆర్భాటమే కానీ సత్తా లేదని చెప్తుంటే నిన్న మొన్న ఒక మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 1000 ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు వాటికి దీటుగా నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. అంటే ఆయన దృష్టిలో ప్రైవేటు విద్యాసంస్థలు ఎంతో మెరుగ్గా ఉన్నత స్థితిలో ఉన్నట్లే. ముఖ్యమంత్రి మాటలకు మంత్రి ప్రకటనలకు పూర్తి వైరుధ్యం స్పష్టంగా కనబడుతోంది. ఒకరు ప్రైవేటు పాఠశాలలు పనికిమాలినవిగా వర్ణిస్తే మరొకరు వాటితో పోటీపడి ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగ్గా నడుపుతామని ప్రకటించడం పరస్పరం భిన్నంగా ఉంది. ఎవరి మాటలను మనం అవగాహన రాహిత్యంగా పరిగణించాలి? 2010 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టానికి కూడా మన రాష్ట్రాల్లో తూట్లు పొడిచారు. పాలకుల చేతిలో ఈచట్టం అపహాస్యమైంది. తపస్ మజుందార్‌కమిటీ చేసిన సిఫార్సులన్నీ మన దగ్గర బుట్టదాఖలు అయినాయి. 14 ఏళ్ల వరకు ఉచిత విద్య అందించడమే కాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే ఉన్నత విద్య కూడా వారికి ఉచితంగా అందించాలని ఆ చట్టం ప్రవచించింది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం 25 శాతం సీట్లు రిజర్వుడు కేటగిరికి అంటే బడుగు బలహీన వర్గాలకు కేటాయించాలి కానీ ఆ కేటాయింపులు ఆ ఖర్చును ప్రభుత్వం భరించడం అన్నీ కూడా అమలుకు నోచుకోవడం లేదు. నిర్బంధఉచిత విద్య మన దగ్గర నగుబాటుకు గురైంది.డ్రాపవుట్లు జరగకుండా పెరగకుండాచూడడం కూడా ఇందులో ముఖ్యఅంశం.ప్రభుత్వం కొత్తగా అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ప్రాథమిక విద్య అందించే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. అందులో శిక్షణపొందిన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందా అనేది సందేహాస్పదమే! •

# పాకిస్థాన్ బుద్ధి ఇక మారదా?

కనుమ ఎల్లారెడ్డి

ఆపరేషన్ సిందూర్‌తో కకావికలం అయిన పాక్ దిక్కుతోచని స్థితిలో ఉంది. ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. తాజాగా ఆ దేశ ఆర్మీ అధికారి చేసిన వ్యాఖ్యలు అతని స్థాయిని పెంచేవిగా లేవు. భారత్‌తో సయోధ్య పెంచుకోవాల్సింది పోయి 'ఊపిరి' ఆపేస్తాం అని మాట్లాడతాడా! అతనికి భారత్ అంటే ఎంత 'కసి'అన్నది అర్థమవుతోంది. నీళ్లు లేక పాక్ అల్లాడుతోంది. భారతతో కాళ్ల బేరానికి రావాల్సింది పోయి వితండ వాదం చేస్తున్నాడు. అతనికి లష్కారే తోయిబా హాఫీద్ సయుద్ తో సంబంధాలు ఉన్నట్లు అతని మాటలు తేట పరుస్తున్నాయి. దీనికి తోడు బిలావల్ భుట్టో కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మొత్తానికి పాక్, ఆపరేషన్ సిందూర్ ద్వారా చాలా వరకు నష్టపోయింది. అయినా ఆ దేశ నేతలకు బుద్ధి రాలేదు. పొరుగున ఉన్న భారత్ చాలా వరకు సంయమనమే పాటించింది. భారత్ తల్చుకుంటే ఇక పాక్ ఉండదు. అది పాక్ గమనించాలి. ప్రస్తుతం పాక్‌లోఎయిర్ బేస్‌లో భారీగా నష్టపోయింది. వాటి పునరుద్ధరణకు భారీ వ్యయం అవసరం. ఇటీవలే రుణం మంజూరు అయినా భారత్ కొన్ని షరతులు పెట్టింది. ఇది పాక్ పెద్ద దెబ్బ. షరతులకు పాక్ అంగీకరించాలి. ఉగ్రవాదంకు మద్దతు ఇవ్వం, ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌తో కలసి పని చేస్తామని చెప్పాలి. భారత్‌తో పని చేయడానికి పాక్‌కు నామోషీ,



అందుకే చైనా పంచన చేరింది. ఒక వైపు అమెరికా ఉగ్ర చర్యలు ఎక్కడా కూడా సహించమని చెబుతున్న పాక్‌కు జ్ఞానోదయం కాలేదు. సింధు నదిలో రక్తం పారుతుంది అని పాక్ నాయకులు మొండిగా చెబితే, భారత్ దాడి పాక్ ఊహకు అందదు. ప్రపంచ చిత్రపటంలోనే దాని ఆనవాళ్లు ఇక ఉండవు. శాంతితో భారత్ మసలుకుంది కాని భయంతో కాదు. పాక్ అంతా ఏకమైన భారత్ ఇంచును కూడా కదిలించలేరు. భారత్ త్రివిధ దళాలు, పౌరుల మాట అది. కనుక పాక్ నాయకులు, ముఖ్యంగా ఆ దేశం ఆర్మీ అధికారి, బిలవల్ భుట్టో ఆచి తూచి మాట్లాడితే మంచిది. పాక్ లక్ష్యం ఒక్కటే భారత్‌ను అస్థిర పరచాలి. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవాలని, అదిచేసే ట్రిక్కులు ఎన్నో.అయిన భారత్ స్థిరంగా ఉంటుంది. పాక్‌లో మాదిరి ఎన్నటికీ ఆర్థిక సంక్షోభం ఎదుర్కోదు. భారత్ బలం ముందుపాక్ ఎప్పటికి బలాదుర్. సుస్థిర శాంతి, ఆర్థిక ప్రగతి, దేశ సార్వభౌమత్వ పరిరక్షణ, అన్నిటికన్నా దేశ పౌరుల క్రమ శిక్షణ, దేశాల మధ్య సఖ్యత, ఇతర దేశాలకు చేతనైనా సహాయ, సహకారాలు అందించటం భారత్ విదేశాంగ లక్షణాలు. వీటి కే భారత్ ప్రాముఖ్యత ఇస్తుంది.ఉగ్రవాదానికి కాదు. ఇంకొక్కసారి రక్తం, గిక్తం అని నోరు పారేసుకుంటే భారత్ దెబ్బ మాములుగా ఉండదు. ముందు పాక్, భారత్‌తో స్నేహం కాంక్షించాలి అంతే కాని యుద్ధం కాదు. త్వరలోనే భారత్, పాక్ మధ్య మంచి చర్యలు ఉంటాయని ఆశిద్దాం. •

# ప్రజావాక్కు



## మద్యం షాపులు దూరంగా ఉండాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలుకొన్నినగరాలలో జనవాడలమధ్య ఉంటున్నాయి. దీనికితోడు వివిధ జంక్షన్‌లో వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటున్న ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగాపడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారు. దుకాణదార్లు ఏమి చేయలేకపోతున్నారు . ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- బొల్లోజు మేఘానధ్, విశాఖపట్నం

## రైళ్ల సంఖ్యను పెంచాలి

ప్రపంచంలో ఎక్కువ జనాభా కలిగిన దేశం మన భారత దేశం.1853వసంవత్సరంలో భారతదేశంలోరైలు ప్రయాణం ప్రారంభం అయినది.140 కోట్లకు పైగా జనాభా కలిగిన దేశంలోని ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణ సాధనాలలో ప్రధానమైన రైలు మార్గం ముఖ్యమైనది. జనాభా పెరిగిన నిష్పత్తిలో వారి ప్రయాణాల అవసరాల నిమిత్తం ప్రస్తుతం ఉన్నరైళ్ల సంఖ్యతో పాటుగా మరికొన్ని రైళ్లను ప్రారంభించాలి. ప్రతి రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం ఆగుతున్న రైళ్లతోపాటుగా ప్రజల ప్రయాణ అవసరాల నిమిత్తం నూతన రైళ్లకు ప్రతి రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ ఉండాలి.ప్రతిరైళ్లకు రైలు భోగీల సంఖ్య కూడా పెంచాలి. గ్రామాల విస్తీర్ణాన్ని బట్టి రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న గ్రామాలలో కొన్నిచోట్ల కూడా నూతనంగా రైల్వే స్టేషన్‌లను ఏర్పాటుచేసి మరికొన్ని గ్రామాలకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## బదలీలకు షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్,పీజీటీలు,టీజీటీల బదిలీలను నిర్వహించాలని, దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీచర్స్ కోరుతున్నారు. డీఎస్సీ 2025 నిర్వహణకు ముందు బదలీప్రక్రియ పూర్తయ్యేలాచూడాలి. డీఎస్సీ ఇప్పటికైనా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. సురేష్, ఆంధ్ర ప్రదేశ్

## జనరిక్ మందులను ప్రోత్సహించాలి

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్లపేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ఇవి బ్రాండ్ మందులంతటితో సమానమైన ప్రభావం కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఆషుకేంద్రాల ద్వారా వీటినివిస్తృతంగా అందుబాటులోకి తేవాలి.వైద్యులు, ఫార్మసిస్టులు జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

-సి. హెచ్. ప్రతాప్. శ్రీకాకుళం

## శిక్షణా కార్యక్రమాలు వాయిదా వేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు, ఎఫ్.ఎల్.ఎన్ ట్రైనింగు వాయిదా వేయాలని ఉపాధ్యాయులుకోరుతున్నారు. టీచర్లబదిలీలు,పదోన్నతులు జరుగుతున్న సందర్భంలో ఉపాధ్యాయులు బదిలీ అప్లికేషన్ పెట్టుకోవటానికి, వివిధప్రాంతాల్లో ఉన్నపాఠశాలల వివరాలు తెలుసుకోవడానికి, ఎస్జీటీ ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సిలింగ్ కు హాజరు కావడానికి, స్కూల్ అసిస్టెంట్స్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు,సెకండరీ గ్రేడ్‌టీచర్స్ వారిప్రమోషన్స్ ట్రాన్స్ఫర్లకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణా కార్యక్రమాలు వాయిదా వేసి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అనంతరం ప్రభుత్వం నిర్వహించాలి.

- వాసిలి సురేష్ నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్

## మండలి సభ్యుల వల్ల ఏమి ప్రయోజనం?

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ శాసనమండలి సభ్యుల వల్ల ఏమీ పెద్దగా ప్రయోజనం ఉండదు. ముఖ్యమంత్రి గారు ఏం తలుచుకుంటే అదే అవుతుంది.శాసనమండలి సభ్యులు ఎలాంటి మంచి ఆలోచనా ముఖ్యమంత్రి గారికి అందించలేరు. ఒకవేళ మంచి ఆలోచన చెప్పినాఅవి చెవిటివానిముందు శంఖంఅవుతుంది.మేమే సాధించాం మావల్లే ఇవన్నీ ప్రభుత్వఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ప్రయోజనాలు కలిగాయి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మతానికి శత్రువు మానవుడే!

పుల్లెంల గణేష్

మానవ నాగరికత అభివృద్ధి పరిణామ క్రమంలో అనివార్యంగా మతాన్ని, దేవుడిని సృష్టించుకోవాల్సిన అవసరత నాటి మానవుడికి ఏర్పడింది అనే విషయం జగమెరిగిన సత్యం. విశ్వాన్ని ఏ దేవుడు సృష్టించలేదు. పంచభూతాల పరివర్తన క్రమంలో విశ్వ అభివృద్ధి నాటి ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు దశలవారీగా అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అయితే అనాటి ప్రాచీన అనాగరిక సమాజంలో మానవ అభివృద్ధి పరివర్తన క్రమంలో భాగంగా ప్రకృతిధర్మాల ప్రకారం ఏర్పడిన భయభ్రాంతులను నుండి తమను తాము రక్షించుకోవడానికి, స్వీయ క్రమశిక్షణతో కూడిన ఉన్నతమైన జీవితాన్ని గడపడానికి మానవుడు మతాన్ని, దేవుడిని సృష్టించాడు. అందులో భాగంగానే నేటి ఆధునిక సమాజంలో అనేక మతాలు, దేవతా, దేవుళ్లు మానవుడి చేత సృష్టించబడినాయి. ఐతే ఏ మత దేవుళ్లు కూడా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలతో కూడిన మానవుడి మనుగడ ఉన్నతంగా ఉండాలని ఆయా మత సృష్టికర్తలు మంచిని మాత్రమే బోధిస్తారు. కానీ నేటి ఆధునిక సమాజంలో ఏ ఉద్దేశంతో అయితే మానవుడి చేత మతం కనిపెట్టబడినదో ఆ విలువలపై మతాన్ని అనుసరించకుండా ప్రకృతి నియమాలకు పూర్తి విరుద్ధంగా మత విలువలని అతివాద,వాద సిద్ధాంతాలతో కలుషితం చేసుకొని చివరికి మానవ మనుగడకే ప్రమాదం కొనితెచ్చుకున్నారు. నేడు మతం మత్తులో ఉన్న ఆధునిక మానవుడు ఎలా తయారయ్యాడు అంటే మానవ మనుగడ ముఖ్యమా, మతం ముఖ్యమా అంటే..? మతమే ముఖ్యం అనేలా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా పరివర్తన చెందుతూ నిర్మాణం అవుతున్నారు. కానీ నేటి ఆధునిక సమాజంలో మతం మత్తులో మునుగుతూ తీవ్రవాద భావాలు కలిగిన పాకిస్థాన్ దేశానికి చెందిన టెర్రరిస్టులు చేసిన దాడిలో తాజాగా భారతదేశ ప్రాంతానికి చెందిన పహెల్గాంలో దాదాపుగా 26 మంది భారతీయులు మరణించారు. అయితే ఈ సంఘటనలో పాకిస్థాన్ కేంద్రంగా తీవ్రవాదులుగా మారిన వ్యక్తులు హిందూ పురుషులని లక్ష్యంగా చేసుకొని కిరాతకంగా చంపివేయడం భారతదేశాన్ని మాత్రమే కాదు, ప్రపంచం మొత్తాన్ని భయ భ్రాంతులకి గురిచేసింది. పహెల్గాం దాడి సంఘటనకి బదులుగా భారతీయ వాయు సైన్యం 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చమని భారతీయ కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పడం జరిగింది. పహెల్గం దాడి సంఘటనపై లోతుగా ఆలోచిస్తే ముస్లిం మత విలువలకి విరుద్ధంగా నిర్మాణమైన కొందరు తీవ్రవాదులు అతివాద భావాలు కలిగి మతం పేరుతో, అల్లా పేరుతో,జిహాద్ పేరుతో మెజార్టీగా హిందూ మతాన్ని విశ్వసించే భారతదేశంపై ఉన్న అసూయ, శత్రుత్వంతో భారతీయుల పై అనేక సందర్భాల్లో దాడి చేస్తూనే ఉన్నారు. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులు చేసిన దాడికి, బదులుగా భారతీయ ప్రభుత్వం చేసిన దాడిని కూడా హిందూ మత పురుషులపై చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలని భస్మం చేయడం జరిగింది. అంటే ఇక్కడ భారతీయులపై జరిగిన దాడికి ప్రతిదాడులు చేసినం అని చెప్పుకోకుండా పాకిస్థాన్‌కి చెందిన ముస్లిం తీవ్రవాదులు చేసిన దాడికి ప్రతిదాడిగా హిందూ మతం నుండి విశ్వసిస్తున్న వ్యక్తులుగా ప్రతిదాడి చేశాం అని భారత ప్రభుత్వం అనివార్యంగా చెప్పుకోక తప్పని పరిస్థితి నెలకొన్నది. పెహల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామ క్రమం చూస్తే మూడో ప్రపంచ యుద్ధం జరగబోతున్నదా అనే ధోరణిలో చాలామంది భారతీయులు వివిధ ప్రపంచ దేశాలు భావించాయి. ఈ పెహల్గాం సంఘటన నుండి భారతదేశం మాత్రమే కాదు, ప్రపంచ దేశాలన్ని కూడా గ్రహించాల్సిన సత్యం ఏమిటంటే ఆయా మతాల నుండి ఆవిర్భవిస్తున్న అతివాద, తీవ్రవాద సంస్థల నుండి చివరకు ఆయా మతాలకి, మానవ మనుగడకి ప్రమాదం జరుగుతున్నది. అంతేకాదు మానవుడి చేత కనిపెట్టబడిన మతమే మానవుడికి శత్రువై ఉన్నదని నిరూపితం అవుతున్నది. కాబట్టి మానవ మనుగడ ఎల్లకాలం కొనసాగాలి అంటే ఏ మతాన్ని విశ్వసించే వారు ఐన ప్రాథమికంగా మానవ ఉనికికి ప్రాముఖ్యత ఇచ్చి, ఆతర్వాతనే మతానికి రెండో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన చారిత్రక అవసరత ఉన్నది. లేకుంటే మతం పేరుతో, దేవుళ్ల పేరుతో యుద్ధాలుచేసుకుంటే అంతిమంగా నాశనం అయ్యేది మానవుడే అని నేడు ప్రపంచంలో ఉన్న అయా దేశ ప్రభుత్వాలని నడుపుతున్న పాలకులు గ్రహించాల్సిన సత్యం.ఎందుకంటే మానవుడి కోసం మతం ఉండాలి తప్ప, మతం కోసమే మానవుడు పోరాటం చేయకూడదు. ఒకనాడు ఉన్నతమైన జీవితాన్ని, క్రమశిక్షణ జీవితాన్ని గడపడానికి మతాన్ని సృష్టించుకున్న మానవుడునేడు అదే దేవుళ్ల మతం మత్తులో పడి అసలైన మత విలువల మార్గంలో వెళ్లకుండా, ఆయా మత విలువలకు విరుద్ధమైన మార్గంలో ప్రయాణించడం అంటే బుద్ధిజీవి ఐన మానవుడు బుద్ధిహీనుడైన క్రూర మృగాలతో సమానమైన జీవిగామారుతున్నాడని చెప్పని తప్పని పరిస్థితి. నాటి ప్రాచీన మానవ ఆదిమ యుగంలో క్రూర మృగల నుండి రక్షణ కోసంవివిధ ఖనిజాల నుండి ఆయుధాలను తయారు చేసుకున్న మానవుడు నేడు సాటి మానవుల నుండి రక్షణ పొందడానికి భయంకరమైన మరణాయుధాలు తయారు చేసుకోవడం అంటే ఆధునిక సమాజంలో బ్రతుకుతున్నామని చెప్పుకోవాలా లేకుంటే మానవ అభివృద్ధి తిరోగమన దారిలో ప్రయాణం చేస్తుందని చెప్పుకోవాలా అనేది లోతుగా ఆలోచించాల్సిన విషయం. కాబట్టి ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి కూడా నేడు యుద్ధ ప్రాతిపదికన అన్ని దేశాల అధిపతులని ఒకే వేదికపై కూర్చోబెట్టి ఉమ్మడి కార్యచరణలో భాగంగా మానవ మనుగడని ప్రమాదంలో నెట్టివేసే ఉగ్రవాద సంస్థల పై ఐక్యంగా పోరాటం చేసి, మళ్లీ ఏ ఒక్క ఉగ్రవాద సంస్థ కూడా ఏ మతంనుండి పుట్టకుండా బలమైన సంస్కరణలు తీసుకురావాలి. మారణహోమం సృష్టించే రక్షణ ఆయుధాలు అవసరం లేని స్వేచ్ఛగా సమానత్వంతో సోదరభావంతో ప్రపంచ దేశాలన్నీ కూడా వాణిజ్యం చేసుకునేలా మతం కేంద్రంగా కాకుండా, మనిషి కేంద్రంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావాల్సిన బాధ్యత నేడు ఐక్య రాజ్యసమితిపై, అన్ని దేశాల అధిపతులపై ఉన్నది. అంతిమంగా అయా దేశ ప్రభుత్వాల పాలనలో కొన్ని వైఫల్యాలు ఉన్న ప్రభుత్వల బాధ్యతల కంటే సామాజిక, నైతిక బాధ్యత ముఖ్యం కాబట్టి ప్రతి మానవుడు మతం, దేవుడిని రెండో ప్రాధాన్యతగా చూస్తూ, మొదటి ప్రాధాన్యత మానవత్వానికి, మానవ మనుగడకి ఇవ్వాల్సిన అనివార్యత, బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉన్నదనే విషయాన్ని గుర్తు ఎరగి సాటి మనుషుల పట్ల ప్రేమ ఆప్యాయత కరు ణ విలువలు కలిగి ఉండాలి. •

# బంగ్లాను అమెరికాకు అమ్మేస్తున్న యూనస్!

## మాజీ ప్రధాని షేక్ హసీనా ధ్వజం



**న్యూఢిల్లీ, మే 25:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ దేశాన్ని అమెరికాకు అమ్మేస్తున్నారని, ఉగ్రవాదుల అండతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని సైన్యం కోరడంతో రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో బంగ్లాదేశ్‌లో మళ్లీ నిరసనలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే హసీనా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెయింట్ మార్టిన్ దీవిని అమెరికాకు ఇచ్చేందుకు తన తండ్రి ఒప్పుకోకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని షేక్ హసీనా ఫేస్‌బుక్ పోస్ట్‌లో గుర్తుచేసుకున్నారు. "అమెరికా సెయింట్ మార్టిన్ దీవిని అడిగినప్పుడు మా నాన్న అంగీకరించలేదు. అందుకే ఆయన ప్రాణాలు అర్పించాల్సి వచ్చిందని. అధికారంలో ఉండటం కోసం దేశాన్ని అమ్ముకోవాలనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ పిలుపునకు స్పందించి ఆయుధాలు చేపట్టి, పోరాడి, మూడు మిలియన్ల మంది ప్రాణ త్యాగాలతో విముక్తి పొందిన ఈ దేశపు మట్టిలో అంగుళం కూడా ఎవరికీ వదులుకునే ఉద్దేశం ఎవరికీ ఉండదు. కానీ ఈరోజు ఎంత దురదృష్టకరం. దేశ ప్రజలందరి అభిమానం పొందిన వ్యక్తి, ప్రపంచం ప్రేమించిన వ్యక్తి అధికారంలోకి వచ్చాక ఏమైపోయారని హసీనా ప్రశ్నించారు. యూనస్ ఉగ్రవాదుల సాయంతో అధికారాన్ని చేజిక్కించుకున్నారని హసీనా ఆరోపించారు. ఉగ్రవాదుల సాయంతో, అంతర్జాతీయంగా నిషేధానికి గురైన ఉగ్రవాదుల అండతో ఆయన అధికారం చేపట్టారు. బంగ్లాదేశ్ ప్రజలను మేం వీరి నుంచి కాపాడాం. ఒకే ఒక్క ఉగ్రదాడి తర్వాత మేం కఠిన చర్యలు తీసుకున్నాం. చాలా మందిని అరెస్టు చేశాం. ఇప్పుడు జైళ్లు ఖాళీ అయ్యాయి. అందరినీ విడుదల చేశారు. బంగ్లాదేశ్ ఇప్పుడు మళ్లీ ఆ ఉగ్రవాదుల రాజ్యంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అయిన అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. మా గొప్ప బెంగాలీ జాతి రాజ్యాంగాన్ని సుదీర్ఘ పోరాటం, విముక్తి యుద్ధం ద్వారా సాధించుకున్నాం. చట్టవిరుద్ధంగా అధికారం చేపట్టిన ఈ ఉగ్రవాద నాయకుడికి రాజ్యాంగాన్ని తాకే హక్కు ఎవరిచ్చారు. ఆయనకు ప్రజల మద్దతు లేదు, రాజ్యాంగబద్ధమైన ఆధారం లేదు. ఆయన పదవికి కూడా ఎలాంటి ఆధారం లేదు, అది ఉనికిలోనే లేదు. అలాంటప్పుడు పార్లమెంటు లేకుండా ఆయన చట్టాన్ని ఎలా మార్చగలరు ఇది చట్టవిరుద్ధమని హసీనా తీవ్రంగా విమర్శించారు.



## పార్టీ, కుటుంబం నుంచి కొడుకును బహిష్కరించిన లాలూ

**పాట్నా, మే 25:** ఆర్జేడీపార్టీ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆదివారం సంచలన ప్రకటన చేశారు. తన పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా కుటుంబం నుంచి కూడా అతడిని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ విలువలు, సాంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందుకు తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి, కటుంబం నుంచి బహిష్కరిస్తున్నామని లాలూ యాదవ్ తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించారు. తాను 12 ఏళ్లుగా అనుష్క యాదవ్ అనే మహిళతో రిలేషన్‌లో ఉన్నట్లు తెలుపుతూ తేజ్ ప్రతాప్ యాదవ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో శనివారం చేసిన పోస్టు వైరల్ అయ్యింది. ఆ మరుసటి రోజే లాలూ యాదవ్ అతడిపై బహిష్కరణ వేటు వేశారు. అయితే తన ఫేస్‌బుక్ పోస్టుపై ఆదివారం ఉదయమే తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. ఆ పోస్టు తాను పెట్టింది కాదని, తన ఫేస్‌బుక్ ఖాతాను ఎవరో హ్యాక్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ పోస్టుతో జత చేసిన ఫొటో కూడా ఒరిజినల్ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ఎడిట్ చేశారని ఆరోపించారు. తమ కుటుంబ పరువు తీయడానికే ఎవరో ఇలా చేశారని విమర్శించారు. అయినా ఆ పోస్టును కారణంగా చూపుతూ అతడి తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ తేజ్ ప్రతాప్‌పై బహిష్కరణ వేటు వేయడం గమనార్హం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న తేజ్‌ప్రతాప్ యాదవ్ ఫేస్‌బుక్‌లో అనుష్క యాదవ్ అనే అమ్మాయితో ఉన్న ఫొటోను షేర్ చేశారు. తమ ఇద్దరి మధ్య 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్ ఉందని, ఇంతకాలం ఈ విషయం చెప్పాలనుకున్నా ఎలా చెప్పాలో తెలియలేదని, ఇప్పుడు ఈ విషయాన్ని తెలియజేస్తున్నానని అందులో పేర్కొన్నారు. అయితే, తేజ్‌ప్రతాప్‌కు ఇప్పటికే వివాహం కావడంతో ఈ ఫొటో ఒక్కసారిగా వైరల్ అయింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనుమరాలినే తేజ్‌ప్రతాప్ పెళ్లి చేసుకున్నారు. అయితే గృహహింస, కుటుంబ కలహాల కారణంగా వీరి వివాహబంధం విచ్ఛిన్నమైంది. హ్యాకింగ్ వ్యవహారంపై తేజ్‌ప్రతాప్ ఫిర్యాదు చేశారా అనేది వెంటనే తెలియలేదు.

# ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్




**న్యూఢిల్లీ, మే 25:** భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అధిగమించిందని జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) నాలుగు లక్షలకోట్ల డాలర్ల మార్కును తాకిందని, ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందున్నాయని ఆయన తెలిపారు. నీతి ఆయోగ్ పదో పాలక మండలి సమావేశం అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలో చేపట్టిన సంస్కరణలు, ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు అనుకూలంగా మారుతున్న పరిస్థితులే ఈ వృద్ధికి కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మనం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం. మన ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని ఆయన అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తాజా అంచనాలను ఉటంకిస్తూ వివరించారు. ఇదే ప్రగతిని కొనసాగిస్తే, మరో రెండున్నర, మూడేళ్లలో మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని సుబ్రహ్మణ్యం ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక చిత్రపటంలో భారత్ కీలకమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో ఈ ఘనత సాధించడం విశేషం. అమెరికాలో విక్రయించే ఐఫోన్లు భారత్ వంటి దేశాల్లో కాకుండా స్వదేశంలోనే తయారు చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సుబ్రహ్మణ్యం స్పందించారు. భవిష్యత్తులో అమెరికా సుంకాల విధింపు ఎలా ఉంటుందో స్పష్టత లేదని, అయినప్పటికీ, ఆ పరిస్థితులతో సంబంధం లేకుండా భారత్ తక్కువ ఖర్చుతో కూడిన తయారీ కేంద్రాన్ని అందిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ప్రభుత్వం త్వరలో మరిన్ని ఆస్తుల నగదీకరణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆగస్టులో రెండో విడత ఆస్తుల నగదీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రపంచ సరఫరా గొలుసులో తన పాత్రను మరింత బలోపేతం చేసుకోవాలని, కొత్త పెట్టుబడులను ఆకర్షించాలని భారత్ చూస్తున్న ప్రస్తుతం రాజకీయంగా కీలకమైన తరుణంలో ఈ ఆర్థిక విజయం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## రోగ నిరోధకశక్తి పెంచుతున్న 'పగటి వెలుతురు'

### మన ఆరోగ్యంలో అదే కీలకపాత్ర



**ఆక్లాండ్, మే 25:** పగటిపూట వెలుతురు మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. శరీరంలోకి ప్రవేశించే ఇన్ఫెక్షన్లతో పోరాడే రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని సూర్యకాంతి గణనీయంగా పెంచుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో అనేక వ్యాధులకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. న్యూజిలాండ్‌లోని వైపప టౌమాట రౌ, ఆక్లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన చేపట్టింది. మన శరీరంలో అత్యధికంగా ఉండే రోగనిరోధక కణాలైన న్యూట్రోఫిల్స్ పై వీరు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తెల్ల రక్త కణాలు ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతానికి వేగంగా చేరుకుని, హానికర బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. పగటి వెలుతురు ఉన్నప్పుడు ఈ న్యూట్రోఫిల్స్ లోని సిర్కాడియన్ గడియారం అంటే జీవగడియారం ఉత్తేజితమై, వాటి పనితీరును మెరుగుపరుస్తుందని సైన్స్ ఇమ్యునాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వెల్లడించింది. పరిశోధకులు ఈ అధ్యయనం కోసం జీబ్రాఫిష్‌ను నమూనాగా ఉపయోగించారు. వీటి జన్యు నిర్మాణం మనుషులను పోలి ఉండటం, శరీరం పారదర్శకంగా ఉండటంతో జీవ ప్రక్రియలను గమనించడం సులభమని వారు తెలిపారు. పగటిపూట జీవులు చురుకుగా ఉంటూ, బ్యాక్టీరియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, ఉదయం పూట రోగనిరోధక స్పందనలు అధికంగా ఉండటాన్ని గతంలో గమనించామని మాలిక్యులర్ మెడిసిన్ అండ్ పాథాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ హాల్ వివరించారు. శరీరంలోని చాలా కణాలు బయటి ప్రపంచంలో సమయాన్ని తెలుసుకోవడానికి సిర్కాడియన్ గడియారాలను కలిగి ఉంటాయి. ఈ గడియారాలను రీసెట్ చేయడంలో వెలుతురు ప్రధాన పాత్ర పోషిస్తుంది. వాపు సంబంధిత ప్రాంతాలకు మొదటగా చేరుకునేవి న్యూట్రోఫిల్సే కాబట్టి, మా ఆవిష్కరణ అనేక వాపు సంబంధిత వ్యాధులకు చికిత్సా ప్రయోజనాలను అందించడంలో చాలా విస్తృతమైన చిక్కులను కలిగి ఉంది అని హాల్ పేర్కొన్నారు. న్యూట్రోఫిల్స్‌లోని సిర్కాడియన్ గడియారంపై వెలుతురు నిర్దిష్టంగా ఎలా ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రస్తుతం పరిశోధన సాగుతోంది. ఈ దిశగా మరిన్ని ఆవిష్కరణలు జరిగితే, ఇన్ఫెక్షన్లతో పోరాడే సరికొత్త ఔషధాల తయారీకి ఆస్కారం ఏర్పడుతుంది.



## మాకు ఆ విద్యార్థుల వివరాలు కావాలి..

### హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ పోస్టు

**వాషింగ్టన్, మే 25:** హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మొత్తం 31 శాతం మంది విదేశీ విద్యార్థులు ఉన్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు తమకు అందజేయాలని కోరారు. ఇటీవల హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీన్ని అక్కడి ఫెడరల్ న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ ఆదివారం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'మొత్తం 31 శాతం మంది విదేశీ విద్యార్థులున్నారనే విషయాన్ని హార్వర్డ్ ఎందుకు చెప్పడంలేదు. వారిలో అమెరికా వ్యతిరేకదేశాల నుంచి వచ్చిన వాళ్లూ ఉన్నారు. ఆయాదేశాలు వారి విద్యార్థుల చదువు కోసం ఎలాంటి సొమ్ము చెల్లించడం లేదు. ఆ విదేశీ విద్యార్థుల వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాం. హార్వర్డ్ యూనివర్సిటీకి మేము బిలియన్ డాలర్లు చెల్లించాం. వారి వివరాలు తెలుసుకోవాలనే మా అభ్యర్థన సరైనదే. మాకు ఆ విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు కావాలి. మీ దగ్గర రూ. 442కోట్లు ఉన్నాయిగా వాటినే ఉపయోగించుకోండి. డబ్బు కోసం ఫెడరల్ ప్రభుత్వానికి ఎలాంటి విజ్ఞప్తులు చేయకండి' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే గురువారం ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చు కోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ కోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ట్రంప్ చర్య నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని హార్వర్డ్ పేర్కొంది. 'ఒక్క సంతకంతో యూనివర్సిటీలోని మొత్తం విద్యార్థుల్లో పావువంతు మందిని తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది' అని వెల్లడించింది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాక్‌కు తీవ్రపరిణామాలే!

### మజ్లిస్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ



**మనామా(బహ్రెయిన్), మే 25:** పాకిస్థాన్‌ను ఒక విఫలదేశంగా అభివర్ణిస్తూ, ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని భారత అఖిలపక్ష బృందం నిన్న బహ్రెయిన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద ముప్పు గురించి ప్రపంచానికి తెలియజేయడానికే మా ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి పంపింది. దురదృష్టవశాత్తు ఈ ఉగ్రవాదం వల్ల మేం ఎంతోమంది అమాయకుల ప్రాణాలను కోల్పోయాం. ఈ సమస్యకు పాకిస్థాన్ మూలకారణం. ఆ దేశం ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడం ఆపేంత వరకు ఈ సమస్య పరిష్కారం కాదని ఒవైసీ స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఒవైసీ తెలిపారు. పాకిస్థాన్ మరోసారి ఇలాంటి దుస్సాహసానికి పాల్పడితే వారు ఊహించని దానికంటే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. తీవ్రమైన కవ్వింపు చర్యలు ఎదురైనా భారత్ ఎప్పుడూ సంయమనం పాటిస్తూ వస్తోందని గుర్తుచేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదం సృష్టిస్తున్న మానవ విషాదాన్ని ఆయన వివరించారు. ఆరు రోజుల క్రితం పెళ్లయిన మహిళ ఏడో రోజే వితంతువుగా మారింది. రెండు నెలల క్రితం వివాహమైన మరో మహిళ కూడా ఈ దాడిలో తన భర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా రాజకీయ అభిప్రాయాలు వేరైనా, దేశ సమగ్రత విషయంలో మేమంతా ఒక్కటే. ఈ విషయాన్ని మా పొరుగు దేశం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని ఒవైసీ అన్నారు. భారతదేశానికి తన పౌరులనే కాకుండా, దేశంలో నివసించే ప్రతి ఒక్కరి భద్రతను కాపాడటానికి కావలసిన శక్తిసామర్థ్యాలున్నాయని ఒవైసీ నొక్కిచెప్పారు. పాకిస్థాన్ లాంటి విఫలదేశం నుంచి వస్తున్న అన్ని రకాల ముప్పులను మన వాయు రక్షణ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులను అరికట్టేందుకు అంతర్జాతీయ సహకారం చాలా అవసరమని ఒవైసీ పేర్కొన్నారు. బైజయంత్ పాండా నేతృత్వంలోని ఈ ప్రతినిధి బృందంలో ఒవైసీతో పాటు గులాం నబీ ఆజాద్, బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, ఫాంగ్నాన్ కొన్యాక్, ఎన్‌జేపీ ఎంపీ రేఖా శర్మ, ఎంపీ సత్నామ్ సింగ్ సంధు, రాయబారి హర్ష్ ష్రింగ్లా తదితరులు ఉన్నారు.

# కువైట్‌లో42 వేలమంది పౌరసత్వం రద్దు



**కువైట్‌సిటీ, మే 25:** కువైట్‌లో ఇటీవలికాలంలో దాదాపు 42,000 మంది పౌరసత్వం రద్దు చేసారు. డిసెంబర్ 2023లో అధికారం చేపట్టిన కొత్త ఎమిర్, 84 ఏళ్ల మిషాల్ అల్‌అహ్మద్ అల్‌జాబర్ అల్‌సబా నాయకత్వంలో ఈ అణచివేత ప్రారంభమైంది. ఈ పౌరసత్వం రద్దులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ప్రభుత్వం ఇప్పుడు నిజమైన కువైటీలు మాత్రమే కువైట్‌లో నివసిస్తారని వారికి మాత్రమే ఇక్కడి నుండి రక్త సంబంధాలు ఉంటాయని చెబుతోంది. ఈ విధానం చట్టవిరుద్ధంగా కువైట్ పౌరసత్వం పొందిన విదేశీయులను లక్ష్యంగా చేసుకుందన్న విమర్శలు వెల్లువెత్తాయి. కువైట్ పాలకులు తీసుకున్న నిర్ణయం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే మహిళలు కువైట్ పురుషులను వివాహం చేసుకున్న తర్వాత ఇక్కడి పౌరులుగా మారారు. వాళ్లను టార్గెట్‌గా చేసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పౌరసత్వం కోల్పోయిన తర్వాత ఈ వ్యక్తులు ఇకపై ఏ దేశ పౌరులు కారు. వారికి ప్రభుత్వ ఆరోగ్య సేవలు, పిల్లల పాఠశాల ఫీజులు, భూమి కొనుగోలు లేదా కంపెనీలో వాటాలను పంచుకోవడం వంటి హక్కులు తొలగించబడతాయి. కొంతమంది డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా రద్దుచేసారు. బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడంపై ఆంక్షలు విధించారు. ఈ మహిళల విషయంలో కూడా అదే జరిగింది. వారు చెల్లింపు చేయడానికి ప్రయత్నించినప్పుడు వారి ఖాతాలు స్తంభింపజేసారు. కువైట్‌లో నివసిస్తున్న దాదాపు 50 లక్షల మందిలో మూడింట ఒక వంతు మంది మాత్రమే నిజమైన కువైటీలు అని ఎమిర్ ఒక ప్రసంగంలో అన్నారు. అటువంటి పరిస్థితిలో ఆగస్టు నుండి వేలాది మంది ప్రజల పౌరసత్వం రద్దు చేయనున్నారు. వారిలో 26 వేల మంది వివాహం తర్వాత ఇక్కడ పౌరసత్వం పొందిన మహిళలు ఉన్నారు. ఇది కువైట్ అధికారిక నివేదిక అయితే వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. డిసెంబర్ 2023లో కొత్త ఎమిర్ షేక్ మెషాల్ అల్ అహ్మద్ అల్ సబా ఎమిర్ అయిన వెంటనే పార్లమెంట్‌ను రద్దు చేసి రాజ్యాంగంలోని కొన్ని భాగాలను నిలిపివేశారు. నైతిక అశాంతి నిజాయితీ లేకపోవడం లేదా ధనవంతులు, మతపరమైన వ్యక్తుల విమర్శలు వంటి కారణాల వల్ల పౌరసత్వాన్ని రద్దు చేయడానికి అనుమతించే చట్టం డిసెంబర్‌లో సవరించబడింది. దీని కింద హోం మంత్రి నేతృత్వంలోని అత్యున్నత కమిటీ ఎవరి పౌరసత్వం చెల్లుబాటు అవుతుందో నిర్ణయిస్తుంది. పౌరసత్వం తొలగించబడిన వారి పేర్లను ప్రతి వారం బహిరంగపరుస్తారు. కువైట్‌లో ద్వంద్వ పౌరసత్వం అనుమతించబడదు. కాబట్టి కువైట్ పౌరసత్వం తీసుకునే వారు తమ అసలు పౌరసత్వాన్ని వదులుకోవాలి.

### యుఎస్‌లో నకిలీ వీసా రాకెట్ గుట్టురట్టు

## ఇద్దరు పాకిస్థానీయుల అరెస్టు



**వాషింగ్టన్, మే 25:** అమెరికాలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగాలు సృష్టించి వాటిని చూపించి అక్రమంగా వీసాలు పొందుతున్న కేటుగాళ్ల గుట్టు రట్టయింది. ఇలా అక్రమంగా పొందిన వీసాలను విదేశీయులకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్న ఇద్దరు పాకిస్థాన్ జాతీయులను అమెరికా ఎఫ్‌బిఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాశ్ పటేల్ వివరించారు. టెక్సాస్‌లోని పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్ హది ముర్షిద్ (39), మహమ్మద్ సల్మాన్ (35)లను ఎఫ్‌బిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరు ఉద్యోగాలు సృష్టించినట్లు నకిలీ పత్రాలు సమర్పించి అక్రమంగా వీసాలు పొంది వాటిని విదేశీయులకు పెద్దఎత్తున అమ్ముకునే వారు. ఇందుకు ఇబి-2, ఇబి-3, హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌లను ఉపయోగించేవారు. అమెరికన్లకే ఉద్యోగాలు ఇస్తున్నట్లు లేబర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని నిబంధనలు పాటిస్తున్నట్లున్న నకిలీ ఉద్యోగ ప్రకటనలను పత్రికల్లో పబ్లిష్ చేయించారు. ఒక్కసారి అక్కడి నుంచి అనుమతులు వచ్చిన తర్వాత వారు వీసా కోరుకుంటున్న వారి కోసం గ్రీన్‌కార్డులను మంజూరు చేయాలని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగాన్ని అభ్యర్థిస్తారు. వీరి గుట్టు కాస్త బయట పడటంతో ఎఫ్‌బిఐ అధికారులకు చిక్కారు. విచారణలో ముర్షిద్ చట్టవిరుద్ధంగా అమెరికా పౌరసత్వం పొందేందుకు యత్నించినట్లు తేలింది. వీరు కొన్ని సంవత్సరాల నుంచి ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారని ఎఫ్‌బిఐ డల్లాస్ స్పెషల్ ఏజెంట్ ఒకరు పేర్కొన్నారు. జాతీయ భద్రతను కాపాడటానికి, ఇమ్మిగ్రేషన్‌కు బలమైన చట్టాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై ఈ నెల 30న తదుపరి విచారణ జరగనుంది. వీరు దోషులుగా తేలితే దాదాపు 20 యేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కొచ్చితీరంలో మునిగిన నౌకలో ప్రమాదకర రసాయనాలు



**కొచ్చి, మే 25:** కొచ్చి తీరంలో మునిగిపోయిన నౌకలో ప్రమాదకర రసాయనాలు ఉండటంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివారం కేరళలోని కొచ్చి తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదానికి గురైంది. ఆ నౌక ముందుగా ఒకవైపు ఒరిగిపోయి ఆ తర్వాత మెల్లగా మునిగిపోయిందని ఇండియన్ కోస్ట్ గార్డ్ స్పష్టం చేసింది. మునిగిపోయిన నౌకలో మొత్తం 640 కంటెయినర్‌లు ఉండగా, వాటిలో 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు. ఆ రసాయనాలు లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటెయినర్లను గానీ, వాటిలో నుంచి బయటకు వచ్చిన ఇంధనం గానీ తీరం వైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ ని వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. రసాయనాల నౌక మునక కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విజింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా 3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ తీరానికి చేరుకోవాల్సి ఉండగా.. కొద్దిసేపటి ముందు సముద్రంలో మునిగిపోయింది.కాగా, కంటెయినర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు.

## ఉగ్రవాదానికి పాక్ సైన్యం, ఐఎస్ఐల మద్దతు

### మాజీ ముఖ్యమంత్రి, సీనియర్‌నేత గులాంనబీ ఆజాద్



**మనామా(బహ్రెయిన్), మే 25:** జమ్ముకశ్మీర్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ సైన్యం, అక్కడి గూఢచార సంస్థ ఐఎస్ఐ, పాకిస్థాన్ రాజకీయ నాయకులే పూర్తి బాధ్యత వహించాలని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బహ్రెయిన్‌లో జరిగిన అఖిలపక్ష ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ ఈ శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. తాను విద్యార్థి దశ నుంచీ, రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచీ సరిహద్దు ఆవలి నుంచి ప్రేరేపిత ఉగ్రవాదాన్ని చూస్తూనే ఉన్నానని ఆజాద్ తెలిపారు. ఒకప్పుడు కశ్మీర్‌లో ఏం జరుగుతుందో ఢిల్లీలోని ప్రభుత్వ ఏజెన్సీలకు తప్ప సాధారణ ప్రజలకు తెలిసేదికాదు. కానీ, మీడియా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ఇప్పుడు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలుస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాల్లోనే జమ్మూకశ్మీర్‌లో 40,000 మందికి పైగా స్థానికులు ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లా, ప్రావిన్షియల్ కమాండర్లను దాదాపుగా ఏరివేశాం. నెల రోజుల పాటు వారికి కమాండర్లే లేరు. కానీ, నెల తిరిగేలోపే జూనియర్ కమాండర్లతో ఆ స్థానాలను భర్తీ చేశారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌కు నిజానికి సైన్యం అవసరమే లేదు. ఇలాంటి పనులు చేయకపోతే పాక్ సైన్యం అప్రస్తుతం అయిపోతుంది. ప్రస్తుతం పాకిస్థాన్‌లో అత్యంత ధనవంతులు రాజకీయ నాయకులు కాదు, సైన్యాధికారులే. ప్రపంచంలో ఎక్కడైనా అవినీతిపరులైన రాజకీయ నాయకులు ధనవంతులు అవ్వడం చూస్తాం. కానీ, సైనిక అధికారులు శ్రీమంతులు కావడం పాకిస్థాన్‌లోనే చూస్తాం. ఒక్క భారత సైన్యాధికారికి కూడా లండన్‌లో ఇల్లు ఉండకపోవచ్చు, కానీ లండన్‌లో గానీ, ప్రపంచంలో మరెక్కడైనా గానీ ఇల్లు లేని పాకిస్థాన్ జనరల్ ఒక్కరు కూడా ఉండరని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

## ఉక్రెయిన్ నగరాలపై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి: 12 మంది మృతి



**మాస్కో మే 25:** ఉక్రెయిన్-రష్యాల మధ్య ఓవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య దాడులు మాత్రం ఆగడం లేదు. ఆదివారం వందలాది మంది సైనికులు, పౌరులను విడిచిపెట్టిన రష్యా ఉక్రెయిన్‌పై భీకర దాడులకు తెగబడింది. దాదాపు 367 డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయగా.. వీటిల్లో 12 మంది మృతి చెందారు. మూడేళ్ల యుద్ధంలో ఒకేసారి ఈ స్థాయిల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడం ఇదే తొలిసారి అని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా శుక్రవారం ఇరుపక్షాలు 390 మంది చొప్పున మార్పిడి చేసుకోగా శనివారం 307 మందిని ఇరుదేశాలు మార్పిడి చేసుకున్నాయి. తాజాగా మరో 303 మంది సైనికులను పరస్పరం అప్పగించుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ ప్రకటన రాకముందు కీవ్‌తోపాటు ఇతర ప్రాంతాలపై మాస్కో భీకర దాడులు చేసింది. ఒకేరోజు 69 క్షిపణులతోపాటు 298 డ్రోన్లతో విరుచుకుపడింది. వీటిలో ఇరాన్ రూపొందించి షాహెద్ డ్రోన్లు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దాడుల్లో 12 మంది చనిపోగా అనేకమంది గాయాలపాలయ్యారు. ఉక్రెయిన్‌లోని 30 నగరాలు, గ్రామాలపై ఉద్దేశపూర్వక దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను అభ్యర్థించారు. రష్యా నాయకత్వంపై బలమైన ఒత్తిడి తీసుకువస్తే తప్పితే ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయలేమన్నారు.

## యాంగ్మోకు రాయపాటి శైలజ అభినందనలు

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అంధత్వం లక్ష్యసాధనకు అడ్డు కాదని నిరూపించిన హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన గిరిజన అంధురాలు ఛోంజిన్ యాంగ్మోకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదిక ఆమె ప్రపంచంలోనే ఎవరెస్ట్‌ను అధిరోహించిన ఐదోవ అంధ మహిళగా రికార్డ్ సృష్టించిన నీకు తరపున అభినందనలన్నారు.

మహిళలు తలుచుకుంటే ఎంతటి కష్టసాధ్యమైన పనైనా సాధిస్తారని మరోసారి నిరూపించినందుకు అభినందనలు. దేశంలోని కోట్లాదిమంది మహిళలకు ఆదర్శంగా ఛోంజిన్ యాంగ్మో నిలవటం దేశానికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ అన్నారు.



శ్రీకాళహస్తీశ్వరుని సన్నిదిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకుంటున్న దృశ్యం

## రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించిన సంస్కరణలతో ఆలయ ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆదివారం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బందిని పరుగులు తీయించారు. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30 వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో ఆరువేల రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్టు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శన టిక్కెట్టు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు పది వేల మందిగా ఆలయ ఇఓ బాపిరెడ్డి వివరించారు. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓలు సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వెంకటముని, సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న డా కరణం రాజేష్‌కుమార్

## 'దక్షిణ భారతంపై కేంద్రం వివక్ష'

**విజయవాడ, మే 25, ప్రభాతవార్త :** దక్షిణ భారతంపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష వల్ల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దక్షిణ భారతమంతా ఏకమై పోరాడాలని జస్టిస్ ఫర్ సౌతిండియా మూమెంట్ ఫౌండర్ డా కరణం రాజేష్ కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 33 శాతం స్థానాలు దక్షిణావనికి కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్‌కు ఏపి అధ్యక్షుడుగా జీఎస్ ఫణిరాజును నియమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ 17శాతంకు దక్షిణ భారతంలో జనాభా పడిపోయిందని అందువల్ల 33శాతం స్థానాలు కేటాయించాలన్నారు. 1970లో డా కెఎల్ రావు ప్రతిపాదించిన నదుల అనుసంధానం ప్రాజెక్టులపై ఎటువంటి ప్రతిస్పందన ఇప్పటివరకు లేదన్నారు, గంగా, యమునా నదులకు చెందిన మిగులు జలాలను దక్షిణ భారతంలోని నదుల అనుసంధానం చేయాలని, దేశ రెండో రాజధాని, సుప్రీంకోర్టు బెంచ్ దక్షిణాదిలో వుండాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారత రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలకంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని, కానీ కేంద్రం దక్షిణాదికి మద్దతు తక్కువగా వుందన్నారు.

కార్యక్రమంలో అమరావతి జెఏసి అధ్యక్షుడు బాలకోటయ్య, ఏపి కోఆర్డినేషన్ జైహింద్ పార్టీ దశరధి రామిరెడ్డి, కనకం శ్రీనివాసులు, డిఎస్ఎన్వి ప్రసాద్ 27 రాష్ట్ర పార్టీల నేతలు పాల్గొన్నారు.



వేసవి ఈత శిక్షణ పూర్తిచేసుకున్న బాలలు, మహిళలకు శిక్షణ పూర్తి సర్టిఫికెట్లు అందజేసిన కోచ్ పాండురంగారావు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ దీపక్‌కుమార్

## ప్రభుత్వం విద్యాసంస్థల్లో ఈత శిక్షణ తరగతులు నిర్వహించాలి

**జగ్గయ్యపేట, మే 25, ప్రభాతవార్త :** ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో విద్యార్థులు నీటి కుంటలు, చెరువులు, ఏర్లు, నదుల్లోకి దిగి ప్రమాదాలకు గురవుతూ ఈత తెలియక అకాల మృత్యువుకు బలవుతున్నారని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి కనీసం హైస్కూళ్ళ స్థాయిలో ఈత శిక్షణ తరగతులు నిర్వహించాలని పలువురు విద్యావంతులు, స్విమ్మర్లు విజ్ఞప్తిచేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో డ్రీమర్స్ స్విమ్మర్ అసోసియేషన్ (డిఎస్ఏ) కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి సారథ్యంలో విడతల వారీగా నెల రోజుల్లో 78 మందికి వేసవి ఈత శిక్షణ ఉచితంగా నిర్వహించారు. ఈత శిక్షణ పూర్తిచేసుకున్న బాలలు, మహిళలకు ఆదివారం ఫైనల్ పరీక్షలు పూర్తిచేసి వారికి సీనియర్ స్విమ్మర్ డాక్టర్ సామినేని దీపక్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. పట్టణశివారులోని ఓంకారేశ్వరస్వామి దేవాలయ పాలేటి ఘాట్ సమీపంలోగల గంగమ్మ ఆలయం వద్ద ఈకార్యక్రమం జరిగింది. ఫ్రీస్టైల్, బ్రెస్ట్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో ఈత శిక్షణ పొందిన వారిని అతిథులు, సీనియర్ స్విమ్మర్లు అభినందించారు. విద్యార్థి దశలోనే ఈత శిక్షణ పొందాలని, క్రీడా విభాగంలో కూడా విద్యార్థుల భవిష్యత్తుకు ఈ అర్హత ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అన్నారు. ప్రభుత్వం ఈవిషయంలో ప్రత్యేక దృష్టి సారించి విద్యాసంస్థల్లో క్రీడా మైదానాలతోపాటు స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటుకు కూడా ప్రాధాన్యతనివ్వాలని వారు కోరారు.

కాగా డిఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, కలాలి నరేష్, టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్, కోశాధికారి పి రమాదేవి, సహాయకోచ్‌లు అడ్డగొట్టం రమేష్, ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్చా లక్ష్మణరావు, పొట్టాబత్తిన సందీప్ సభా కార్యక్రమాలు నిర్వహించారు. స్విమ్మర్స్ కోఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, సభ్యులు కూరపాటి సరిత, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ, వై ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా పరిశ్రమను బెదిరించకండి

### సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** సినిమా పరిశ్రమని బెదిరిస్తూ వాళ్లు తమ దగ్గరికి చర్చలకు రావాలని, గౌరవాన్ని నిలబెట్టుకోవాలని కోరటం బెదిరించే పద్ధతిలో ఉన్నదని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సింగిల్ థియేటర్ యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మొత్తం ఫిల్మ్ ఇండస్ట్రీపై విరుచుకుపడటం సరికాదన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదే సినిమా రంగం నుండి వచ్చి ఈ రకంగా మొత్తం పరిశ్రమనే బెదిరించి తమ వద్దకు తెచ్చుకోవాలనే పద్ధతిలో వ్యవహరించడం సరికాదన్నారు. సినిమా నిర్మాతలు, థియేటర్ల యజమానుల సమస్యలు ఏమిటో తెలుసుకొని సినీ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేయాలని, అందుకోసం ఆయా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించి చర్చించాలని కోరారు. రాష్ట్రం విడిపోయి 10సంవత్సరాలైనా ఇంతవరకు ఇక్కడ సినీపరిశ్రమ అభివృద్ధి కాలేదన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికిరాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కావున వేలాది మంది కళాకారులు, ప్రత్యక్షంగా,పరోక్షంగా లక్షల మంది ఆధారపడే సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకోవాలని కోరారు. ఆ రంగంలోని ప్రముఖులను, థియేటర్లు, 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించిన సంఘాలను పిలిచి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫోటోను తొలగించాలి

### మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు డిమాండ్

**అనంతపురం, మే 25 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉంటే తొలగించాలని టిడిపినేత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతోందని ఇంకా అక్కడక్కడ సచివాలయాల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలు ఉంటున్నాయని, ఇంకా అక్కడ ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫోటోలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ఆయన అధికారులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం, స్థానిక రహదారులు, భవన అతిథి గృహంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ ఛాంబర్‌లో



వైఎస్.జగన్ ఫోటోను చూసి వెంటనే తొలగించాలని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మకు విజ్ఞప్తి చేశామన్నారు. జగన్ ఫోటో తీసి వేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోటో పెట్టాలని మేము స్వయంగా జడ్పి చైర్మన్‌కు సీఎం ఫోటోను ఇచ్చి వచ్చామన్నారు. అయినప్పటికీ వైఎస్.జగన్‌ఫోటోను తొలగించలేదని, ఇటీవల జిల్లా పరిషత్ సమావేశానికి వెళ్లినప్పుడు నేను, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌లు కలిసి జడ్పి సిఇఓ రామచంద్రారెడ్డిని ప్రశ్నించామన్నారు. ఎందుకు వైఎస్.జగన్‌ఫోటోను తొలగించలేదని గట్టిగా ప్రశ్నించామన్నారు. వైఎస్.జగన్ ఫోటోను పూర్తిగా తొలగించి సీఎం చంద్రబాబు ఫోటోను ప్రధానంగా పెట్టాలని మేము గట్టిగా ప్రశ్నించిన మాట వాస్తవమేనని, ఇందులో తప్పేముందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ప్రశ్నించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ తదితరులు ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదులు చేయడంలో ఏమైనా న్యాయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. అనంతపురం జడ్పి చైర్మన్ ఛాంబర్‌లో మేము జడ్పి సిఇఓతో ఏం మాట్లాడామో అన్నది వీడియోల్లో రికార్డు అయిందని, ఆ వీడియోలను జిల్లా పోలీసు అధికారులు పరిశీలించి తప్పుంటే కేసు పెట్టుకోవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విజ్ఞప్తి చేశారు. వాస్తవాలన్ని ప్రజలకు తెలుసని ప్రజలను వైసిపి నాయకులు తప్పుదోవ పట్టిస్తే నమ్మేస్థితిలో వారు లేరని ఆయన వెల్లడించారు.

## రైతు శ్రేయస్సే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పరిశ్రమిస్తోందని తెలుగుదేశంపార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం 50 శాతం సబ్సిడీ ధరలతో రైతులకు పశువుల దానా పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 500ల మంది రైతులకు 50 కిలోల వంతున పశువుల దానా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ రైతులు పశుదానాను ఉపయోగించుకుని పాల దిగుబడి అధికంగా సాధించాలన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ



యాభైశాతం సబ్సిడీతో రైతులకు పశువుల దానా కట్టలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

సంచాలకులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ మురళీకృష్ణ, రావూరి శ్రీను, గుమ్మ వెంకటేష్, పశుపోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లాక్‌రూం కాంట్రాక్టర్‌పై విచారణ చేస్తాం: ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 25, ప్రభాతవార్త:** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోటానికి కడప నుండి వచ్చిన భక్తులతో ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు తమ బ్యాగులను కౌంటర్లలో భద్రపరచడానికి ఎక్కువ రుసుము వసూలు చేసినట్లు ఆరోపించడంతో వెంటనే ఇఓ సదరు కాంట్రాక్టర్‌పై విచారణకు ఆదేశించారు. ఆదివారం ఇఓ ఆలయంలోని సుబ్రమ్మణ్య స్వామివార్ల ఆలయం పరిశీలించి అక్కడ అపరిశుభ్రంగా వున్న చోట శుభ్రం చేయాలన్నారు. ఉదయం 11.30నుండి మధ్యాహ్నం 1.30 లోపు వచ్చిన భక్తులకు విఐపి దర్శనం కుదరదని తెలిపారు.

ప్రోటోకాల్ ఆఫీసులో సమాచారం ఏఇఓకు ఇవ్వకుండా నేరుగా ఆలయానికి వచ్చిన వారికి విఐపి దర్శనం ఆ సమయంలో లేదన్నారు. ఆదివారం సం దర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా వుండడంతో ఇఓ ఆలయమంతా పరిశీలిస్తూ క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రోటోకాల్ విఐపి దర్శనాలను కట్టడి చేశారు. భక్తులతో ముచ్చటించి వారికందుతున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యానదాన పథకానికి ఆదివారం విజయవాడకు చెందిన వి వెంకట అప్పారావు తమ కుటుంబసభ్యులతో కలిసి



దాతలనుండి విరాళం అందుకుంటున్న ఇఓ శీనా నాయక్

రు.2లక్షల విరాళాన్ని ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. ఈ సందర్భంగా దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**వేదోక్తంగా సూర్యోపాసన:** దుర్గమ్మ వారి ఆలయంలో వేదోక్తంగా సూర్యోపాసన ను ఆదివారం పండితులు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో ఉదయాస్తమాన సేవలను శాస్త్రోక్తంగా జరిపారు.

**జగన్మాతకు నృత్యనీరాజనం:** యనమలకుదురుకు చెందిన శ్రీ హనుమాన్ నృత్య కళానిలయం ఆచార్య కె శ్రీనివాస్ నేతృత్వంలో 14 మంది శిష్యబృందం ఆదివారం కళావేది కపై అద్భుతంగా దుర్గమ్మవారికి నృత్య నీరాజనాలర్పించారు. అనంతరం వారికి దుర్గ మ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

## ఆ నలుగురిలో నేను లేను

### థియేటర్లు బంద్ చేస్తామనడం కరెక్ట్ కాదు

### మంత్రి దుర్గేశ్ స్పందన సమంజసమైందే

### సినీనిర్మాత అల్లు అరవింద్ వివరణ



హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న అల్లు అరవింద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** తెలుగు సినీ పరిశ్రమలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. రెండు రోజులుగా 'ఆ నలుగురు' అంటూ వార్తలు వచ్చాయని.. వారి కబంధ హస్తల్లో ఇండస్ట్రీ ఉన్నట్లు చిత్రీకరించారని.. కానీ ఆ నలుగురికి తనకు ఎలాంటి సంబంధం లేదని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో అల్లు అరవింద్ అన్నారు. ఈ 'ఆ నలుగురు' అనే మాట 15 ఏళ్ల క్రితం ప్రారంభమైందని.. నలుగురు కాస్త.. ఇప్పుడు పది మంది అయ్యారని అన్నారు. అది ఎవరూ పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. 'ఆ నలుగురి' నుంచి తాను ఎప్పుడో బయటకు వచ్చానని.. తెలంగాణలో తనకు కేవలం ఒకే థియేటర్ ఉందని, తెలుగు రాష్ట్రాల్లో మొత్తం కలిపి 15 థియేటర్లు ఉన్నాయని తెలిపారు. లీజ్ పూర్తయిన తర్వాత వాటిని రెన్యువల్ చేయవద్దని తన స్టాఫ్ చెబుతుంటానని అన్నారు. 50 ఏళ్లుగా సినిమాలు నిర్మించడమే తన వృత్తి అని అల్లు అరవింద్ తెలిపారు. ఒకటో తేదీ నుంచి థియేటర్లు మూసేస్తామని ఏకపక్షంగా ఎలా అంటారని ప్రశ్నించారు. థియేటర్లు మూసివేస్తామని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై ఎపి సినిమాటోగ్రాఫీ మంత్రి కుందుల దుర్గేశ్ స్పందన సమంజసమైనదే అని అన్నారు. తాజాగా జరిగిన ఏ సమావేశానికి తాను వెళ్లలేదని.. గీతా ఆర్ట్స్‌కి సంబంధించిన డిస్ట్రిబ్యూటర్లు, అసోసియేటెడ్ ప్రొడ్యూసర్లని కూడా వెళ్లవద్దని చెప్పినట్లు తెలిపారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు కష్టాల్లో ఉన్నాయని. యజమానులు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్ గిల్డ్ సంప్రదించాలని సూచించారు. పవన్ కళ్యాణ్ సినిమా వస్తున్న సమయంలో థియేటర్లు మూసివేస్తా అనే నిర్ణయం దుస్సాహసమే అని అరవింద్ పేర్కొన్నారు. ఇండస్ట్రీ నుంచి వెళ్లి పోరాడుతున్న వ్యక్తి పవన్‌కళ్యాణ్ అని.పవన్ ఇవాళ ఇండస్ట్రీకి సాయం చేస్తున్న వ్యక్తి. అలాంటిది ఇండస్ట్రీ నుంచి వెళ్లి ప్రభుత్వ పెద్దలను కలవాలి, డిప్యూటీ సిఎం పవన్, సిఎం చంద్రబాబు కలుద్దాం అని పేర్కొన్నారు. కానీ ఛాంబర్ వాళ్లు ఎవరూ వెళ్లలేదు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కలిసి వెళ్లాలి కదా ఎవరూ వెళ్లలేదని అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా తెలుగు సినిమా పెద్దలు కనీసం మర్యాదకైనా సీఎం చంద్రబాబును కలవలేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. గత ప్రభుత్వం నుంచి వేధింపులకు గురైన సినీ రంగాన్ని తమ కూటమి ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుందో మర్చిపోయారా అంటూ మండిపడ్డారు. సినీ పరిశ్రమ నుంచి ఇలాంటి రిటర్న్ గిఫ్ట్‌కు తాము కూడా తగిన రీతిలోనే స్పందిస్తామని పవన్ ఘాటుగా హెచ్చరించారు. తాను కూడా సినీ పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తే కావడంతో టాలీవుడ్ పై ఎప్పుడూ సానుకూలంగా ఉండే పవన్ ఒక్కసారిగా ఉగ్రరూపం ప్రదర్శించడంతో తెలుగు ఇండస్ట్రీలో కలకలం రేగింది. పవన్ ఖిహరిహర వీరమల్లుఖి సినిమా రిలీజ్ కానున్న సమయంలోనే థియేటర్ల మూసివేత నిర్ణయం తీసుకోవడంతో చిత్ర పరిశ్రమలో ఏదో జరుగుతోందన్న వాదనలకు బలం చేకూర్చుతోంది.

ఈ నేపథ్యంలోనే అల్లు అరవింద్ మీడియాతో మాట్లాడి తన స్పందనను తెలియజేశారు. ప్రభుత్వానికి సంబంధం లేదని కొందరు అంటున్నారని... అలాంటప్పుడు గత ప్రభుత్వ పెద్దలను ఎందుకు కలిశారని అల్లు అరవింద్ నిలదీశారు. "మనకు కష్టం వచ్చిందనే కదా అప్పటి ముఖ్యమంత్రిని కలిశారు... మరి ఇవాళ సినీ పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. ఇలాంటప్పుడు అందరూ కూర్చుని ఏం చేయాలనేది చర్చించాలి కదా! నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ మధ్య సమస్యలుంటే చర్చించుకోవాలి" అని హితవు పలికారు.

## సిపిఎస్‌ని రద్దుచేసి ఓపిఎస్‌ని అమలుచేయాలి

### ఎఐఎఫ్‌టిఓ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ని రద్దు చేసి.. ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపిఎస్)ని పునరుద్దరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం దేవగఢ్‌లో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(ఏఐఎఫ్‌టివో) జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ని రద్దు చేసి ఓపిఎస్‌ని పునరుద్ధరించాలని కోరారు. సిపిఎస్ రద్దుకోసం ఏఐఎఫ్‌టివోని ఇంకా బలోపేతం చేసుకోవాలని సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాలను ఒక్కతాటిపైకి తీసుకురావాలని కోరారు. ఏఐఎఫ్‌టివో బలోపేతం గురించి పిఆర్‌టియు టిఎస్ సంఘం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డితోపాటు ఏఐఎఫ్‌టివో బాధ్యులు గీత, త్రివేణి, విజయలక్ష్మీతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకి చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## జస్వంతరావుకు భార్యా వియోగం

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** సమైక్యాంధ్ర క్షీర విప్లవ పితామహుడు,ఆంధ్రా కురియన్ డాక్టర్ వీ.జస్వంతరావుకు భార్యా వియోగం కలిగింది. ఆయన సతీమణి స్వర్ణకుమారి(86) మరణించారు.ఈమెకు భర్త,ముగ్గురు కుమారులున్నారు.ఆమె త్రిదండి చినజీయర్ స్వామి అనుంగు శిష్యురాలిగా వ్యవహరించారు. స్వర్ణకుమారి కూడా క్షీర విప్లవంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

## అణ్వాయుధాలను భారీగా పెంచుకుంటున్న పాకిస్థాన్

### అమెరికా రక్షణ నిఘా సంస్థ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** భారత్‌ను అస్తిత్వ ముప్పుగా భావిస్తున్న దాయాది దేశం పాకిస్తాన్ ఈ క్రమంలోనే భారీగా అణ్వాయుధాలను పోగేసుకుంటుందని అమెరికా రక్షణ నిఘా సంస్థ వెల్లడించింది. వరల్డ్ వైడ్ థ్రెట్ అసెస్‌మెంట్ పేరుతో అమెరికా రక్షణ నిఘా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. భారత సైనిక శక్తితో పాక్ సైనిక శక్తి ఎంతమాత్రం సరిపోకున్నా, కేవలం అస్తిత్వ ముప్పుగా భావిస్తుండడంతో పాకిస్తాన్ ఈ చర్యల కు పాల్పడుతోందని ఆ నివేదిక తెలిపింది. స్వదేశంలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా, అష్టకష్టాలు పడుతున్నా అణు ఆయుధాగారాన్ని మాత్రం ఆధునీకరిస్తోందని అమెరికా రక్షణ నిఘా సంస్థ పేర్కొంది. ఈ క్రమంలోనే పాక్ అణు పదార్థాల భద్రత, న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ నిర్వహణతో పాటు భారీ విధ్వం సాలను సృష్టించే పదార్థాలను విదేశీ సరఫరాదారులతో పాటు మధ్యవర్తుల నుంచి దండిగా సొమ్ము చెల్లిస్తూ సేకరిస్తోందని ఆ సంస్థ తెలిపింది. కాగా ఈ ఆయు ధాల అభివృద్ధికి అవసరమైన వస్తువులు, సాంకేతికతను చైనా నుంచి పాకిస్తాన్ పొందుతోందని అమెరికా రక్షణ సంస్థ ఆ నివేదికలో పేర్కొంది. వీటిలో కొన్ని నేరుగా కాకుండా, హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ద్వారా మళ్లిస్తోందని ఆ నివేదికలో వుంది. అయితు పాక్‌కు సైనిక పరి కరాల ప్రధాన సరఫరాదారుగా వున్న చైనా, పాకిస్తాన్‌లో తమ దేశీయులపై జరుగుతున్న ఉగ్రదాడులపై మరోవైపు ఆగ్రహంగానే వుందని అమెరికా రక్షణ సంస్థ నివేదిక పేర్కొంది. ఈ అంశం పాక్, చైనా సంబం ధాలను దెబ్బతీస్తోందని ఆ సంస్థ వెల్లడించింది.

కాశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ నెలలో జరిగిన ఉగ్రదాడి గురించి కూడా అమెరికా రక్షణ సంస్థ ప్రస్తావించింది. ఈ దాడి తరువాత పాక్‌లో ని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేయడం, దీనికి ప్రతిగా పాక్ డ్రోన్లతో దాడులకు దిగడం, భారత్ ఎదురుదాడి చేసిన అంశాన్ని కూడా ఆ నివేదికలో ప్రస్తావించారు. నాలుగు రోజుల తరువాత కాల్పుల విరమణ జరిగినా సరి హద్దు వివాదం మాత్రం అపరిష్కృతంగానే వుందని ఆ సంస్థ పేర్కొంది.

### రాహుల్ ఎప్పుడూ దేశం తరపున మాట్లాడ లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎప్పుడు భారతదేశం తరుపున మాట్లాడలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రాహుల్ గాంధీ ప్రకటనలను గమనిస్తే, అవి భారతదేశ సాయుధ దళాలను బలహీనపరచడానికి, మన స్వదేశీకరణ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించడానికి ఒక సంఘటిత ప్రయత్నంగా ఉన్నట్లు ఉందన్నారు. ఇతర దేశాల డ్రోన్‌లను ప్రశంసించడం మొదలు రాఫెల్ కొనుగోలును ఒక కుంభకోణం అని మాట్లాడటం వరకు, అగ్నివీర్‌ను విమర్శించారన్నారు.

# డీలర్లకు తప్పని ఇబ్బందులు

## దొడ్డుబియ్యం ఓవైపు.. మరోవైపు మూడునెలల స్టాక్

### 200 క్వింటాళ్లకు మించి నిల్వచేయలేం

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం వర్షాకాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆటంకాలు తలెత్తకుండా మూడు నెలల నిత్యవసరాలు రేషన్‌దుకాణలలో నిల్వచేయాలనే ప్రతిపాదన రేషన్ డీలర్లకు ఇబ్బందిగా మారింది. తెలంగాణ ప్రభుత్వం జూన్30లోగా మూడు నెలల బియ్యం నిల్వలు రేషన్‌దుకాణాల్లో నిల్వచేయాలని ఆదేశించింది.స్థలాభావం సమస్య తెరపైకి రావడంతోపాటు ప్రస్తుతం భారీ మొత్తంలో బియ్యం రవాణా చేసేందుకు వారి వద్దనున్న వాహనాలు కూడా సరిపోవని తెలుస్తోంది. తెలంగాణలోని 17256 రేషన్‌దుకాణాలు ఉండగా అందులో అత్యధికభాగం ఇప్పటి దొడ్డుబియ్యం నిల్వలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల నుంచి సన్నబియ్యం వినియోగదారులకు పంపిణీ చేస్తోంది. అప్పటివరకు చౌకధరల దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ఇంతవరకు తీసుకెళ్లలేదు. వచ్చేనెలలో మూడునెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలంటే డీలర్లకు ఇబ్బందులు తప్పవు. రేషన్ దుకాణాలలో గరిష్ఠంగా 300క్వింటాళ్లనుంచి 200క్వింటాళ్ళు నిల్వచేసుకొనే వసతి మాత్రమే ఉండటంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మూడునెలల బియ్యం నిల్వ చేసుకోడానికి సరిపడా గదులు అందుబాటులో ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారులు విడతల వారీగా తీసుకెళ్లేందుకు వెసులుబాటు కల్పించాలని వారు కోరుతున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో వరదలు, వాగులు,వంకలు పొంగడం వంటి సమస్యలు ఎదురైతే పేదలకు ఆహారధాన్యాలు చేరవేయడం ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ నెలలోనే మూడు నెలల బియ్యాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బియ్యాన్ని గిడ్డంగుల్లో నిల్వచేసి ప్రజలకు అందించే దిశగానే పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.. మే నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ తుదిదశకు చేరుకోవడంతో మూడునెలల బియ్యం పంపిణీపై దృష్టిసారించారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు బియ్యాన్ని వచ్చే నెలలో పంపిణీ చేసేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. వచ్చే బియ్యాన్ని మండలాల్లో ఉన్న గిడ్డంగులలో నిల్వచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు శనివారం నుంచే కొన్ని జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం తరలింపు కార్యక్రమం మొదలైంది.ఒకేసారి మూడు నెలలకు నెలలకు సరిపడా బియ్యం పంపిణీ చేయడం ద్వారా రవాణా చార్జీల ఖర్చుడీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశం ఉంది.

# మెడికల్ షాపులపై డిసిఎ దాడులు

## 142 దుకాణాలకు నోటీసులు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలోని మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కొరడా ఝుళిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డిసిఎ) తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ 1954 చట్టాల ప్రకారం.. మందుల నాణ్యత, సరైన ధరలు, ప్రిస్క్రిప్షన్ లేకపోయినా విక్రయాలు, నకిలీ మందులు, అక్రమ నిల్వలను నియంత్రిస్తూ ఈ దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్క మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోనే ప్రిస్క్రిప్షన్ లేకపోయినా విక్రయాలు జరుపుతున్న 142 షాపులకు నోటీసులు జారీ చేశారు. అల్వాల్లో లైసెన్స్ లేని ఓ మెడికల్ షాపు నుండి 30,000 విలువైన యాంటీఫంగల్, పెయిన్ కిల్లర్స్, అంగస్తంభన మందులను అధికారులు. స్వాధీనం చేసుకున్నారు నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో దాడులు చేసి అక్రమ మందులను స్వాధీనం చేసుకొని, నోటీసులు జారీ చేశారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనానరు. ఈ హామీలను ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచి కూడా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. అలాగే ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిరావ్ పూలే పేరు పెట్టినప్పటికీ, అక్కడ లభిస్తున్న దరఖాస్తులు ఎక్కడకు వెళ్లుతున్నాయో, వాటి ఫలితాలపై ఎలాంటి స్పష్టత లేదని విమర్శించారు. జూన్ 2 లోగా ప్రభుత్వం ఉద్యమకారులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి. లేనిపక్షంలో ఉద్యమకారుల ఆగ్రహానికి ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కొండస్వామి, ఐలయ్య, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు ఆత్మగౌరవ భవననిర్మాణ స్థలాన్ని పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,మే25,ప్రభాతవార్త:** హైదరాబాద్ కోకపేటలోని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణ స్థలంను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణం కోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారినీ కలసి భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరడం జరుగుతుందని ఆదిశ్రీనివాస్ తెలిపారు.భవన నిర్మాణం పూర్తయితే మున్నూరు కాపు కులంలోనీ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని ఆయనతెలిపారు. పేదవారు ఇక్కడ ఫంక్షన్స్, కుల అభ్యున్నతి కోసం సభలు సమావేశాలు నిర్వహించడం కోసం వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. హైదారాబాద్ మాజీ మేయర్ బొంత్ రామ్మోహన్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్,నర్సింగి మాజీ కౌన్సిలర్ గోపాల గణేష్ కుమార్,మాజీ రాష్ట్ర గృహ నిర్మాణ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ విప్ వెంట ఉన్నారు.

# కోల్‌కత్తానైట్‌రైడర్స్‌ను ఊదిపారేసిన సన్‌రైజర్స్

## 110 పరుగుల తేడాతో కెకెఆర్ ఓటమి



**న్యూఢిల్లీ, మే 25:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 68వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోల్‌కత్తా నైట్‌రైడర్స్ ను ఊదిపారేసింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆరెంజ్ ఆర్మీ మూడు వికెట్ల నష్టానికి 278 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్ చేసిన కోల్‌కత్తానైట్‌రైడర్స్ జట్టు బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలం కావడంతో భారీ తేడాతోనే ఓటమి పాలయింది. నిర్ణీత 20 ఓవర్లలో 168 పరుగులే చేయగలిగింది. దీనితో సన్‌రైజర్స్ హైదరాబాద్ 110 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే ఐపిఎల్‌సీజన్‌ను సన్‌రైజర్స్ భారీ విజయంతో మాత్రమే ముగించింది. ప్లేఆఫ్స్ రేసునుంచి తప్పుకున్నతర్వాతజోరందుకున్న హైదరాబాద్ కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయవంతో ఈసీజన్‌కు టాటాచెప్పింది. ఢిల్లీ వేదికగాజరిగిన మ్యాచ్‌లో కెకెఆర్‌జట్టును ఊదిపారేసింది. హెన్రిచ్‌క్లాసెన్ 39 బంతుల్లో 7 ఫోర్లు, తొమ్మిది సిక్స్‌లతో 105 పరుగులుచేసి మెరుపుశతకం బాదాడు. తొలుత సన్‌రైజర్స్ మూడు వికెట్ల నష్టానికి 278 పరుగులు భారీస్కోరుచేసింది. లక్ష్యఛేదనలో 18.4 ఓవర్లలోనే కెకెఆర్ ఆలౌట్ అయింది. మనీశ్‌పాండే 37, టాప్ స్కోరర్, హర్షిత్‌రాణా 34పరుగులుచేసాడు. ఓపెనర్ సునీల్ నరైన్ 16 బంతుల్లో 3 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 31 పరుగులుచేసి దూకుడుగా ఆడినా భారీఇన్నింగ్స్‌గా మార్చలేకపోయాడు. అజింక్య రహానె15, అంగ్‌క్రిష్ రఘువంశీ 14, రమణ్‌దీప్‌సింగ్ 13 క్వింటన్ డీకాక్ 9, రింకుసింగ్ 9 పరుగులుచేసారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలిబంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. సన్‌రైజర్స్‌జట్టులో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ 40 బంతుల్లోనే ఆరుఫోర్లు, ఆరుసిక్స్‌లతో 76 పరుగులుచేసాడు. అభిషేక్‌శర్మ 32పరుగులతో క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్‌కిషన్ 20 బంతుల్లో 4 ఫోర్లు ఒకసిక్స్ 29పరుగులుచేసాడు. కోల్‌కత్తా బౌలర్లలో సునీల్‌నరైన్2, వైభవ్ అరోరా ఒక వికెట్‌తీసారు.

# తెలంగాణలో కాంగ్రెస్‌పై మొదలైన వ్యతిరేకత

## పంపకాల్లో తేడాల వల్లే ఎపిలో షర్మిల, తెలంగాణలో కవిత అసంతృప్తి

## అన్నలపైకి చెల్లెళ్లను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ వ్యవహారశైలి కీలకం: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్



**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్‌కు వ్యతిరేకత మొద లైందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలలో ఉన్న వ్యతిరేకతను మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. టిఆర్ఎస్ పుట్టి మునిగి పోయిందని, దేశంలో బిజెపి వెలిగిపోతుంద న్నారు. తెలంగాణలో బిజెపి బలపడింది.. భవిష్యత్‌లో అధికారంలోకి సైతం రానున్నదని అన్నారు. కవిత లేఖ రాసింది వాస్తవమే అన్నారు. కవిత కెసిఆర్‌ను కలిసే పరిస్థితి లేదా? అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ ప్రతిపాదిస్తున్న కెటిఆర్‌ను సవాలు చేస్తున్నట్టుగానే కవిత సవాలు అర్థం అవుతుందన్నారు. కెటిఆర్ నాయకత్వాన్ని అంగీక రించను అని చెప్పకనే చెపతుందన్నారు. అన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమే లేఖాస్త్రం అన్నారు. కవిత సామాజిక తెలంగాణ గురించి మాట్లాడటం, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయని, రెండు రాష్ట్రాల్లో ఒకేలా సీన్లు రిపీట్ అవుతున్నాయన్నారు. తండ్రులు సంపాదించిన ఆస్తుల పంపకాల్లో, రాజకీయ పదవుల్లో పంపకాల్లో తేడాలే అన్నారు. అన్నలు వదిలిన బాణాలు, అన్నల మీదికే చెల్లెలు గురివేస్తున్నాయన్నారు. ఏపిలో జగన్‌పై చెల్లి, షర్మిల బాణం ఎక్కుపెడితే, తెలంగాణలో కెటిఆర్‌పై కవిత గురి పెట్టిందన్నారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడాని, ప్రజల అవసరాల కంటే, కుటుంబ అవసరాలే కీలకం అన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మొన్న వైఎస్సార్ కుటుంబం ఇప్పుడు కెసిఆర్ కుటుంబం అన్నారు. అన్నలపైకి చెల్లెలను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. దేశం ఆర్థికంగా అత్యంత బలోపేతంగా నిలుస్తుందన్నారు. భారత దేశం 4వ ఆర్థిక అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందిందన్నారు. జపాన్‌ను భారత్ అధిగమించిం దన్నారు. దీనికి మోడీ నాయకత్వానికి తార్కాణం అన్నారు. వికసిత భారత్ కూడా కచ్చితంగా సిద్ధిస్తుందన్నారు. ఆసియా ఫసిఫిక్ ప్రాంతీయ వర్క్ షాప్ ముగిం చుకుని వచ్చానని, పిఏసి ఛైర్మెన్ వేణుగోపాల్, మెంబర్ తాను పాల్గొన్నాం అన్నారు. పార్లమెంట్ వ్యవస్థలో పిఏసి చాలా కీలకమైందన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షం అనే వత్యాసం లేకుండా పని చేస్తున్నాం అన్నారు. కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదన్నారు. ఆమె అస్తిత్వం కోసమే పార్టీ అనే అంశం అన్నారు. 14 రాష్ట్రాల్లో అధ్యక్షుల ప్రకటన జరిగిందని, ఆలిండియా ప్రెసిడెంట్‌తో పాటూ ఇతర రాష్ట్రాల అధ్యక్షుల ఎంపిక జరగనుందన్నారు. పహల్గాం ఘటన తర్వాత తలెత్తిన పరిస్టులతో. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అయిందన్నారు.

# అన్నిరకాల అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టిఎస్‌టిసిఇఎ లేఖ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వృత్తి విద్య కోరుసలైన ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కారించాలని తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టిఎస్‌టిసిఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టిఎస్‌టిసిఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నామని అయినేని సంతోష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని సాంకేతిక కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సాంకేతిక కాలేజీలో వేతన సంఘ జీతాలు చెల్లించడం లేదని.. కానీ వారికి వేతన సంఘం చెప్పిన మేరకు వేతనాల చెల్లిస్తున్నట్టు తప్పుడు నివేదికలు తయారు చేసి టిజిఏఎఫ్ఆర్‌సి, జేఎన్‌టియుహెచ్, ఏఐసిటిఈ, టిజిసిహెచ్‌ఈకి అందజేశారని తెలిపారు.

ఆ నివేదకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని లేఖలో కోరారు. 7వ వేతన సంఘ జీతాలు ఇస్తున్న ట్టు ఫామ్-16, 26ఏఎస్‌లు ఇచ్చారని.. అవి పూర్తిగా చట్ట విరుద్ధంగా తయారు చేయడం జరిగిందన్నారు. వాటిపై కూడా పూర్తి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కొన్ని కాలేజీల్లో 2 నుంచి 6 నెలల వరకు జీతాలు చెల్లించడం లేదన్నారు.

తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982, చాప్టర్ 14, సెక్షన్ 84 ప్రకారం ప్రతినెల ఒక తేదీన జీతాలు ఇవ్వాలని ఉన్న ప్పటికీ 90 శాతం కాలేజీల్లో అమలు చేయడం లేదన్నారు. మరికొన్ని కాలే జీల్లో అయితే జీతాలు వేసి తిరిగి తీసుకోవడం జరు గుతుందన్నారు.

రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసిఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యం

## వైద్యులకు అండగా ఉంటాం: మంత్రి శ్రీధర్‌బాబు




**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని,అందులో భాగంగానే విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ హాస్పిటల్స్,నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్ లో నిర్వహించిన 11వ వార్షిక సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం సేవా దృక్పథంతో కూడినదని, వైద్యులు సమాజ శ్రేయస్సు కోరుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సదస్సులో వైద్యులు ఇచ్చిన సూచనలు సలహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తానని అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, అనుమతులు, లైసెన్స్ తదితర పరిపాలన సంబంధిత సమస్యలపై వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. వైద్యులు సమాజంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తు న్నారో ప్రభుత్వానికి బాగా తెలుసని, వైద్యులకు అండగా నిలబడడం తమ బాధ్యత అని అన్నారు. తానాకాన్ పదకొండవ రాష్ట్ర సదస్సు ద్వారా వైద్యులు తమ సమస్యలను సమగ్రంగా చర్చించుకోవడం హర్షణీయమని, ఇలాంటి వేదికల ద్వారా ప్రభుత్వానికి చక్కటి సూచనలు అందించే అవకాశం కల్పిస్తాయన్నారు. వైద్యులు సూచించిన సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు కలెక్టర్లతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యరంగంలో కూడా ప్రజల ఆరోగ్యాలు కాపాడేలా అవసరమైన మార్పులను చేపట్టామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సమగ్ర ప్రణా ళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి నిపుణుల సేవలను అందు బాటులోకి తీసుక వస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ హరీశ్‌బాబు, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్.సంజయ్(కోరుట్ల ఎమ్మెల్యే) మాట్లాడుతూ సామాన్యులకు అతి తక్కువ ధరలో వైద్యం అందిస్తున్న చిన్న, మధ్యతరగతి ఆస్పత్రులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి సమస్యలును పరిష్కరించాలని కోరారు. వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సదస్సులో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, తానాకాన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కఠారి, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్,కార్యదర్శి చాట్ల శ్రీధర్, ఆర్గనైజింగ్ ట్రెజరర్,డాక్టర్ రాజకుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా?

## బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ప్రశ్న

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా? అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బిజెపి చీఫ్‌విప్ డా.పాల్వాయి హరీశ్‌బాబు ప్రశ్నించారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఒకవైపు చర్చ జరుగు తుంటే సందట్లో సడేమియా అన్నట్టు గుత్తేదారు సంస్థలు కాళేశ్వరం పున రుద్ధణ ఖర్చంతా ప్రభుత్వమే భరించాలని లేఖ రాయడం పలు అనుమా నాలకు తావిస్తుందన్నారు. రెండు రోజుల క్రితం మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణ సంస్థ అయిన ఎల్అండ్‌టి పిఇఎస్, అన్నారం బ్యారేజ్ నిర్మాణ సంస్థ అయిన ఆప్కాన్స్, కాళేశ్వరంలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పున రుద్ధరణ ఖర్చు అంతా ప్రభుత్వమే భరించాలని లేఖ రాశారని అన్నారు. బ్యారేజీలపై ఎన్‌డిఎస్‌ఏ సిఫార్సుల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే రూ.40 కోట్ల వరకు ఖర్చు కావచ్చని, ఆ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించాలని గుత్తేదారులు తెలియజేయడంతో ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, అవినీతిని కక్కిస్తామని, వృథా అయిన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేస్తామని ఒకవైపు ముఖ్యమంత్రి, సాగునీటి శాఖ మంత్రి చెప్తుంటే, ఇంకోవైపు గుత్తేదారు సంస్థలు ప్రభుత్వం నుంచి పునరుద్ధరణ ఖర్చులు కూడా రికవరీ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన ఆనాటి గుత్తేదారు సంస్థలు, ఆనాటి ప్రభుత్వంలో పెద్దల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ ఆత్మహత్య చేసుకొని బిజెపిని బతికించుకొంటోంది!

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఆత్మహత్య చేసుకొని బిజెపిని బ్రతికించు కొంటుందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పుజయప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం విలేఖరుల సమావేవంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇంట్లో పంచాయితీ వల్ల రాష్ట్రంలో ఉనికిలేని బిజెపి బలపడుతోందని ఆయన ఆవేదన చెందారు.కవిత తండ్రి మీద దండయాత్ర చేస్తూ... కేసీఆర్ కొంప ముంచి బీజేపీ కి బలం ఇస్తుందని ఆయన ఆపాదించారు. భవిష్యత్ నీ దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అలెర్ట్ అవ్వాలని జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మూడేళ్ల ఉందని అన్ని రాజకీయ పార్టీల్లో అంతర్గత విషయాలు ఉంటాయని, అయితే వారం నుండి కవిత రాసిన లేఖల గురించి చర్చ జరుగుతుందని అన్నారు. కెసిఆర్ కుటుంబం లో లేఖల కలకలంనడుస్తుంది అని ఆయన అన్నారు . తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ బలంగానే ఉంటదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు . రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ కి పదేళ్ల అవకాశం ఇచ్చారని గుర్తు చేసుకొన్నారు. తర్వాత కాంగ్రెస్ కి ఇచ్చారు కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బంది లేదని తెలిపారు. కవిత లేఖ తో కాంగ్రెస్ కి వచ్చే నష్టం కూడా ఏం లేదని ఆయన భాష్యం చెప్పారు. పార్టీ బలంగా ఉంది బలంగా లేని పార్టీ బిజెపి అని ఆయన అన్నారు. కెసిఆర్‌కు రాష్ట్ర విభజన అంశం తో ఓటేశారు . కాంగ్రెస్ కి పాలన చూసి ఓటేస్తారని అన్నారు. మతం పేరుతో బిజెపి రాజకీయం చేస్తుంది అని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వం బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ వైపు తెచ్చుకునే ప్రయత్నం చేయాల్సి ఉందని ఆయన అన్నారు. సమయం వచ్చినప్పుడు సీఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ కి చెప్తా కొన్ని విషయాలు ఇంచార్జి నటరాజన్ తో కూడా పంచుకుంటా అని ఆయన అన్నారుజ కెసిఆర్ కి లోతుగా ఆలోచన చేస్తాడు కానీ కెసిఆర్ పిల్లలు దారి తప్పారు అనుకోవచ్చు కెసిఆర్ గురించి కవిత కు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరం అని అభిప్రాయపడ్డారు. కవిత వల్ల ఏం కాదు..రాజకీయాలను ఆమె ఏం తిప్పేయదు అని అన్నారు. కేసీఆర్ కూతురు కాబట్టి మీడియాలో ప్రాధాన్యత ఆమె వల్ల రాజకీయాలు ఏం తారుమారు కావు అనిఆయన అన్నారు.




సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మధుసూదనాచారి, చిరంజీవులు, కృష్ణమోహన్, దాసు సురేష్ తదితరులు

# రాష్ట్రంలో బిసిల సంఘటితశక్తి దిశగా అడుగులు

## 'బిసిల కోటి సభ్యత్వ నమోదు' కార్యక్రమం

### వివిధ పార్టీల నేతలు, మేధావులు

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిల సంఘటిత శక్తిని చాటే సమయం ఆసన్నమైందని అందుకు 'బిసిల కోటి సభ్యత్వ నమోదు' ఉపయోగపడుతుందని వివిధ పార్టీలు నేతలు, మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిసిల కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు, మాజీ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ చేతుల మీదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన మధు సూదనాచారి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు ఎక్కువ మొత్తంలో ప్రజాప్రతినిధులు కావడానికి ఈ సభ్యత్వ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. బిసి ఇంటెలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు మాట్లాడుతూ నేడు బిసిలు చాలా చైతన్యవంతంగా ముందుకు వెళ్తున్నారన్నారు. వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి బిసి బిడ్డ నేను బిసి రాజ్యాధికార సమితిలో ఒక సభ్యత్వం పొందిన వ్యక్తినని సగర్వంగా చెప్పుకునే విధంగా కోటి బిసిల సభ్యత్వాలను నిర్ణీత కాలంలో పూర్తిచేసి నాయకులకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిసి సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నందగోపాల్ , శ్రీనివాస్ యాదవ్, వంశీ కృష్ణ, అరుణశ్రీ, వైద్య రాజగోపాల్, గండి వీరేందర్ గౌడ్, వంగ రవి, చిలువేరు రవీందర్, బండారు పద్మావతి, బొమ్మ నరేందర్, మంద వెంకటస్వామి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ఉన్నతి ఫౌండేషన్‌తో ఎస్సీ గురుకుల సొసైటీ ఒప్పందం

## గురుకుల విద్యార్థుల భవిష్యత్ భద్రతకు ప్రత్యేక శిక్షణ

## ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల సొసైటీ సంస్థ ఉన్నతి ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయు) చేసుకుంది. విద్యార్థుల భవిష్యత్ భద్రతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా జూన్ నుంచి రాష్ట వ్యాప్తంగా 238 కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఫైనల్ ఇయర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలని గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపుతూ, వారు జీవితంలో నిలదొక్కుకునే స్థాయికి చేరుకోవాలని ఎలా కృషి చేస్తారో.. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో చదువుతున్న, చదివిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా సమగ్ర కార్యక్రమాలను చేపడుతోందని ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

10వ తరగతి , ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన వారు, ఫైనల్ ఇయర్ డిగ్రీ చదివే విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు.. ఎలాంటి ఉద్యోగం లేక ఇబ్బందులు పడే వారికోసం అలాగే వెంటనే ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారి కోసం వారి కష్టాలను తొలగించేందుకు ప్రత్యేక శిక్షణా ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్యంతోనే ఎస్‌జిబిఎస్ ఉన్నతి ఫౌండేషన్‌తో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఎంఓయూ కుదుర్చుకున్నదని పేర్కొన్నారు.

ఈ క్రమంలో "యూ ఎన్ ఎక్స్ టి" సంస్థ ఆధ్వర్యంలో 165 గంటల నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఇందులో 90 గంటలు తరగతి గదిలో ప్రత్యక్షంగా శిక్షణ కాగా, 75 గంటలు సెల్ఫ్ లెర్నింగ్ విధానంలో ఉంటుందని కార్యదర్శి తెలిపారు. 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పూర్వ విద్యార్థులు, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమానికి అర్హులని తెలతిపారు.

శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్, విలువ ఆధారిత జీవన నైపుణ్యాలు, హెచ్ఆర్ సంబంధిత విషయాల్లో స్కిల్స్, ఉద్యోగ ఇంటర్వ్యూలకు కావలసిన ప్రతిభ పెంపు వంటి అంశాలు ఉంటాయని వివరించారు. ఈ శిక్షణ అనంతరం విద్యార్థుల వివరాలు ఎంప్లాయబిలిటీ పోర్టల్‌లో నమోదు చేయబడతాయని.. దాని ఆధారంగా మల్టీ నేషనల్ కంపెనీలు, ఎంఎస్ఎంఇలు పరిశీలించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని సెక్రటరీ తెలిపారు.

ప్రత్యేక శిక్షణ జూన్ మూడో వారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 40 మంది చొప్పున 45 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 238 గురుకుల కేంద్రాల్లో ఈ శిక్షణా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం 36 వేల మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నె లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుందన్నారు.

# 'షష్టి పూర్తి' ట్రైలర్ లాంచ్



**నటకిరీటి** డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్ లో రూపేశ్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ సినిమా మే 30న విడుదల కానుంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో బజ్‌ను క్రియేట్ చేశాయి. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఈస్ట్ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'మనం ఎవరో తెలియకుండానే ప్రేమించేది తల్లి.. తనకు తెలియని ప్రపంచాన్ని కూడా భుజాలపై ఎక్కించుకుని మరీ మనకు చూపించేది తండ్రి'.. అంటూ ట్రైలర్ ప్రారంభంలో హీరో చెప్పే డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ..'షష్టి పూర్తి' టైటిల్‌తో కథ నా వద్దకు వచ్చినప్పుడు ఆశ్చర్యపోయాను. వయసుకు తగ్గ పాత్రలు నాకు ఒక్కడికే వస్తున్నాయా? అని ఆశ్చర్యం వేసింది. నేను నిజ జీవితంలో షష్టి పూర్తిని తప్పించుకోవాలని ప్రయత్నించాను. కానీ ఇలా సినిమా రూపంలో 'షష్టి పూర్తి' జరిగింది. పెళ్లి సమయంలో నా పాటే.. చావు సమయంలో నా పాటే.. ఇక షష్టి పూర్తి టైంలో పాట లేదండి అని కొందరు అనేవాళ్లు. ఇప్పుడు ఆ 'షష్టి పూర్తి' పాట కూడా వచ్చింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్ని చాటి చెప్పేలా మా చిత్రంఉంటుంది. తల్లిదండ్రుల పెళ్లిని బిడ్డలు చూడలేరు.. అలా బిడ్డలు చూడగలిగే తల్లిదండ్రుల పెళ్లే మా ఈ 'షష్టి పూర్తి'. అర్చనతో ఇన్నేళ్ల తరువాత కలిసి నటించడం ఆనందంగా ఉంది. మా హీరో, నిర్మాత రూపేశ్ ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడ్డారు. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు. శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. .. 'షష్టి పూర్తి' లాంటి చక్కటి కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. మా అన్నయ్య రాజేంద్ర ప్రసాద్ గారు నాకు ఎప్పుడూ అండగా నిల్చున్నారు. కుటుంబ విలువల్ని కాపాడాలని 'ఆ నలుగురు' సినిమాతో సందేశాన్ని ఇచ్చారు. పిల్లలే తల్లిదండ్రులకు మళ్లీ పెళ్లి అంటూ 'షష్టి పూర్తి' చేస్తే కలిగే ఆనందం గురించి మాటల్లో చెప్పలేం. మళ్లీ కుటుంబ విలువల్ని చాటి చెప్పేందుకు ఈ చిత్రం వస్తుంది. ఇలాంటి చిత్రాలు సమాజం కోసం సక్సెస్ అవ్వాలి' అన్నారు. శాసనసభ సభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. .. 'సినిమా ఫంక్షన్లో పాల్గొనడం ఇదే మొదటి సారి. రూపేశ్ గారికి ఈ చిత్రంతో మంచి విజయం దక్కాలి. చైతన్య ప్రసాద్ పాటలు నాకు చాలా ఇష్టం. ఆ నలుగురు సినిమా అన్నా, ఆయన రాసిన పాటలన్నా నాకు చాలా ఇష్టం. 'షష్టి పూర్తి' చిత్రం పెద్ద విజయం సాధించాలి. అందరికీ ఆల్ ది బెస్ట్' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ.. ..'ఇంత మంచి కథ నా వద్దకు రావడం నా అదృష్టం. ఈ క్రెడిట్ అంతా కూడా దర్శకుడు పవన్‌దే అవు తుంది. రాజేంద్ర ప్రసాద్ గారితోనే ఇకపై అన్ని చిత్రాలు చేయాలనిపిస్తుంది. అర్చనమ్మతో షూటింగ్ చేస్తుంటే.. ఇంట్లో అమ్మతో ఉన్నట్టు అనిపించేది. మా లాంటి కొత్త వారితో పని చేసేందుకువచ్చిన ఆకాంక్ష గారికి థాంక్స్. చైతన్య ప్రసాద్ గారు ఈకథను మాకంటే ఎక్కువగా నమ్మారు. మే 30న మా చిత్రం విడుదల అవుతోంది. రెండ్రోజుల్లోనే నా డబ్బులన్నీ తిరిగి వస్తాయి'అని అన్నారు. దర్శకుడు పవన్‌ప్రభ మాట్లాడుతూ.. 'షష్టి పూర్తి' సినిమా ఇంత బాగా రావడానికి సహకరించి పని చేసిన ప్రతీ ఒక్కరికి థాంక్స్. అందరికీ మా సినిమానచ్చుతుందని భావిస్తున్నాను. రాజేంద్ర ప్రసాద్‌గారు, అర్చన గారి లాంటి గొప్పవారితో పనిచేసే అవకాశం ఇచ్చిన రూపేశ్ గారికి థాంక్స్. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. నటి అర్చన మాట్లాడుతూ.. ..మా 'షష్టి పూర్తి' సినిమా కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. రాజేంద్ర ప్రసాద్ గారు ఓ సినిమాలో ఉంటే.. అందులో అన్నీ ఉన్నట్టే. ఏ పాత్రలోకైనా, ఏ సినిమాలోకి అయినా ఆయన పరకాయ ప్రవేశం చేస్తారు. 1మళ్లీ ఇళయరాజా గారి సంగీత సారధ్యంలో పని చేయడం సంతోషంగా ఉంది. మా అందరినీ పవన్ ప్రభ ఒక చోటకు తీసుకు వచ్చారు. హీరోగా, నిర్మాతగా రూపేశ్ ఈ చిత్రానికి వంద శాతం న్యాయం చేశారు. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అన్నారు.

# 'అనగనగా' సక్సెస్ సెలబ్రేషన్స్



**సుమంత్ కుమార్** హీరోగా సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ 'అనగనగా'. కాజల్ చౌదరి కథానాయిక. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మించారు. ఇటీవలే ప్రముఖ ఓటీటీలో రిలీజ్ అయిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకొని ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ సెలబ్రేషన్‌ని నిర్వహించారు. సక్సెస్ సెలబ్రేషన్‌లో హీరో సుమంత్ కుమార్ మాట్లాడుతూ.. 'సినిమాకి ఇంత సపోర్ట్ ఇచ్చిన మీడియా మిత్రులకు థాంక్యూ. ఈ 'అనగనగా'. దర్శకుడు సన్నీ, రచయిత దీప్తి ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. ఈ సినిమాని శేష్‌కి చూపించాను. అప్పుడు తను చాలా ఎమోషనల్‌గా సినిమాలో విషయం ఉందని చెప్పాడు. ఆ విషయాన్ని ప్రేక్షకులు అందరూ కూడా బలపరిచినందుకు ధన్యవాదాలు. మేము అనుకున్న దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. బేసిగ్గా సినిమాలు థియేటర్స్‌లోకి వచ్చిన తర్వాత ఓటీటీలోకి వస్తాయి. అయితే ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూసి ఇప్పుడు సినిమాని కొన్ని థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. ఆడియన్స్ అందరు కూడా బిగ్ స్క్రీన్ మీద చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. హీరో అడివి శేషు మాట్లాడుతూ.. 'నా ఫస్ట్ సినిమాకి సుమంత్ గెస్ట్‌గా వచ్చారు. ఆయన అప్పటినుంచి నాకు ఫ్యామిలీనే. ఈ చిత్రంలో వ్యాస్ పాత్రను సుమంత్ అంత బాగా చేయడానికి కారణం ఆయన నిజ జీవితంలోనూ చాలావరకూ అలా ఉండటమే. సన్నీ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. నాకు ఈ సినిమా చూస్తున్నంత సేపూ దీన్ని థియేటర్లో కదా చూడాల్సింది అనిపించింది. ఈ చిత్రంలో రామ్ పాత్ర నాతో కూడా కంటతడి పెట్టిం చింది. విద్యా వ్యవస్థ మారాలని కోరుకునేలా చేయించింది. ఈ సినిమాని మీ ఇంటిల్లిపాది చూడండి. కుదిరితే బిగ్ స్క్రీన్ లో చూడండి. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా కంగ్రాచ్యులేషన్స్'అన్నారు. ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ.. 'అనగనగా ఒక సినిమా కాదు ఇది ఒక జీవితం. అన్ని ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి. ఒక ఎడ్యుకేషన్ సిస్టం సంబంధించిన సినిమా ఇది. చాలా ఆలోచన రేకెత్తించేలా ఉంది. సన్నీ ప్రతి క్యారెక్టర్‌ని అద్భుతంగా మలిచాడు. సుమంత్ గారు వ్యాస్ పాత్రలో ఒదిగిపోయారు. తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది'అన్నారు నిర్మాత రాహుల్ యాదవ్ నక్క మాట్లాడుతూ... ఇంత మంచి మూవీ ఇచ్చినందుకు టీమ్ అందరికీ థాంక్యూ. సుమంత్ నా ఫస్ట్ హీరో. అప్పుడు కూడా ద బిగ్గెస్ట్ కాన్ఫిడెన్స్ అడివివిశేష గారు ఇచ్చారు. అందరికీ కంగ్రాట్యులేషన్స్ అన్నారు. దర్శకుడు సన్నీ సంజయ్ మాట్లాడుతూ.. ఈ కథ మా అందరికీ అమ్మలా రోజూ జోల పాడింది. నాన్నలా ధైర్యాన్నిచ్చింది.నన్ను ఎంతగానో సపోర్ట్ చేసిన సుమంత్ గారికి థాంక్ యూ. వ్యాస్ పాత్రలో ఆయన్ని తప్పా మరొకని వూహించలేను. సినిమాని ఇంత సూపర్ హిట్ చేసిన ఆడియన్స్‌కి థాంక్ యూ అన్నారు. ప్రొడ్యూసర్ రాకేష్ రెడ్డి గడ్డం మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన శేష్ గారికి థాంక్యూ. ఈ ఇంత పెద్ద సక్సెస్ సుమంత్ గారి వల్లే సాధ్యమైంది. ఈ స్క్రిప్ట్ ని నమ్మినందుకు ఆయనకి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

# '3 బిహెచ్‌కె' నుంచి సాంగ్ రిలీజ్

**సిద్ధార్థ్ హీరోగా** శ్రీ గణేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్ టైనర్ '3బిహెచ్‌కె'. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ 'కలలన్నీ' సాంగ్‌ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. అమృత్ రామ్‌నాథ్ ఈ పాటని బ్యూటీఫుల్ ఫ్యామిలీ మెలోడీగా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి రాసిన రిలీజ్ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. హేమచంద్ర వేదాల, గోపికా పూర్ణిమ, సాహితీ చాగంటి, పివిఎన్ఎస్ రోహిత్ ప్లజెంట్ వోకల్స్‌తో ఆకట్టుకున్నారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని క్యారెక్టర్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ సాంగ్ లో ప్రత్యేకంగా నిలిచాయి. ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈసినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి అమృత్ రామ్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్ డీవోపీగా పని చేస్తున్నారు. గణేష్ శివ ఎడిటర్. రాకేందు మౌళి డైలాగ్ రైటర్.

ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ జూలై 4న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

నటీనటులు: సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్ , చైత్ర, రచన, దర్శకత్వం: శ్రీ గణేష్,నిర్మాత : అరుణ్ విశ్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. సిబి మారప్పన్, ఫోటోగ్రఫీ డైరెక్టర్: దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్, సంగీతం: అమృత్ రామ్‌నాథ్, ఎడిటర్: గణేష్ శివ, డైలాగ్స్: రాకేందు మౌళి, ఆర్ట్ డైరెక్టర్: వినోద్ రాజ్‌కుమార్ ఎన్, కాస్ట్యూమ్ డిజైనర్: అశోక్ కుమార్ ఎస్ కిరుతిక ఎస్, పీఆర్వో: వంశీ శేఖర్



# 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్‌లో ఉపేంద్ర



**ఎనర్జిటిక్ స్టార్** రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ గ్లింప్స్‌లో సినిమా పట్ల అపారమైన అభిమానం ఉన్న యువకుడిగా రామ్ పోతినేని పాత్ర ప్రేక్షకుల మనసుల్ని తాకింది. గ్లింప్స్‌లో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర భారీ కటౌట్ రూపంలో కనిపించి మరింత ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. ఈ చిత్రంలో ఉపేంద్ర పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. ఇటీవల విడుదలైన ఆయన క్యారెక్టర్ పోస్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పాత్రల ఎంపికలో ఎప్పుడూ ప్రత్యేకతకు ప్రాధాన్యం ఇచ్చే ఉపేంద్ర, ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారు. ఆయన ఈ చిత్రంలో సూపర్ స్టార్ సూర్యకుమార్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇంత అద్భుతమైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా భారీ అంచనాలని పెంచుతోంది.

# 'స్పిరిట్' లో హీరోయిన్ గా త్రిప్తి డిమ్రీ



**పాన్ ఇండియా** బ్లాక్‌బస్టర్‌లతో దూసుకుపోతున్న రెబెల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలసి చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'. యానిమల్ ఫేం త్రిప్తి డిమ్రీ ఈ చిత్రంలో ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఎంపికైనట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. యానిమల్ చిత్రంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న త్రిప్తి, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో మళ్లీ పనిచేయడం పట్ల, అలాగే ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేయడం పట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్'ను తొమ్మిది భాషల్లో విడుదల చేస్తామని అనౌన్స్ చేశారు. ఇది పాన్ వరల్డ్ విజన్‌ని తెలియ జేస్తోంది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, మురాద్ ఖేతానీ నిర్మిస్తున్న ఈ చిత్రం, భారత సినిమా చరిత్రలోనే ఒక గొప్ప ప్రాజెక్టుగా నిలవనుంది. రెబెల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేయబోతోంది.

# 'సర్దార్- 2' నుంచి హీరో కార్తి పోస్టర్ రిలీజ్



**హీరో కార్తి** 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రస్తుతం 'సర్దార్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ 'సర్దార్ 2'కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ గ్రాండ్‌గా నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ రోజు హీరో కార్తి బర్త్‌డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కార్తి మ్యాసీవ్ మిషన్ గన్ పట్టుకొని రగ్గడ్‌లుక్‌లో కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. సినిమాలో కార్తి క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా ఉండబోతోందో ఈ పోస్టర్ తెలియజేస్తోంది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్‌లోతెరకెక్కతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. 'సర్దార్ 2' చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించ నున్నారు.

# 'విటి15' హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

**మెగా ప్రిన్స్** వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఇండోకొరియన్ హారర్‌కామెడీ 'విటి15'తో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన విజువల్లీ స్టన్నింగ్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు.

హైదరాబాద్‌లో పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్, హైదరాబాద్ అనంతపూర్‌లో జరిగిన రెండు షెడ్యూల్స్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. అనంతపూర్‌లోని ప్రముఖ కియా గ్రౌండ్స్, అందమైన గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగింది. సినిమా ఫస్ట్ హాఫ్‌లోని థ్రిల్లింగ్ సన్నివేశాలు, పంచ్ హ్యూమర్‌తో కూడిన సీన్స్‌ని ఈ షెడ్యూల్స్ లో చిత్రీకరించారు. రీతికా నాయక్, సత్య, మిర్చి కిరణ్ తదితర నటీనటులు ప్రతీ సన్నివేశంలో కామెడీ మెరుపులు నింపారు. వరుణ్ తేజ్, రీతికా నాయక్‌పై పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో చిత్రీకరించిన ఒక అద్భుతమైన అనంతపూర్ షెడ్యూల్ హైలైట్ నిలుస్తుంది. ఇప్పుడు ఎక్స్ యిట్మెంట్ మరింత పెరుగుతోంది, 'విటి15' నెక్స్ట్ ఇంటర్నేషన్ షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ఆ షెడ్యూల్ కొరియాలో జరుగుతుంది. ఈ పార్ట్ ద్వారా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండో కొరియన్ హారర్ కామెడీ ప్రేక్షకుల ముందుకు రానుంది. గ్రాండ్ స్కేల్, స్టైల్, హారర్ బ్లెండ్ తో 'విటి15' జానర్ డిఫైనింగ్ సినిమాగా వుండబోతోంది.



# 'యుఫోరియా' నుంచి 'ఫై హై' సాంగ్ లాంచ్

**గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్** బ్యానర్ మీద నీలిమ గుణ నిర్మాణంలో గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. నూతన నటీనటులతో గుణశేఖర్ ఓ ట్రెండీ టాపిక్ మీద ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో భూమిక చావ్లా, సారా అర్జున్, నాసర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేము గంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.ఈ చిత్రం నుంచి 'ఫై హై' అంటూ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'ఫై హై' అంటూ సాగే ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. కాలభైరవ అందించిన బాణీ ట్రెండీగా ఉంది. ఇక ఈ పాటను కాల భైరవ, పృథ్వీ చంద్ర, గాయత్రి నటరాజన్ ఆలపించారు. ఈ పాట పిక్చరైజేషన్ చూస్తుంటే నేటి యూత్, మత్తులో మునగడం, నైట్‌అవుట్స్, ఫ్రెండ్స్‌తో చిల్‌అవ్వడం వంటి అంశాలను చూపిం చారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ.. ఆడియెన్స్ చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదేఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. ఈ 'ఫై హై' లానే ఇంకో మూడు పాటలు ఉంటాయి. కాలభైరవ అద్భుతమైన పాటలు ఇచ్చారు. మా హీరో విఘ్నేశ్, మా విలన్ పృథ్వీని అందరూ ఆశీర్వదించాలి. మా చిత్రం అందరికీ నచ్చుతుందని, ఆడియెన్స్‌ను మెప్పిస్తుందని చెబుతున్నా అని అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ .. అందరికీ మా ఫస్ట్ సింగిల్ 'ఫై హై' నచ్చిందని భావిస్తున్నాను. ఇంత మంచి పాటను ఇచ్చిన కాల భైరవ గారికి థాంక్స్ అన్నారు. కాల భైరవ మాట్లాడుతూ . 'ఫై హై' పాట అందరికీ నచ్చుతుందని నేను కాన్ఫిడెంట్‌గా చెబుతున్నాను. ఇది అన్ని సినిమాల్లా నార్మల్‌గా ఉండదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అందుకే నేను కూడా చాలా డిఫరెంట్ మ్యూజిక్ ఇచ్చేందుకు ట్రై చేశాను. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. విఘ్నేష్ గవిరెడ్డి మాట్లాడుతూ .. 'ఫై హై' సాంగ్ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాం. ముందు ముందు ఇంకా మరిన్ని అప్డేట్లతో వస్తాం.అని అన్నారు.





# సెలవుల్లో సరదాగా..



రెండు జట్లు.. ఏడు రాళ్లు లేదా పెంకులు.. ఒక టెన్నిస్ బంతి. ఆ రాళ్లను ఒకదానిపై ఒకటి టవర్‌లా పేర్చి ఒక జట్టు దాన్ని పడగొట్టి మళ్లీ కడుతూ ఉంటే ప్రత్యర్థి జట్టు ఈ రాళ్లను చెదరగొడుతూ ఉండాలి. ఆడటానికి ఓపిక ఉండాలే గానీ వయసుతో సంబంధంలేదు. ఆడేవాళ్లంతా చురుకుగా అలర్ట్‌గా ఉంటూ ఆ రాళ్లను పేరుస్తూ ఉంటే వేరే వాళ్లు చెదరగొడుతూ ఉంటారు. దీన్నే లగోరీ అనీ, ఏడు రాళ్లాట అనీ పిలుస్తారు. సరదాగా ఆరుబయట ఆడే ఈ లగోరీకి దేశవిదేశాల్లో కూడా మంచి క్రేజ్ ఉందని తెలుసా! అంతేనా. దీనికి జాతీయ స్థాయిలో ఛాంపియన్స్ ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్లు జరుగుతాయి. దీనికి ప్రపంచకప్ కూడా ఉంది. చాలా చోట్ల ఈ ఏడురాళ్లాటని విద్యాసంస్థల్లో కూడా భాగం చేశారట. ఇంత చరిత్ర ఉన్న ఈ లగోరీ ద్వాపరి యుగం నుంచే ఉందట. శ్రీకృష్ణుడు తన స్నేహితులతో ఎక్కువగా ఈ ఏడు పెంకులాటే ఆడేవాడట. దాన్ని రిఫరెన్స్‌గా తీసుకునే ఈ లగోరీని రూపొందించారట.



గోవాలో జాతీయక్రీడలకి ఒక ఆటని ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడు అక్కడి క్రీడల మంత్రి ఈ లగోరీని ఎంపిక చేశాడట. ఆ తర్వాత దీన్ని గురించి ప్రధాన మంత్రి మోదీ కూడా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఇంతటి చరిత్ర గల ఈ ఏడు రాళ్లాట మన భారత సంతతికి చెందినది. తలుచుకుంటేనే ఎంతో గర్వంగా అనిపిస్తుంది కదూ.. ఇంకెందుకు ఆలస్యం.. ఈ లగోరీని పిల్లలకి నేర్పించండి. ఈ వేసవి సాయంత్రాల్లో మీరూ వాళ్లతో కలిసి ఆడేసేయండి.

# సంప్రదాయ ఆహారం.. కోట్ల వ్యాపారం



**వేసవి వచ్చిందంటే చింత చిగురు, మామిడి పండ్లు, తాటిముంజలు... నోరూరించే రుచులెన్నో! దేశం దాటినవారు ఈ రుచుల్ని మిస్ అవ్వాల్సిందే. ఇవేకాదు, ఇంకెన్నో సంప్రదాయ రుచులకూ దూరమవుతుంటారు. వాటిని వాళ్లకి అందించాలనుకున్నారు ప్రగతి. 20 దేశాల వారికి అందిస్తూ... రూ. వంద కోట్ల వ్యాపారంగానూ తీర్చిదిద్దారు.**

కామర్స్‌లో పీజీ చేస్తుండగానే పెళ్లైంది. తరవాత చదువు కొనసాగిద్దామన్నా కుదరలేదు. ఈ బాధ్యతలు, పిల్లల చదువులతో సమయం గడిచిపోయింది. అయితే ఇంట్లోవాళ్లకి రుచిగా వండిపెట్టాలి అనుకునేదాన్ని అదే నన్ను వ్యాపారవేత్తను చేసింది.

మాది ఏలూరు దగ్గర వట "అనే గ్రామం. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొండాపూర్‌లో నివసిస్తున్నాం. మావారు ముప్వా రమేష్‌కి పాత తరం పచ్చళ్లు, పొడులంటే ఇష్టం. ఆయన ప్రోత్సాహంతో నాలుగేళ్ల క్రితం 15 మందితో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని హరిత పారిశ్రామిక పార్కులో మా చిన్న అమ్మాయి పేరుమీదుగా 'శ్వేత తెలుగు ఫుడ్స్' ప్రారంభించాం. పచ్చళ్ళు, చిరుతిళ్లు, పొడులు వంటివి తయారు చేస్తున్నాం సొంత భవనం, యంత్ర సామగ్రినీ సమకూర్చుకున్నాం. దీంతో రైతులకు లాభం చేకూరుస్తున్నామన్న సంతృప్తి. నేను ప్రొడక్షన్ పనులు చూసుకుంటుంటే మావారు పరిశ్రమ నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. పెద్దమ్మాయి నిఖిత ఫ్రాన్స్‌లో ఎంబిఎ చేసింది. మార్కెటింగ్ వ్యవహారాలు తనే చూసుకుంటోంది. స్థానికంగానే కాదు, ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ మా ఉత్పత్తులు వెళ్తున్నాయి. రోజుకు సుమ్మా 10 టన్నుల ఉత్పత్తులను మార్కెట్‌కి పంపుతాం. తమిళనాడు, కర్ణాటక సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 240 మంది పంపిణీదారులు ఉన్నారు. విదేశాల్లోనూ మాకు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. దుబాయ్, ఢిల్లీ, హైదరాబాద్, యూరప్... ఇలా దేశవిదేశాల్లో స్టాళ్లనూ ఏర్పాటు చేస్తారు. ఆ ఏటా రూ.100కోట్లకుపైగా వ్యాపారం చేస్తున్నాం. సీజన్‌ను బట్టి ఉత్పత్తులనూ మారుస్తుంటాం.. ఉదాహరణకు వేసవి కాలంలో తాటి ముంజలు, చింత చిగురు, మామిడి కాయలు వస్తుంటాయి ఈ కాలంలో తప్ప మళ్లీ దొరకడం కష్టం. అందుకే వాటిని సేకరించి శుద్ధి చేసి, ఫ్రోజెన్ ఉత్పత్తులుగా మార్చి, విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఏ దేశంలో ఉన్నా... మన రుచులు తెలుగు వారందరికీ అందేలా చూడాలన్నదే నా ప్రయత్నం. 300 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నా. మహిళల్లో ప్రతిభా సామర్థ్యాలకు కొదవేం లేదు. అందుబాటులో ఉన్న సమయం, అవకాశాలను బట్టి ప్రయత్నించలేగానీ స్టార్టప్లు పెట్టొచ్చు, వ్యాపారవేత్తలుగానూ రాణించవచ్చు మీ లక్ష్యమేంటో ముందు తెలుసుకోండి. మీరు ఎదగడమే కాదు, ఎంతోమందికి స్ఫూర్తిగానూ నిలుస్తారు.



# వంటింట్లో చల్లచల్లగా..



ఉదయం, రాత్రి వంటింట్లో పని చేస్తుంటాం. వేసవి ప్రతాపానికి పొయ్యి వేడి తోడై ఉక్కబోతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుంటాం. చెమటతో ఉక్కిరిబిక్కిరి అవుతాం. పోనీ ఫ్యాన్ వేద్దామంటే పొయ్యి ఆరుతుంది. లేదా మంట సరిగ్గా తగలక వంట త్వరగా అవదు ఇలాకాకుండా.. చెమట పట్టకుండా ఆహ్లాదంగా ఫీల్ అవుతూ వంట చేయాలంటే వంటింట్లో ఇవి ఉండాల్సిందే.





**కూలింగ్ ఫ్యాన్...**

ఈ డ్యూయెట్‌ఐ కిచెన్ కూలింగ్ ఫ్యాన్ను టచ్‌స్క్రీన్‌తో ఆపరేట్ చేయొచ్చు. ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లొచ్చు. దృఢమైన బేస్తో చిన్న గదుల్నీ క్షణాల్లో చల్లగా మార్చగలదు. తక్కువ శబ్దంతో వంట చేసేటప్పుడు అంతరంగానూ అనిపించదు. ఇందులో నీటి పరిమాణాన్ని చూపించే సూచికతో సులభంగా పరిశీలించొచ్చు. కావాల్సినప్పుడు నీటిని నింపితే సరిపోతుంది. వంట వేగంగా పూర్తిచేయొచ్చు. అలసటా ఉండదు. ఇంకెందుకాలస్యం. వేసవిలోనూ వంటింట్లో పనులు పూర్తిచేయడానికి దేనిని ఉత్సాహపరుస్తున్నారు మరి!

**పోర్టబుల్ కూలర్స్ ...**

కరెంటుతో పనిచేసే వీటిని పొయ్యి గట్టుపై పక్కగా ఉంచితే చాలు. మన చుట్టూ వాతావరణం చల్లగా మారిపోతుంది. పరిమానంలోనూ చిన్నగా ఉండటంతో ఎక్కువ చోటు కూడా వీటికి అవసరం ఉండదు. ఓవైపు చల్లదనాన్ని ఆస్వాదిస్తూ మరోవైపు ఉత్సాహంగా వంటపని ముగించేయొచ్చు. కరెంటులో పనిచేసే వీటిని పొయ్యి గట్టుపై పక్కగా ఉంచితే చాలు. మన చుట్టూ వాతావరణం చల్లగా మారిపోతుంది. పరిమాణంలోనూ చిన్నగా ఉండటంతో ఎక్కువ చోటు కూడా వీటికి అవసరం ఉండదు. ఓవైపు చల్లదనాన్ని ఆస్వాదిస్తూ మరో వైపు ఉత్సాహంగా వంటపని ముగించేయొచ్చు.

# నీటిలో వ్యాయామం

**ఆక్వా ఏరోబిక్స్..**

వర్కవుట్స్ లో ఇప్పుడో ట్రెండ్. వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలనుకునే వారూ, తక్కువ సమయంలో బరువు తగ్గాలనుకునే మహిళలూ.. నాణ్యమైన సమయాన్ని గడపగలుగుతారు. సరదాగా ప్రయత్నించే ఈ వర్కవుట్ సంతోషాన్నే కాదు.. తెలియకుండానే శరీరానికి తగిన శ్రమనూ అందిస్తుంది. వ్యాయామంపై ఆసక్తినీ పెంచుతుంది. ఫలితంగా హ్యాపీ హార్మోన్లు విడుదలై ఒత్తిడినీ తగ్గిస్తాయి.

★ నీళ్లల్లో వ్యాయామం చేయడం వల్ల గ్రావిటీ, ఫ్రిక్షన్ తక్కువగా ఉంటాయి. దీంతో కీళ్ల దగ్గర ఒత్తిడి పడదు. కండరాలు దృఢంగా మారతాయి. నీటిని ముందుకీ, వెనక్కీ నెట్టడం వల్ల భుజబలం పెరుగుతుంది.

★. ఈ ఆక్వా ఏరోబిక్స్ మంచి కార్డియో వ్యాయామం. తక్కువగా అలసిపోవడం వల్ల ఎక్కువ సమయం ఇందుకోసం కేటాయించు కోవచ్చు. దీంతో శరీరం మొత్తానికీ రక్తప్రసరణ సరిగా. జరుగుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్య పెరుగుతుంది. అధికరక్తపోటు అదుపులో ఉంటుంది.

★ వాటర్ ఏరోబిక్స్ వల్ల కెలోరీలువేగంగా ఖర్చవుతాయి. అంతేకాదు, ఈ కసరత్తులు గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మంచి నిద్రపడుతుంది.



ఈ కసరత్తుల్ని ఎంచుకుని చూడండి. ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి.

★నడుము లోతు నీళ్లల్లో నిటబడి మంద్రంగా వినిపించే సంగీతాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా వ్యాయామం చేయడమే దీని స్టైల్. ఇందుకోసం ఫిట్‌నెస్ సంస్థలు ప్రత్యేక తరగతులనూ ఏర్పాటు చేస్తున్నాయి. వీటికి కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లగలిగితే.. అక్కడ

# ఇవన్నీ బిస్కెట్లే !









జంతికలూ, బూందీ అందరికీ నచ్చకపోవచ్చు. కొబ్బరి బూరెలూ, అరిసెలూ తినకూడని వాళ్లుండొచ్చు. కానీ బిస్కెట్లు అలా కాదు. ఎవరికైనా నచ్చేస్తాయి. ఏ పిండివంటలు ఉన్నా లేకున్నా మనందరి ఇళ్లల్లో బిస్కెట్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉంటాయి. భోజనం ఆలస్యమయ్యేట్లుంటే అవే మనకు తక్షణ ఆహారం. చాయ్‌లో ముంచుకుని తింటాం. ఉత్తినే కాలక్షేపానికీ ఆరగిస్తాం. ఒక్కోసారి ఇవే మన స్నాక్స్. వాటిల్లో అసంఖ్యాక రుచులూ ఆకృతు ఉన్నాయి. బిస్కెట్లు ఇష్టంగా తింటూనే వాటితో కుర్చీలూ బల్లలూ చేసి ఆనందిస్తున్నారు. చిచ్చరపిడుగులు. ఎంత కళాహృదయం కదూ! మీ చిన్నారులను ఒకసారి ప్రయత్నించి చూడమనండి!













## చెలి చిట్కా

భోజనం చేసిన తర్వాత ఒక పచ్చి క్యారెట్ తినడంవలన నోటి నుంచి దుర్వాసనరాదు. దంతక్షయం చిగుళ్లవాపు వంటిరోగాల నుంచి రక్షిస్తుంది.

# శంభో హార హార

త్రిమూర్తులలో శివునికి ఉన్న ప్రత్యేకత వేరు. చాలా వరకు శివ భక్తులే మనకు ఆగుపడుతుంటారు. శివాలయములు కూడా భారత దేశంలో మిక్కుటం. శివాలయం ఉన్న ప్రతి చోట జలం పుష్కలంగా ఉంటుంది. అందుకే శివునికి జలాభి శేఖరుడు అని మరో పేరు. కోరిన కోరికలు తీర్చేది శివుడే. ఆయన మానవుడా, దానవుడా అని చూడడు. తనను సంతృప్తి ఎవరూ పరుస్తారో వాళ్ళకు లొంగి పోయే భోళా శంకరుడు. మన పురాణాలలో శివునికి భక్తులు అధికం. రావణాసురుడు తన లంకలో శివునికి అందమైన పాలరాయితో కట్టిన కట్టడమే అందుకు ఉదాహరణ. తనను కొలిచేది ఎటువంటి వారైనా వారి హృదయాన్ని శివుడు చూస్తాడు. వారి మనసులలో చెడు భావాలు ఉంటే కరుణించడు. శివునికి చాలా ప్రత్యేకమైన మాసం కార్తీకం. మాసాలలో కార్తిక మాసానికి ఉన్న ప్రత్యేకత వేరు. ఈ మాసంలో చాలావరకు అందరూ శివ పూజలలో లీనమై ఉంటారు. ఏ మాసంలో లేకపోయినా ఈ మాసంలో చాలా నిష్టగా ఉంటారు. మాంసాహారం ముట్టరు. పూజలకు ప్రత్యేక ప్రాముఖ్యం ఇస్తారు. దాన ధర్మాలు చేస్తారు. ఒకరి ఇంటి లో పూజకు మరొకరు వెళతారు. ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తారు. కుటుంబాలు సంతోషంగా ఉసిరి చెట్టు కింద భోజనాలు ఆరగిస్తారు. ప్రతి శివాలయంలో అందరూ ముక్త కంఠంతో "శంభో హార హార శంకర "అనే నినాదలు చేస్తారు. గుడి గంటలు మొగిస్తారు. ఆ గణ గణ సవ్వడికి పరమ శివుడు మేలుకొంటాడు. భక్తులు కోరే కోరికలు వింటాడు. ప్రతి భక్తుని సంతృప్తి పరచడమే శివయ్య కు ఇష్టం. ఆ శివ దర్శనంతో చెంపలేసు కుంటూ, మొక్కులు మొక్కుతూ, శివ నామస్మరణతో శివాలయం వీడతాం. ఈ కార్తికం హిందువులకు ఎంతో ప్రీతికరం. వృద్ధులు, చేత కాని వారు ఈ కార్తి కంలో శివుణ్ణి కొలవాలని తలంపు ఉన్నాబాధపడరాదు. వారి శక్తి మేరకు కార్తిక పురాణం, చదువుతూ, మనసులో శివ శంకర, శంభో హార హార అనుకుంటే అనంతమైన ఫలితం ఉంటుంది. దూర్జటి రాసిన శ్రీ కాళహస్తిశ్వర శతకం లో శివదేవుని వైశిష్టం గురించి వర్ణింపబడింది. అందులో శివుణ్ణి గురించి, పూజా విధానం గురించి చెప్పబడింది. శివ కథ విన్నా, చూసినా ఎంతో పుణ్య ఫలం కలుగుతుంది. శివరాత్రి రోజు "శివా కరుణించవా, నువ్వే మాకు శరణం శంభో హార హార "అని మనం ఉచ్చరించే మాటలు శివునికి ప్రీతి. మనమందరం ఆ పరమ శివునికి ముకుళిత హస్తాలతో, భక్తి ప్రపత్తులతో పూజిద్దాం.

**- కనుమ ఎల్లారెడ్డి,**

ఆధ్యాత్మికం

# స్కిన్ కేర్‌పై ఆసక్తి



**టీనేజర్లలో** తెలియకుండానే స్కిన్ కేర్‌పై ఆసక్తి మొదలవుతుంది. వీళ్లకి పిల్లలవీద వాడలేము, అలాగని పెద్దవాళ్లవీ సరిపడవు. కాస్త పెద్దయ్యాక స్కిన్ రేర్ రొటీన్ అనుకుంటిం. కానీ, ఇప్పటినుంచి ప్రారంభించొచ్చు అంటారు నిపుణులు. హార్మోనుల్లో మార్పులతో చర్మ తీరులో మారు లొస్తాయి. అతిగా విడుదలయ్యే నూనెలు యాక్నేకి దారి తీస్తాయి. మనకు చిన్నవే కానీ వారి ఆత్మ విశ్వా సాన్ని దెబ్బ తీస్తాయి. పైగా ఇప్పటి నుంచి తీసుకునే జాగ్రత్త అడపాదడపా పలకరించే యాక్నే, స్నేహితుల ప్రభావం ఏదైతేనేం. దీర్ఘ కాలంలో సాయపడుతుంది కూడా! మామూలుగానే వీరికి సీబమ్ ఎక్కువగా విడుదలవుతుంది. అంతమాత్రాన జిడ్డు చర్మం అనుకోవాల్సిన పనిచేలేదు. అందుకోసం జిడ్డు, పొడి కాంబినేషనల్ వాళ్లది ఏ చర్మతీరో ఒక రోజంతా గమనించండి. దాని ఆధారంగా ఫేస్‌వాష్‌నో సబ్బునో ఎంపిక చేస్తే సరి. ఉదయం, రాత్రి నిద్రపోయే ముందు తప్పక ముఖం శుభ్రం చేసుకునేలా చూడాలి. జిడ్డు చర్మతత్వం అయినా సరే, మాయిశ్చరైజర్ తప్పక వాడాలి. లైట్ వెయిట్ రకాలను ఎంచుకుంటే చర్మానికి తేమా అందుతుంది. యుకె కూడా దరిచేరదు. వాటితోపాటు ఎండలో తిరిగే అవకాశముంటే సన్‌స్క్రీన్‌నీ జోడిస్తే సరి పోతుంది. వీళ్ల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి, అలర్జీలు, దురదలకు అస్కారమెక్కువ. కాబట్టి, ఉత్పత్తుల్లో ఆల్కహాల్, సల్ఫేట్లు, గాఢ రసాయనాలు, కృత్రిమ సువాసనలు లేకుండా చూసుకోవాలి. బిపిఎ, థాలేట్లు, పారాబెన్లు ఉన్నవాటికీ దూరంగా ఉంచాలి.


# బీట్‌రూట్ ఖర్జూరం హల్వా



**కావాలసినవి :** బీట్‌రూట్ రసం-కప్పు, ఖర్జూరం-10 (వేడి నీళ్లల్లో కడిగి..కాసేపు నానబెట్టి, గుజ్జులా చేసుకోవాలి) పంచదార- పావు కప్పుపైనే, నెయ్యి-పావు కప్పు, ఏలకులు 2 . జీడి పప్పు-15 పైనే ఫుడ్‌కలర్- కొద్దిగా,

ముందుగా స్టవ్ ఆన్ చేసుకుని.. మంట చిన్నగా పెట్టుకోవాలి. కళాయి వేడికా గానే.. 1 టేబుల్ స్పూన్ నెయ్యి వేసుకుని.. అందులో జీడిపప్పు దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. అనంతరం కళాయిలో ఇంకాస్త నెయ్యి వేసి.. ఖర్జూరం గుజ్జు వేసుకుని తిప్పుతూ ఉండాలి. మధ్యమధ్యలో నెయ్యి వేసుకుంటూ బాగా కలపాలి. తర్వాత సరిపడా పంచదార, బీట్‌రూట్ రసం, ఫుడ్ కలర్ వేసుకుని చిన్నగా గరిటెతో తిప్పుతూ ఉడికించుకోవాలి. మళ్లీ కొద్దిగా నెయ్యి వేసుకుని తిప్పాలి. ఏలకులు, జీడిపప్పు వేసుకుని కలపాలి. మిగిలిన నెయ్యి మొత్తం వేసుకుని. తప్పుతూ దగ్గర పడగానే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ లోపలంతా నెయ్యిరాసి. ఆ మొత్తం మిశ్రమాన్ని.. దానిలోకి తీసుకోవాలి. కాస్త చల్లారాక నచ్చిన షేప్‌లో కట్ చేసుకుంటే సరిపోతుంది.


# జెనీవా ఓపెన్‌లో ఛాంపియన్‌గా జోకోవిచ్



**న్యూఢిల్లీ:** జెనీవా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌గా టెన్నిస్ దిగ్గజం, సెర్బియాకు చెందిన నోవాక్ జోకోవిచ్ నిలిచాడు. జెనీవాలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ జోకోవిచ్ 5-7, 7-6 (7/2)తో పోలాండ్‌కు చెందిన హుబర్ట్ హుర్కాజ్‌పై విజయం సాధించాడు. తొలి సెట్‌లో పరాజయం పాలైన జోకో హోరాహోరీగా సాగిన మిగిలిన రెండు సెట్‌లను టై బ్రేకర్ ద్వారా గెలుచుకున్నాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హుర్కాజ్ 19 ఏస్‌లు సంధించగా, జోకోవిచ్ 6 ఏస్‌లకే పరిమితమైనా కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టాడు. హుర్కాజ్ 112 పాయింట్లు నెగ్గగా, జోకో 121 పాయింట్లు సాధించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 99వ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్న జోకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో జెనీవా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌గా నిలవడంతో తన ఖాతాలో 100వ సింగల్స్ టైటిల్‌ను వేసుకున్నట్లయింది. తద్వారా ఓపెన్ ఎరాలో వందో సింగిల్స్ టైటిల్స్ సాధించిన మూడో ప్లేయర్‌గా జోకోవిచ్ రికార్డుల్లోకి ఎక్కాడు. జిమ్మి కానర్స్ 109, అమెరికా), రోజర్ ఫెదరర్ (103, స్విట్జర్లాండ్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కాగా మరొక టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమైన నేపథ్యంలో మరోసారి విజేతగా నిలిచేందుకు సిద్దమవుతున్నాడు. మట్టి కోర్టులో జరగనున్న ఈ ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన అమెరికాకు చెందిన మెకెంజీ మెక్‌డోనాల్డ్‌తో జోకోవిచ్ తలపడనున్నాడు.

# డ్యూరాండ్ కప్‌కు వేదిక ఖరారు

## 5 రాష్ట్రాల్లో ఫుట్‌బాల్ టోర్నీ



**న్యూఢిల్లీ:** ఆసియాలోనే పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నమెంట్ అయిన డ్యూరాండ్ కప్ -2025 ఎడిషన్ ఖరారైంది. ఈ టోర్నీ జులై 23 నుండి ఆగస్టు 23 వరకు దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరుగుతుందని పోటీ నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. ఈ టోర్నమెంట్ కోసం పశ్చిమ బెంగాల్, అస్సాం, మణిపూర్, మేఘాలయ మరియు జార్ఖండ్‌లలో ఆరు వేదికలను ఖరారు చేశారు. నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సి డిఫెండింగ్ ఛాంపియన్, గత సంవత్సరం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో అత్యధిక టైటిల్ విజేత మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌ను ఓడించి చారిత్రాత్మక తొలి టైటిల్‌ను సాధించింది. రెండేళ్ల తర్వాత ఇంఫాల్ ఈ టోర్నమెంట్‌కు వేదికగా తిరిగి రాగా, కోక్రాఝర్ వరుసగా మూడో సంవత్సరం ఆతిథ్యం ఇవ్వనుంది. గత సంవత్సరం జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ మరియు మేఘాలయలోని షిల్లాంగ్ ఆతిథ్య దేశాలుగా చేర్చబడ్డాయి. మూడు సర్వీసుల తరపున భారత సైన్యం యొక్క తూర్పు కమాండ్ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్, భారతదేశంలోని అత్యుత్తమ ఫుట్‌బాల్ క్లబ్‌లతో సర్వీసెస్ జట్లను పోటీ పడుతోంది. మరియు గత రెండు ఎడిషన్‌లలో, పొరుగు దేశాల నుండి ఆర్మీ జట్లతో విదేశీ భాగస్వామ్యం కూడా కనిపించింది.

### మహిళల ఎయిర్ రైఫిల్‌లో..

# శాంభవికి స్వర్ణం

## ఓజస్వికి రజతం.. 8 పతకాలతో టాప్‌లో భారత్

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగుతున్నది జూనియర్ ప్రపంచ కప్-2025లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన శాంభవి శ్రవణ్ క్షీర్‌సాగర్ బంగారు పతకం సాధించింది. జర్మనీలోని సుహ్ల్‌లో ఆదివారం జరిగిన ఈ రైఫిల్ ఈవెంట్‌లో శాంభవితో పాటు, మరో భారతీయ క్రీడాకారిణి ఓజస్వి ఠాకూర్ రజత పతకాన్ని గెలుచుకుంది. తన సహచరురాలు ఓజస్వి ఠాకూర్ నుండి గట్టి సవాలు ఎదురైనప్పటికీ, క్షీర్‌సాగర్ ప్రారంభం నుండే ఆధిక్యంలో ఉండటంతో ఆమె విజయం మరింత సులభతరమైంది. ఈ జంట చైనాకు చెందిన లి





షిజియాతో కలిసి బాగా ఆరంభించింది, ఇటలీకి చెందిన కార్లోటా సలాఫియా మరియు చైనాకు చెందిన ఒలింపిక్ రజత పతక విజేత హువాంగ్ యుటింగ్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో నరెయిన్ ప్రణవ్ వనితా సురేష్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా బంతిని రోలింగ్ చేసింది, ఆ తర్వాత పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో ముఖేష్ నెలవల్లి తన పతకాన్ని సాధించాడు.

పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో యువ షూటర్ నరేన్ ప్రణవ్ కాంస్యపతకంతో మెరిశాడు. ఇటీవలే ఖేలోఇండియా యూత్‌గేమ్స్‌లో మెరిసిన ప్రణవ్ 227.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.



# ఐపీఎల్‌లో అట్టర్ ఫ్లాప్

## సెలక్టర్ల దృష్టిలో సూపర్ హిట్

### టీమిండియాలో ఈ ప్లేయర్లు రాణించేనా?

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఐపీఎల్ 2025లో అట్టర్ ఫ్లాప్ అయిన ప్లేయర్లకు భారత్ కొత్త టీమ్‌లో అగ్రస్థానం లభించింది. పేలవ ప్రదర్శనతో ఇచ్చిన కొంతమందికి ఇండియా టెస్ట్ టీమ్‌లో స్థానం కల్పించారు. జూన్ 20 నుండి ఇంగ్లండ్‌తో జరిగే 5 టెస్టుల సిరీస్‌లో ఈ ఆటగాళ్లు ఎలా రాణిస్తారో అనేదానిపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఐపీఎల్‌లో వీరి ప్రస్తుత ఫామ్‌ను బట్టి చూస్తే, క్లిష్టమైన ఇంగ్లండ్ పర్యటన భారత జట్టుకు చాలా కష్టంగా ఉండబోతోందనేది మాత్రం స్పష్టమవుతోంది. ప్రస్తుత ఐపీఎల్‌లో తీవ్రంగా విఫలమవుతోన్న 6 గురు ఆటగాళ్ళు ఉన్నారు. రెండు ఫార్మాట్లు భిన్నంగా ఉన్నప్పటికీ, ఈ ఆటగాళ్ళు ఇంగ్లాండ్‌లో ఎలా రాణిస్తారనేది సందేహాస్పదమవుతోంది. ఈ ఐపీఎల్‌లో రిషబ్ పంత్ బ్యాట్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఇది అతని జట్టును కూడా ప్రభావితం చేసింది. లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఐపీఎల్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడైన పంత్ ఈ సీజన్‌లో 13 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 13.72 సగటుతో 153 పరుగులు మాత్రమే చేశాడు. అతని పేలవమైన ప్రదర్శన ఉన్నప్పటికీ, అతన్ని భారత్ టెస్ట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ ఈ ఐపీఎల్‌లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. అతను 12 మ్యాచ్‌ల్లో 182 పరుగులు చేసి రెండు వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. అయితే, అతను ఇప్పటివరకు 5 టెస్ట్ మ్యాచ్‌ల్లో 37.25 సగటుతో 298 పరుగులు చేశాడు. ఇది కాకుండా 5 వికెట్లు కూడా తీసుకున్నాడు. అలాగే ఈ ఐపీఎల్‌లో తన తొలి మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, కరుణ్ నాయర్ బ్యాట్ మూగబోయింది. అతను 7 మ్యాచ్‌ల్లో కేవలం 22 సగటుతో 154 పరుగులు చేశాడు. అతని ప్రస్తుత ఫామ్‌ను పరిశీలిస్తే, అతను ఇంగ్లాండ్‌లో కఠినమైన పరీక్షను ఎదుర్కోవలసి ఉంటుంది. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ సీజన్‌లో బ్యాటింగ్, బంతితో దారుణంగా విఫలమయ్యాడు. 5 మ్యాచ్‌ల్లో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు పడగొట్టాడు. అతను టెస్ట్ క్రికెట్‌లో 9 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 468 పరుగులు చేసి 25 వికెట్లు పడగొట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ ప్రదర్శన ఈ సీజన్‌లో చాలా నిరాశపరిచింది. 6 మ్యాచ్‌ల్లో కేవలం 3 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. టెస్ట్ క్రికెట్‌లో 7 టెస్ట్ మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. కాగా లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించాడు. కానీ, ఆ తర్వాత అతను వైఫల్యం చెందాడు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా, అతను టెస్ట్ క్రికెట్‌లో 11 మ్యాచ్‌లు ఆడి 31 వికెట్లు పడగొట్టాడు.

# టెస్ట్‌లో ఇంగ్లండ్ విజయం

## జింబాబ్వే 45 పరుగుల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు సొం గడ్డపై ఇంగ్లండ్ అదరగొట్టింది. జింబాబ్వేతో 22 ఏళ్ల తర్వాత ఆడిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్, 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన ఈ నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ సంపూర్ణ ఆధిపత్యం కనపర్చగా, జింబాబ్వే ఏ మాత్రం ప్రభావం చూపలేక



పోయింది. ఓవర్ నైట్ స్కోరు 30/2తో మూడో రోజు ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే చివరకు 59 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌట్ అయింది. సీన్ విలియమ్స్ 82 బంతుల్లో 88 పరుగులు, 16 ఫోర్లు, సికిందర్ రజా 68 బంతుల్లో 60 పరుగులు, 10 ఫోర్లు చేసి అర్ధ శతకాలతో పోరాడారు. ఈ జంట బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మెరుగ్గా కనిపించిన జింబాబ్వే, ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకునేలా అనిపించినా, ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఈ ఇద్దరిని పెవిలియన్‌కు పంపి జింబాబ్వే ఆశలపై నీళ్లు చల్లాడు.

ఈ జంట మూడో వికెట్‌కు 122 పరుగులు జోడించింది. బెన్ కరన్ 37 పరుగులు, వెస్లీ మధెవెరె 31 పరుగులతో ఫర్వాలేదనిపించినా, కెప్టెన్ ఇర్విన్ 2 పరుగులు, బెనెట్ 1 పరుగు, తఫద్జా 4 పరుగులు, బ్లెస్సింగ్ ముజర్‌బానీ 4 పరుగులతో విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బషీర్ 6 వికెట్లతో సత్తా చాటాడు. అంతకు ముందు ఇంగ్లండ్ 6 వికెట్లు నష్టపోయి 565 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన బషీర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# అత్యధిక గోల్డ్ నిల్వలున్న దేశాలివే..


**ముంబై, మే 25:** ప్రపంచంలోనే అత్యంత విలువైన లోహాలలో బంగారం ఒకటి. పురాతన కాలం నుండి బంగారాన్ని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. ఈ లోహాన్ని కనీసం 5,000 సంవత్సరాల క్రితం పురాతన ఈజిప్టు నుండి ఉపయోగించారు. అక్కడ దీనిని సమాధులు, దేవాలయాలు, ఇతర వస్తువులను అలంకరించడానికి ఉపయోగించారు. ఆధునిక కాలంలో కూడా బంగారాన్ని కరెన్సీ, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక బంగారు నిల్వలు కలిగిన మొదటి



ఐదు దేశాల గురించి తెలుసుకుందాం. ఆస్ట్రేలియా యుఎస్ జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) డేటా ప్రకారం, ఆస్ట్రేలియా ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వలను కలిగి ఉంది. 10,000 టన్నులు, ఎన్ఎస్ ఎనర్జీ నివేదించింది. 2019లో, చైనా, భారతదేశం తర్వాత ఆస్ట్రేలియా రెండవ అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా నిలిచింది. దాని ఉత్పత్తి స్థాయిని 2018లో 315 టన్నుల నుండి 330 టన్నులకు పెంచింది. న్యూ సౌత్ వేల్స్‌లోని న్యూక్రెస్ట్‌లో ఉన్న కాడియా వ్యాలీ గని ప్రపంచంలోని అతిపెద్ద బంగారు నిక్షేపాలలో ఒకటి. ప్రపంచంలోనే అతిపెద్ద మైనింగ్ కంపెనీ అయిన బిహెచ్‌పి ప్రధాన కార్యాలయం మెల్‌బోర్న్‌లో ఉంది. రెండవ అతిపెద్ద కంపెనీ రియో టింటో, ఆస్ట్రేలియాలో అనేక గనులను కలిగి ఉంది. రష్యా యుఎస్‌జిఎస్ జాబితా ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యా 5,300 టన్నులతో రెండవ స్థానంలో ఉంది. 2019లో రష్యా మూడవ అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా నిలిచింది. రష్యాలోని తూర్పు సైబీరియాలోని క్రాస్నోయార్స్క్ ప్రాంతంలో ఉన్న పాలియస్ గోల్డ్ ఒలింపియాడా బంగారు గని, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆపరేటింగ్ బంగారు గని. దక్షిణాఫ్రికా 3,200 టన్నుల బంగారు నిల్వలతో దక్షిణాఫ్రికా అతిపెద్ద బంగారు గనుల నిల్వల జాబితాలో మూడవ స్థానంలో ఉంది. 2006 వరకు, దక్షిణాఫ్రికా ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం ఉత్పత్తి చేసే దేశంగా ఉండేది. 1970లో, దక్షిణాఫ్రికా ఇప్పటివరకు అత్యధికంగా 995 టన్నుల బంగారు ఉత్పత్తిని ఉత్పత్తి చేసింది. దీని ఉత్పత్తి 2018లో 117 టన్నుల నుండి 2019లో 90 టన్నులకు తగ్గింది. అమెరికా యునైటెడ్ స్టేట్స్ 3,000 టన్నుల బంగారు నిల్వలను కలిగి ఉంది. ప్రపంచంలో నాల్గవ స్థానంలో ఉంది. దీని ఉత్పత్తి స్థాయి 2018లో 226 టన్నుల నుండి 2019లో 200 టన్నులకు పడిపోయింది. న్యూమాంట్ నెవాడాలో కార్లిన్ ట్రెండ్ గనిని కలిగి ఉన్నాయి.

# బ్యాంకుల స్కామ్‌కు చెక్!

**న్యూఢిల్లీ, మే 25:** భారతదేశంలో త్వరలో బ్యాంకులు ఇన్‌కమింగ్ కాల్ సామర్థ్యాలతో వ్యక్తిగత జాతీయ కాలింగ్ నంబర్‌లను ఉపయోగించే అవకాశం ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యలు ద్వారా అధికారిక కాల్స్‌ను కస్టమర్‌లు సులభంగా గుర్తించవచ్చు. అలాగే బ్యాంకింగ్ రంగ మోసాలు కూడా తగ్గే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకులు 1600 ఎక్స్‌ఎక్స్ సిరీస్‌లోని మల్టీ అవుట్‌బౌండ్‌ఓన్లీ నంబర్‌లను ఉపయోగిస్తున్నాయి. అయితే ఇవి ఇన్‌కమింగ్ కాల్స్‌కు మద్దతు ఇవ్వవు. కాబట్టి ప్రస్తుతం బ్యాంకులు ప్రతి బ్యాంకుకు ఒక ప్రత్యేకమైన జాతీయ నంబర్‌ను కేటాయించే వ్యవస్థను ప్రతిపాదించాయి. ముఖ్యంగా 1600 ఎక్స్‌ఎక్స్ సిరీస్‌లో ఉండే నంబర్ ద్వారా ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ సామర్థ్యాలతో వస్తుంది. ప్రతి బ్యాంకుకు ఒక జాతీయ నంబర్, అలాంటి నంబర్లకు ఇన్‌బౌండ్ కాల్‌లను అనుమతించడం వల్ల కస్టమర్ భద్రత, అనుభవం మరింత మెరుగు పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపాయని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయితే రుణ రికవరీ కోసం ఈనంబర్లనే ఉపయోగించే అవకాశం ఉందని చెబుతున్నారు. కానీ ఈ విధానాన్ని కొన్ని బ్యాంకులు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా బ్యాంకులు తమ రికవరీ ప్రక్రియలను అవుట్‌సోర్స్ చేస్తున్నందున మూడో పార్టీ ఏజెంట్లు కూడా




1600ఎక్స్‌ఎక్స్ సిరీస్‌ను ఉపయోగించాల్సి ఉంటుందా. లేదా? అనే దానిపై అనిశ్చితి ఉంది. ఈ విషయంపై ఆర్‌బీఐ, టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నుంచి స్పష్టత కోరుతున్నట్లు పలువురు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అదనంగా బ్యాంకులు 1600 ఎక్స్‌ఎక్స్ నంబర్ల వాడకంపై స్పష్టమైన మార్గదర్శకాలను, సంప్రదించడానికి ముందస్తు అనుమతి ఇచ్చిన క్లయింట్‌లకు మినహాయింపులను అభ్యర్థిస్తున్నాయని పేర్కొంటున్నారు.

# వాణిజ్యం

# అందుబాటులోకి శాటిలైట్ ఇంటర్నెట్

**ముంబై, మే 25:** దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌తో పాటు ఇతర కంపెనీలు ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి. అయితే, తొలి దశలో యూజర్లను ఆకట్టుకునేందుకు తక్కువ ధరలోనే డేటా సేవలను ఆయా కంపెనీలు అందించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నెలకు 10 డాలర్ల కంటే తక్కువ అంటే రూ.840లోపే ఈ ప్లాన్ ధరలు ఉండొచ్చని చెబుతున్నారు. ఆ ధరకే అపరిమిత డేటా అందించే అవకా శం ఉందనిపేర్కొంది. తొలుత ఆయా కంపెనీలు తమ యూజర్ బేస్‌ను పెంచుకోవడంపై దృష్టి సారించే అవకాశం ఉంది. 10 మిలియన్ కస్టమర్లను చేరుకోవడం ద్వారా స్పెక్ట్రమ్ కాస్ట్‌ను భర్తీ చేసుకోవడం సాధ్యమవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి ఒక్కో అర్బన్ యూజర్ నుంచి రూ.500 చొప్పున ఫీజు వసూలు చేయాలని ట్రాయ్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సాధారణ సర్వీసులతో పోలిస్తే ఈ మొత్తం చాలా అధికం. దీనికితోడు సర్దుబాటు చేసిన స్థూల ఆదాయంలో 4 శాతం లెవీగా చెల్లించాలని ట్రాయ్ పేర్కొంది. లీజ్డ్ స్పెక్ట్రానికి ఏడాదికి కనీసం రూ.3500 వార్షిక ఫీజును ట్రాయ్ ప్రతిపాదించింది. దీనికి ఇంకా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఈ స్థాయిలో లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ ఛార్జీలు ఉన్నప్పటికీ వినియోగదారులను పెంచుకునేందుకు తక్కువ ధరకే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు దేశీయంగా సర్వీసులు ప్రారంభించడానికి స్టార్ లింక్‌కు టెలికాం విభాగం



నుంచి అనుమతులు లభించాయి. ఇంకా ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ ఆమోదం తెలపాల్సి ఉంది. స్టార్‌లింక్‌తో పాటు యూటెల్సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ కూడా డాట్ నుంచి అనుమతులు పొందినా ఇన్‌స్పేస్ నుంచి తుది అనుమతుల కోసం వేచి చూస్తున్నాయి. ఈ అనుమతులు లభిస్తే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలోనే పౌరులకు అందుబాటులోకి రానున్నాయి.

# వజ్రాలకు పెరుగుతున్న డిమాండ్

**ముంబై, మే 25:** భారత్‌లో వజ్రాల వినియోగం 2030 నాటికి రెట్టింపు అవుతుందని భావిస్తున్నట్లు డీబీర్స్ గ్రూప్ కంపెనీ సిఇఒ తెలిపారు. భారత్‌లో ఫరెవర్ మార్క్ బ్రాండ్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సహజ వజ్రాభరణాలకు భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు తెలిపారు. గతేడాది చైనాను అధిగమించినట్లు చెప్పారు. యేటా 12 శాతం చొప్పున డిమాండ్ పెరుగుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌తో సహజ వజ్రాభరణాల డిమాండ్ 10 బిలియన్ డాలర్లలోపు ఉన్నట్లు చెప్పారు. భవిష్యత్ వృద్ధి పట్ల ఆశావహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ ముంబైలో రెండు చొప్పున మొత్తం నాలుగు ఫరెవర్‌మార్క్ స్టోర్లను తెరవనున్నట్లు వచ్చే ఐదేళ్లలో 100 స్టోర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. కంపెనీ సొంత స్టోర్లతో పాటు, ఫ్రాంచైజీ రూపంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల పరిధిలో ఇవి ఉంటాయన్నారు. ల్యాబ్ గ్రోన్ వజ్రాలకు వాణిజ్యపరంగా భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కుక్ చెప్పారు. ఎల్‌జిడిల టోకు ధరలు 90శాతం వరకు పడిపోయినట్లు తెలిపారు.



# సుజుకీ ఇ-యాక్సెస్ తయారీ షురూ

**ముంబై, మే 25:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా తన పాపులర్ స్కూటర్ యాక్సెస్‌లో ఈవీ వేరియంట్‌ను తీసుకొస్తోంది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తొలిసారిగా ప్రదర్శించిన ఇయాక్సెస్ తయారీని గురుగ్రామ్ ప్లాంట్‌లో ప్రారంభించినట్లు తెలిపింది. త్వరలోనే ఈవీకి మార్కెట్లోకి విడుదల చేయనుంది. విద్యుత్ స్కూటర్ విభాగంలోకి సుజుకీ అడుగుపెట్టాలని చాలా కాలంగా చూస్తోంది. ఇయాక్సెస్‌తో ఎంట్రీ ఇవ్వాలని ప్రణాళికలు రచిస్తోంది. దీర్ఘకాల మన్నిక, అత్యుత్తమ థర్మల్ స్టెబిలిటీతో కూడిన ఇటెక్నాలజీతో ఈ విద్యుత్తు స్కూటర్‌ను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. లిథియం ఐరన్ ఫాస్పేట్ బ్యాటరీ ఈ స్కూటర్‌ను తీసుకొస్తున్నారు. రీ జెనరేటివ్ బ్రేకింగ్, ఫ్రీ బెల్ట్ డ్రైవ్ సిస్టం, రివర్స్ మోడ్ తో పాటు (ఎకో మోడ్, రైడ్ మోడ్ ఏ, రైడ్ మోడ్ బీ) అనేక రకాల రైడింగ్ మోడ్స్‌తో రానుంది. సుజుకీ కొత్త విద్యుత్ స్కూటర్ ఇయాక్సెస్ 3కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో తీసుకొస్తున్నారు.



ఇది 95 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. పోర్ట బుల్ ఛార్జర్‌తో 6 గంటలు 12 నిమిషాల్లో ఫుల్ ఛార్జ్, ఫాస్ట్ ఛార్జర్‌తో అయితే 2గంటల 12 నిమిషాల్లో ఛార్జ్ పూర్తవు తుందని కంపెనీ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.